

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 11-5-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 25 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా.8.02 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: స్వాతి పూర్తి, వర్జ్యం: ఉ.9.33-ఉ.11.21, దుర్ముహూర్తం: సా.4.52-5.43, అమృతఘడియలు: రా.8.22-10.10, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విరమణ.. ఉల్లంఘన

సాయంత్రం దాదాపు ఐదు గంటలు! భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన! ఆ తర్వాత పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇంషాక్ దార్ సమర్థన! సాయంత్రం ఆరు గంటలకు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి నిర్ధారణ! సాయంత్రం ఐదు గంటల నుంచే ఇరు దేశాల మధ్య పూర్తిస్థాయి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని ప్రకటన! యుద్ధం నిలిచినందుకు ఇరు దేశాల ప్రజల్లోనూ ఓ ఊరట! ఇప్పటికైనా ప్రశాంతత నెలకొంటుందనే ఓ ఆశాభావం!

రాత్రి 9 గంటలు! మోసమే జీవన వేదంగా భావించే పాకిస్థాన్ తన వక్ర బుద్ధిని మరోసారి ప్రదర్శించింది! ఒప్పందం కుదిరి నాలుగు గంటలు కూడా కాకుండానే కాల్పుల విరమణను యథేచ్ఛగా ఉల్లంఘించింది! భారత్, పాక్ సరిహద్దు వెంబడి పెద్దసంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది! మన సైనిక పోస్టులపై పెద్దఎత్తున కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఆర్ ఎస్ పురలో బీఎస్ఎఫ్ ఎస్సై ఒకరు వీర మరణం కూడా పొందారు!

మరి.. ఇప్పుడు కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నట్లా? లేనట్లా? పాక్ దిగొచ్చిందా!? పాకిస్థాన్ నమ్మక ద్రోహంపై భారత్ ఏం చేయనుంది!? భారతీయులందరిలోనూ ఇదిప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!!

కాల్పుల విరమణకు భారత్, పాక్ ఓకే.. ఒప్పందం కుదిరిన గంటల్లోనే పాక్ ఉల్లంఘన

- రాత్రంతా జరిపిన చర్చలు ఫలించాయి: ట్రంప్
- వెంటనే, పాక్ విదేశాంగ మంత్రి దార్ సమర్థన
- విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని పోస్టు
- **పాక్ దిగి వచ్చింది.. ఆ దేశ డీజీఎంవో ఫోన్ చేశారు**
- మన డీజీఎంవో అంగీకారం.. మళ్లీ రేపు ఇరు దేశాల డీజీఎంవోల భేటీ: విక్రమ్ మిస్రి
- సింధు నిలిపివేత, వీసా ఆంక్షలు కొనసాగుతాయి
- భారత్‌పై ఉగ్ర దాడులను యుద్ధంగా పరిగణిస్తాం
- మన షరతుల ప్రకారమే విరమణ ఉండాలన్న మోదీ
- **ఆ తర్వాత 4 గంటలకే పాక్ సైన్యం ఉల్లంఘన**
- డ్రోన్లతో దాడి.. బీఎస్ఎఫ్ ఎస్సై వీర మరణం
- పేలుళ్లు జరుగుతున్నాయి.. ఒప్పందం ఎక్కడ?: ఒమర్
- కశ్మీరు నుంచి గుజరాత్ వరకూ మళ్లీ చిమ్మ చీకట్లు
- పాక్ మళ్లీ కాల్పులు జరుపుతోంది.. ఖండిస్తున్నాం
- సీరియస్‌గా తీసుకుంటాం.. ప్రతిచర్య తప్పదు: మిస్రి


విరమణతో వెలుగులు
కాల్పుల విరమణ ప్రకటన తర్వాత శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ వద్ద జన సంచారంతో కళకళ

న్యూఢిల్లీ, మే 10: కొన్ని గంటల్లోనే.. పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. శ్రీనగర్‌లో భారీ పేలుళ్లు వినిపిస్తున్నాయి. ఉధంపూర్, బారాముల్లా, ఆర్ ఎస్ పుర తదితర సెక్టార్లలోని భారత సైనిక పోస్టులపై పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది! శ్రీనగర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, ఉధంపూర్, బార్మర్ తదితర ప్రాంతాల్లో యథావిధిగా చిమ్మ చీకట్లు నెలకొన్నాయి! పంజాబ్ గురుద్వారా సమీపంలో పేలుళ్లు! ఆర్ఎస్ పురలో పాక్ కాల్పులకు బీఎస్ఎఫ్ ఎస్సై ఇంతియాజ్ వీర మరణం పొందారు. పాక్ నిరంతరాయంగా ప్రయోగిస్తున్న డ్రోన్లను భారత్ అడ్డుకుని

మిగతా 12వ పేజీలో...

పాక్ ఎయిర్‌బేస్‌లపై విరుచుకుపడ్డ భారత్

- 8 కీలక ప్రాంతాల్లో క్షిపణులతో దాడి
- సైనిక స్థావరాలు, రాడార్ స్టేషన్లు, ఆయుధాగారాల ధ్వంసం
- శుక్రవారం అర్ధరాత్రి అనంతరం డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాక్ యత్నం
- విజయవంతంగా అడ్డుకున్న భారత్
- ఎస్ 400 వ్యవస్థను ధ్వంసం చేశామన్న పాక్ ప్రచారం అవాస్తవం
- లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వెల్లడి


ఉల్లంఘనతో చీకట్లు
పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘనతో శ్రీనగర్‌లో శనివారం రాత్రి లైట్లు ఆర్పివేసిన దృశ్యం

- **మోదీ నేతృత్వంలో అత్యున్నత స్థాయి సమావేశం**
- ప్రధాని అధ్యక్షతన అఖిలపక్షం పెట్టండి.. పార్లమెంట్ నిర్వహించండి: కాంగ్రెస్
- **అప్పు కోసం తప్పుకుందా?..** విరమణ పాటించాలని ఐఎంఎఫ్ పట్టుబట్టిందా? ఆపై అమెరికా ఒత్తిళ్ల ప్రభావం.. ఇప్పటికే దివాలా అంచుల్లో పాకిస్థాన్

పాకిస్థాన్‌కు పెద్ద దెబ్బే

- సింధూ జలాల ఒప్పందం రద్దు
- పాక్ జాతీయులకు వీసాల తిరస్కరణ
- ఎగుమతులు/దిగుమతులపై నిషేధం
- పాక్ నౌకలకు భారత పోర్టుల్లోకి నో ఎంట్రీ
- పీవోకేలోని ఉగ్రవాద శిబిరాల ధ్వంసం
- బలూచిస్థాన్‌పైనా కోల్పోయిన పట్టు!

ఐదుగురు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు హతం

- 'కాందహార్ విమాన' హైజాక్ సూత్రధారి కూడా..
- ఆపరేషన్ సిందూర్‌లో మట్టుబెట్టిన భారత సైన్యం
- అంత్యక్రియల్లో పాల్గొన్న పాక్ అత్యున్నతాధికారులు
- పాక్ సైన్యం, ప్రభుత్వ ఉగ్ర లింకులు బట్టబయలు

తడబాటు లేదు.. గడబిడా లేదు!

- పట్టు సడలించకుండా భారత్ దూకుడు
- పాక్‌కు ఊపిరి సలపనివ్వని మన సైన్యం
- శత్రు భూభాగంలోకి చొరబడి మరీ క్షిపణుల వర్షం
- ఆ దేశ ఆయుధ, రక్షణ వ్యవస్థలు నిర్వీర్యం


అగ్నివీరా అమర్‌రహే

- స్వగ్రామానికి మురళీనాయక్ పార్థివదేహం
- మంత్రి సవిత, మహారాష్ట్ర మంత్రి నివాళి
- దారి పొడవునా భారీగా తరలివచ్చిన జనం
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

14


బెంగళూరులో నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

ఉగ్రభూత పీచమణచగా..



పహల్గాంలో ఉగ్రమూకలు కర్కశంగా దాడి చేసి 26 మందిని హతమార్చిన తర్వాత రగిలిపోయిన ప్రధాని పాకిస్థాన్‌పై దాడికి త్రివిధ దళాలను సిద్ధం చేసి ప్రతి దాడులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి వ్యవహరించిన, వ్యవహరిస్తున్న తీరు ఇంటా బయటా ఆయన ప్రతిష్ఠను అమాంతం పెంచింది.

> మన దేశం చివరిసారిగా 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. అప్పుడే పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి సామర్థ్యాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ మనవైపు చెప్పుకోదగిన నష్టం ఏమీ జరగలేదు.

తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలనుకుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి. కశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే కాల్చి చంపిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా మన దేశాన్ని పాకిస్థానే యుద్ధ రంగంలోకి లాగింది.

> పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలిటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరు. గతంలో ఎంతో మంది సైన్యాధ్యక్షులు ప్రధానమంత్రులను తొలగించి పాలనా పగ్గాలు చేపట్టడం చూశాం! అదే సమయంలో ఉగ్రవాద సంస్థలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి సైన్యానికి కూడా లేదు.

ప్రపంచ చరిత్రలో ఉగ్రవాదంగానీ, తీవ్రవాదంగానీ సఫలమైన దాఖలాలు లేవు. బుల్లెట్లను, హింసను నమ్ముకున్న వారు వాటికే బలయ్యారు.

> ఉగ్రవాదుల చేతిలో చనిపోయిన వారు చేసిన పాపం ఏమిటి? వారు ఏ హాని చేశారు? మతం అడిగి మరీ చంపడమా? ఈ దుశ్చర్యను ఇస్లాం సమర్థిస్తుందా? ఎన్నటికీ కాదు! నిజంగా ఇస్లాంను ఆచరించే వారు ఇతరులకోసం ప్రాణాలను ఇస్తారు కానీ ప్రాణాలను తీయరు.

దాయాది దేశాల మధ్య యుద్ధం ఎందుకని ప్రశాంతంగా ఆలోచిస్తే ఏ సమస్యా ఉండదు. పాకిస్థాన్‌ను ఇప్పుడు ఉగ్రవాదులు పాలిస్తున్నారు. కాబట్టే విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారు.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో

దేశమే ముందు!

దేశానికి కష్టమొస్తే కలిసి నడవాలి.. ప్రపంచాన్ని పీడిస్తున్న ఉగ్రవాదం

- త్రివిధ దళాలకు మద్దతుగా ఉందాం
- కాల్పుల విరమణ శుభపరిణామం
- కేంద్రానికి అండగా ఉంటాం: బాబు
- కుల మతాల ఐక్యతే బలం: పవన్
- రాజ్‌భవన్‌లో సర్వమత సమావేశం
- పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం


గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయిన చంద్రబాబు, పవన్

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): "దేశానికి కష్టమొస్తే సంఘటితంగా ఉండటంతోపాటు కలిసికట్టుగా నడవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా దేశానికి కష్టమొస్తే దేశమే ముందు అనేది అందరి నినాదం

మిగతా 14వ పేజీలో...

లిక్కర్ బాస్‌ల కోసం 'సిట్' వేట

- 3 రాష్ట్రాల్లో ముమ్మర గాలింపు.. అజ్ఞాతంలోనే ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప
- హైకోర్టులో ముందస్తు బెయిల్‌పై విచారణ 13న
- దీంతో నేడు సిట్ ముందుకు రావడం డౌటే

ముందుగానే 'రుతు'రాగం

- 27న కేరళను తాకనున్న నైరుతి
- 4 రోజుల ముందే రుతుపవనాల రాక
- 13న దక్షిణ అండమాన్ సముద్రానికి
- ఆగమనానికి అనుకూల వాతావరణం
- వచ్చే నెల రెండో వారం నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు
- త్వరలో ఎండల నుంచి ఉపశమనం
- భారత వాతావరణ శాఖ ప్రకటన

3

పోలవరం.. ఓకే.. గుడ్!

- ప్రాజెక్టు ప్రధాన డ్యామ్‌పై అంతర్జాతీయ నిపుణుల సంతృప్తి
- డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో సాంకేతిక లోపాల్లేవని వెల్లడి

2

14

'అవినీతి విజిలెన్స్'పై ఆర్టీసీ వేటు

- కడప జోన్‌లో వీ అండ్ ఎస్‌వో రెహమాన్ సస్పెన్షన్.. సహకరించిన 9 మంది సిబ్బందిపైనా చర్యలు
- విజయవాడలో 'సరదా బుల్లోడు' వీఆర్‌కు వత్తాసు పలికిన ఏడీపైనా విచారణ, చర్యలకు రంగం సిద్ధం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

డిజిటల్ జనసేవా కేంద్రంగా పోస్టాఫీస్: పెమ్మసాని

» కేరళలో పోస్టాఫీస్ భవనం ప్రారంభం

గుంటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులను డిజిటల్ జనసేవా కేంద్రాలుగా మారుస్తున్నామని, జాతీయ లాజిస్టిక్ భాగస్వామిగా తపాలా మారుతుందని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కేరళలోని తిరువనంతపురం జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. ఇక్కడి వరకలలో నూతన పోస్టాఫీసు భవనాన్ని అట్టింగల్ పార్లమెంటు సభ్యుడు అదూర్ ప్రకాశ్‌తో కలిసి ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

జేఎన్టీయూకేలో పాకిస్థాన్ జెండా తొలగింపు

జేఎన్టీయూకే, మే 10 (ఆంధ్రజ్యోతి): దాయాదితో యుద్ధం నేపథ్యంలో జేఎన్టీయూ కాకినాడలో పాకిస్థాన్ జెండాను శనివారం తొలగించారు. దానిని హిందూ సంఘాల నేతలు తీసుకెళ్లి కాల్చివేశారు. తొలుత విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూ సంఘాల నాయకులు భారత్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ జేఎన్టీయూకేలోకి వచ్చి పరిపాలనాభవనం ఎదురుగా ఉన్న పాకిస్థాన్ జెండాను తొలగించాలని కోరారు. దీనిపై ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ స్పందిస్తూ.. ఐరాసలో గుర్తింపుపొందిన 194 దేశాల జెండాలను గతంలో ఇక్కడ ఏర్పాటు చేశామని, దీనిలో మరో ఉద్దేశం లేదని వీసీ చెప్పారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది జెండాను తొలగించగా దానిని హిందూసంఘాల నాయకులు తీసుకువెళ్లి కాల్చివేశారు.

పోలవరం.. ఓకే.. గుడ్!

» ప్రాజెక్టు ప్రధాన డ్యామ్‌పై అంతర్జాతీయ నిపుణుల ప్యానల్ సంతృప్తి
» డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో సాంకేతిక లోపాల్లేవు
» వర్టికల్ డ్రిల్లింగ్ వీడియో క్లిప్‌లను పంపించండి
» ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌కు గ్రీన్ సిగ్నల్
» ముందస్తుగా రాళ్లు, మట్టి సేకరించాలని సూచన



అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌పైనా, నిర్మాణ పనులపైనా.. అమెరికా, కెనడాకు చెందిన అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ సభ్యులు నలుగురూ ఎలాంటి అభ్యంతరాలు చెబుతారోనన్న ఆందోళనకు తెరపడింది. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులపై అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసింది. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో సాంకేతిక లోపాలు లేవని స్పష్టం చేసింది. ఈ నెల 5 నుంచి 8వ తేదీ దాకా అమెరికా, కెనడాకు చెందిన నిపుణుల ప్యానెల్ సందర్శించింది. ఈ ప్యానెల్ పోలవరం ప్రాజెక్టు పనులను క్షుణ్ణంగా పరిశీలించింది. డయాఫ్రమ్‌వాల్ ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌ను కలుపడంలోనూ, మిషనరీని ఉపయోగించడంలోనూ సహేతుకమైన సాంకేతిక విధానాలే అమలు చేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 8వ తేదీన స్వదేశానికి నిపుణుల ప్యానెల్ బృందం ప్రయాణమైంది. ఈ సమయంలో పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ప్రధాన డ్యామ్ పనులు సాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, భవిష్యత్తులో తమతో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమాచారాన్ని పంపుతుండాలని కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, పోలవరం ప్రాజెక్టు క్షేత్ర స్థాయి ఇంజనీర్లకు ప్యానెల్ బృందం సూచించింది. ఇప్పటిదాకా డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు సక్రమంగానే సాగుతున్నాయని చెబుతునే.. వెర్టికల్ డ్రిల్లింగ్ (దాదాపు 90 మీటర్ల లోతులో జరిగిపే డ్రిల్లింగ్) వీడియో క్లిప్‌లను.. తాము తమ దేశాలకు చేరుకున్న తర్వాత పంపించాలని స్పష్టం చేసింది. ఈ వెర్టికల్ డ్రిల్లింగ్ సమయంలో ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్ మిశ్రమం ఎలా ఉందో?, అది ఎలా గట్టిపడుతుందో?, దాని రసాయన ప్రక్రియలేమిటో శాస్త్రీయంగా తేలుతుందని నిపుణుల ప్యానెల్ వెల్లడించింది. గ్యాప్ -2, గ్యాప్-3 ప్రాంతంలో బంకమట్టిని గట్టిపరిచే ప్రక్రియను వేగవంతం చేసేందుకు నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది.

తరచూ వీడియో కాన్ఫరెన్సులు...

ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌కు నిపుణుల కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం కోసం ఇప్పటి నుంచే ముడి సరుకైన రాళ్లూ మట్టిని సేకరించాలని, దీనివల్ల లక్ష్యాల మేరకు ప్రధాన డామ్ పనులు పూర్తి చేసేందుకు వీలవుతుందని నిపుణుల ప్యానెల్ అభిప్రాయం వ్యక్తం చేసింది. తాము పరిశీలించిన ప్రాంతాలు, ప్రధాన డ్యామ్ నిర్మాణాలపై తరచూ వీడియో కాన్ఫరెన్సులుంటాయని వెల్లడించింది. డయాఫ్రమ్‌వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్లకు సూత్రప్రాయంగా నిపుణుల ప్యానెల్ ఆమోద ముద్ర వేసింది. ఇప్పటికే డిజైన్లను ఆఫ్రి సంస్థ రూపొందించగా, దీనిని కేంద్ర జల సంఘం ఆమోదించాల్సి ఉంది. మొత్తం మీద పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యామ్‌పై అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ సంతృప్తి వ్యక్తం చేయడంతో ఇక పనుల్లో వేగాన్ని మరింత పెంచేలా ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.

బదిలీలతో పాటే పదోన్నతులు

» రెండు మూడ్రోజుల్లో షెడ్యూల్ విడుదలకు అవకాశం
» ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ చర్చలు

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలకు పాఠశాల విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. సోమ లేదా మంగళవారం బదిలీల షెడ్యూలు విడుదల చేసే అవకాశం ఉంది. ఈలోగా జీవో 117కు ప్రత్యామ్నాయంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ జీవో విడుదల చేయనుంది. ఈసారి బదిలీలు, టీచర్ల పదోన్నతులను ఒకేసారి చేపట్టాలని నిర్ణయించారు. ఇందు లో భాగంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు శనివారం మంగళగిరిలోని పాఠశాల విద్య కమిషనరేట్‌లో ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు నిర్వహించారు. జీవో 117కు ప్రత్యామ్నాయం, పదోన్నతులు, బదిలీలపై సంఘాల నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. అలాగే ప్రభుత్వ విధానాన్ని వారికి వివరించారు. సర్వీసు పాయింట్లను ఏడాదికి 0.5 నుంచి 1కి పెంచాలని సంఘాలు కోరగా ఈ ఏడాదికి కుదరదని తేల్చేశారు. అలాగే కొత్తగా ఏర్పాటుచేసే మోడల్ ప్రైమరీ స్కూళ్లలో మిగులు స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తామన్నారు. కాగా, ఈసారి బదిలీల్లో నెగటివ్ పాయింట్లు కూడా ఉంటాయని, విధులకు అనధికారికంగా గైర్హాజరైతే నెలకు ఒక పాయింట్ చొప్పున గరిష్ఠంగా పది నెగటివ్ పాయింట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

నిష్పత్తి మార్చండి

ఉన్నత పాఠశాలల్లో టీచర్లు, విద్యార్థుల నిష్పత్తి 1:40గా మార్చాలని నోబుల్ టీచర్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరాజు, బి.హైమారావు కోరారు. అలాగే రేషనలైజేషన్‌కు కటాఫ్ తేదీని మార్చాలని ఓ ప్రకటనలో కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్‌లో డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి బడుల్లో చేర్చారని, కానీ మార్చి 31 తేదీని పోస్టుల కేటాయింపునకు కటాఫ్ తేదీగా తీసుకున్నారని, దీనివల్ల పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా పోస్టులు రాలేదని వివరించారు.

లోకం తీరు



రేపటి నుంచి హైకోర్టుకు
వేసవి సెలవులు

» వెకేషన్ కోర్టుల విచారణ తేదీల ఖరారు

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): హైకోర్టుకు ఈ నెల 12 నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తిరిగి జూన్ 16 నుంచి పూర్తిస్థాయి కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యాజ్యాల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పాటు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి దశ వెకేషన్ కోర్టులు ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విచారణలు చేపడతాయి. ఇందులో భాగంగా మే 15, 22వ తేదీల్లో న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా విచారణలు చేయనున్నారు. మే 29న జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా కేసులు విచారించనున్నారు. రెండోదశ వెకేషన్ కోర్టులు జూన్ 5, 12వ తేదీల్లో విచారణ చేపడతాయి. జూన్ 5, 12వ తేదీల్లో జస్టిస్ జస్టిస్ ఎం.కిరణ్మయి, జస్టిస్ టీసీడీ.శేఖర్ డివిజన్ బెంచ్, జస్టిస్ కుంచం మహేశ్వరరావు సింగిల్ బెంచ్ నిర్వహిస్తారు.

సింహాచలం దేవస్థానం ఈవోగా సుజాత

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా ఎస్.సుజాత నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖపట్నంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌గా సేవలందిస్తున్న ఆమెకు సింహాచలం దేవస్థానం ఈవోగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అదే విధంగా రాజమహేంద్రవరం (మల్టీజోన్-1) రీజనల్ జాయింట్ కమిషనర్‌గా.. ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ముందుగానే 'రుతు'రాగం

» 27న కేరళను తాకనున్న నైరుతి

» ఈసారి 4 రోజుల ముందే రుతుపవనాల రాక

» వచ్చే నెల రెండో వారం నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

» భారత వాతావరణ శాఖ ప్రకటన

అమరావతి/విశాఖపట్నం, మే 10(ఆంధ్రజ్యోతి): రైతన్నలకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళను తాకనున్నాయి. ఈ నెల 27న కేరళకు వస్తాయని ఐఎండీ ప్రకటించింది. 13వ తేదీన దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవులలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని వెల్లడించింది. గత 20 ఏళ్లలో 2015లో మినహా 2005-2024 మధ్య కేరళకు నైరుతి రుతుపవనాల ఆగమనానికి సంబంధించి ఐఎండీ అంచనాలు తప్పలేదు. తాజా అంచనా ప్రకారం నైరుతి రుతుపవనాలు పురోగమిస్తున్నందున ప్రస్తుత వేసవి ఎండలు, వడగాడ్పుల నుంచి ప్రజలకు త్వరలో ఉపశమనం లభించనున్నది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 నుంచి వారం రోజుల వ్యవధిలో కేరళను తాకనున్నాయి. ఆ తర్వాత వారం, పది రోజుల్లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాకు విస్తరిస్తాయి. రుతుపవనాలు కేరళను తాకినప్పటి నుంచి ఏపీలో వాతావరణం మారుతుంది. జూన్ మూడో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తాయి. ఈ ఏడాది నాలుగు రోజులు ముందే రుతుపవనాలు రానున్నందున వచ్చే నెల రెండో వారం నుంచే వర్షాలు పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అనుకూల వాతావరణం

పసిఫిక్ మహాసముద్రంలో లానినా దశ ముగిసి ప్రస్తుతం తటస్థ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పసిఫిక్‌లో ఉపరితల ఉష్ణోగ్రతలు అనుకూలంగా మారడంతో నైరుతి రుతుపవనాలు ముందుగానే దేశ ప్రధాన భూభాగంలోకి ప్రవేశించేందుకు అనువైన వాతావరణం నెలకొంది. వాయవ్య భారత్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు, దక్షిణాదిన రుతుపవనాల ముందస్తు వర్షాలు ఎక్కువగా నమోదు కావడం, ఉష్ణమండల వాయవ్య పసిఫిక్ మహాసముద్రంలో సగటు ఉపరితల పీడనం, దక్షిణ చైనా సముద్రం నుంచి బయటకు వెళ్లే దీర్ఘకాల రేడియేషన్, హిందూ మహాసముద్రంలో ఈశాన్య ప్రాంతం, ఇండోనేషియా పరిసరాల్లో ఉపరితలం నుంచి వచ్చే గాలులు అనుకూలంగా మారడంతో రుతుపవనాలు నాలుగు రోజులు ముందుగానే కేరళను తాకనున్నట్టు ఐఎండీ తెలిపింది. మే 20వ తేదీ తరువాత దక్షిణ అండమాన్ సముద్రానికి రుతుపవనాలు తాకాల్సి ఉండగా, ఈసారి వారం ముందుగా అంటే.. 13వ తేదీన ప్రవేశించనున్నాయి. తరువాత నాలుగైదు రోజుల్లో దక్షిణ అరేబియా సముద్రం, కొమరిన్ ప్రాంతం, దక్షిణ, మధ్య బంగాళాఖాతం, అండమాన్‌లో అన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ (104 శాతం) వర్షపాతం నమోదవుతుందని గత నెలలోనే వాతావరణ శాఖ ప్రకటించింది.

గత ఐదేళ్లలో కేరళకు రుతుపవనాల రాక

సంవత్సరం	అంచనా	వాస్తవం
2020	జూన్ 5	జూన్ 1
2021	మే 31	జూన్ 3
2022	మే 27	మే 29
2023	జూన్ 4	జూన్ 8
2024	మే 31	మే 30

నేడు, రేపు వడగాడ్పుల ప్రభావం

రాష్ట్రంలో ఆదివారం 41-43.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి జిల్లాలో 11 మండలాలు, అనకాపల్లి జిల్లాలో 8 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, అల్లూరి, అనకాపల్లి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని 30 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని తెలిపింది. మరోవైపు అక్కడక్కడా పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. సోమవారం 24 మండలాల్లో తీవ్రంగా, 57 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.7 డిగ్రీలు, విజయనగరంలో 41.1, తూర్పుగోదావరి జిల్లా మురమండలో 41, అన్నమయ్య జిల్లా కంభాలకుంటలో 40, కడప జిల్లా మద్దూరు, ప్రకాశం జిల్లా మేకలవారిపల్లిలో 40.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


జి.విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఆర్ఐటీ వర్సిటీ ప్రతినిధులు

వీఐటీ వ్యవస్థాపకులు.. విశ్వనాథన్‌కు అమెరికా వర్సిటీ డాక్టరేట్

» ఇప్పటి దాకా అమెరికా నుంచి 3 డాక్టరేట్లు

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్య విస్తరణలో విశేష సేవలందించినందుకుగాను 'వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) వ్యవస్థాపకులు, ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌కు అమెరికాలోని రోచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఆర్ఐటీ) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శుక్రవారం న్యూయార్క్‌లోని ఆర్ఐటీలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ డేవిడ్ సి.మున్సన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రభు డేవిడ్.. విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ కాంచన భాస్కరన్, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా విశ్వనాథన్ అమెరికాకు చెందిన మూడు ప్రఖ్యాత యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. 2009లో వెస్ట్ వర్జీనియా వర్సిటీ, 2024లో స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ గౌరవ డాక్టరేట్లు ఇవ్వగా, తాజాగా ఆర్ఐటీ మరో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అంతేగాక ఈ ఏడాది కోల్‌కతాలోని సెయింట్ జేవియర్స్ విశ్వవిద్యాలయం కూడా విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందించింది.

మల్లేశ్వరుని సేవలో జస్టిస్ మల్లికార్జునరావు


పెదకాకాని ఆలయంలో జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు

పెదకాకాని, మే 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వరస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం వేద ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రంతో న్యాయమూర్తి దంపతులను ఆలయ అధికారులు సత్కరించి శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అమరేశ్వరుని సన్నిధిలో జస్టిస్ లక్ష్మీనారాయణ


జస్టిస్ లక్ష్మీనారాయణకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి: బొప్పరాజు



అనంతపురం టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తీసుకుంటున్న నిర్ణయాలను అమలు చేసే క్రమంలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు తీవ్రమానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఏపీ అమరావతి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణలకు సంబంధించి కోర్టు ధిక్కరణ కేసులు నమోదైతే రెవెన్యూ ఉద్యోగులు ముద్దాయిలుగా మారుతున్నారని, గుంటూరు ఘటనలో డిప్యూటీ కలెక్టరు తాతా మోహన్‌రావు ఇలాగే బలైపోయారని పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని బొప్పరాజు డిమాండ్ చేశారు. రెవెన్యూ విధుల నిర్వహణకు సరిపడా నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలపట్ల వివక్ష చూపడం సరికాదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పీఆర్‌సీ కమిటీని ప్రకటించకపోవడం బాధ కలిగిస్తోందని, ఇప్పటికైనా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'హెలీప్యాడ్' కేసులో నేడు విచారణకు తోపుదుర్తి

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): కుంటిమద్ది హెలీప్యాడ్ కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ నేత, శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం విచారణకు హాజరవుతున్నారు. విచారణ అధికారి, రామగిరి సీఐ శ్రీధర్‌కు ఈ మేరకు సమాచారం అందించారు. వైసీపీ అధినేత జగన్ పర్యటన నేపథ్యంలో గత నెల 8న కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద బారికేడ్లను తోసేసి హెలికాప్టర్‌ను చుట్టుముట్టడం, పోలీసులను తోసేయడం వంటివి జరిగాయి. ఈ వ్యవహారంలో ప్రకాశ్‌రెడ్డితోపాటు వంద మందికి పైగా వైసీపీ నేతలపై పోలీసులు గత నెల 10న కేసు నమోదు చేశారు. అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన తోపుదుర్తి, ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. తోపుదుర్తికి నోటీసులు ఇవ్వాలని, విచారణకు సహకరించకుంటే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవచ్చని ఈ నెల 5న సూచించింది. ఈ క్రమంలో విచారణకు రావాలని ఈ నెల 6న తోపుదుర్తికి పోలీసులు నోటీసులు పంపారు. ఈ క్రమంలో ప్రకాశ్‌రెడ్డి.. ఈ నెల 7న జిల్లాకు వచ్చారు. దీంతో చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ అనంతపురంలోని తోపుదుర్తి ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 12లోగా రామగిరి సర్కిల్ కార్యాలయానికి విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. స్పందించిన తోపుదుర్తి, 11న విచారణకు హాజరవుతానని సమాచారం ఇచ్చారు. ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా ఒక వాహనంలోనే రావాలని ఆయనకు సూచించినట్టు సమాచారం. కాగా, ఇదే కేసులో ఆత్మకూరు మండలంలోని 21 మంది వైసీపీ నాయకులను పోలీసులు శనివారం విచారించారు.


దీపస్తంభాల పత్రాలను టీటీడీ అధికారికి అందజేస్తున్న దాత

శ్రీవారికి కానుకగా రూ.2 కోట్ల విలువైన వెండి అఖండ దీప స్తంభాలు

తిరుమల, మే 10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి శనివారం సుమారు రూ.2 కోట్ల విలువైన నాలుగు వెండి అఖండ దీపాలు కానుకగా అందాయి. బెంగళూరుకు చెందిన రాధాకృష్ణ సుమారు 50 కిలోల బరువు కలిగిన రెండు దీప స్తంభాలను, శ్యాంసుందర్ శర్మ, శశిధర్ ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు వెండి అఖండ దీప స్తంభాలను శనివారం రాత్రి శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

షేర్స్‌లో పెట్టుబడి పేరిట దోచేశారు!

» రూ.30.62 లక్షలు మోసపోయిన నెల్లూరు వాసి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మే 10(ఆంధ్రజ్యోతి): షేర్స్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలుంటాయని నమ్మించి నెల్లూరులో ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.30.62 లక్షలు దోచేశారు. నగరంలోని కామాటివీధికి చెందిన పొందూరు నాగేంద్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మార్చి 12న ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఓ మెసేజ్ వచ్చింది. వెంటనే నాగేంద్ర ఆ లింక్ క్లిక్ చేయగా ఆయన వాట్సా‌ప్‌కు ఎస్ఎంఈ స్టాక్ ట్రెండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అనే గ్రూపులో యాడ్ చేశారు. ఆ తర్వాత వారు చెప్పిన షేర్ కొనుగోలు, అమ్మకాలు చేస్తూ రూ.1.66 లక్షల లాభం పొందాడు. అప్పటి నుంచి నాగేంద్ర ఖాతాల నుంచేగాక తన తండ్రి నాగరాజు అకౌంట్ నుంచి పలు దఫాలుగా రూ.30,62,488 లక్షలు డిపాజిట్ చేశారు. ఈ క్రమంలో నాగేంద్ర అకౌంట్‌లో రూ.38,74,744 నగదు చూపించారు. ఆ నగదును విత్‌డ్రా చేసుకునేందుకు నాగేంద్ర చాట్ చేయగా రూ.12,17,465 డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో నాగేంద్ర ఈ నెల 8న ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లోను, శనివారం చిన్నబజారు పోలీసులకు పిర్యాదు చేశాడు.

విడదల రజిని ముఖ్య అనుచరుడు అరెస్ట్

» మాజీ మంత్రి కారులో దాక్కున్న శ్రీకాంత్‌రెడ్డి

» కారు తలుపులకు అడ్డంగా నిలబడిన రజిని

» ఆగ్రహంతో ఊగిపోతూ పోలీసులతో వాగ్వాదం

» బలవంతంగా తలుపులు తెరిచి అదుపులోకి...


శ్రీకాంత్ రెడ్డి


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట/ నాదెండ్ల మే 10(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజిని ప్రధాన అనుచరుడు, వైసీపీకి చెందిన మానుకొండ శ్రీకాంత్‌రెడ్డి(35)ని పోలీసులు అదుపులో తీసుకున్నారు. పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న అతడిని అదుపులోకి తీసుకునే సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. రెండు కుటుంబాల వారిని పరామర్శించేందుకు రజిని పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం జంగాలపల్లె గ్రామానికి కారులో వెళ్లారు. ఆ కారులో శ్రీకాంత్‌రెడ్డి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు పోలీసు సిబ్బందితో కలిసి జంగాలపల్లెలో రజిని కారును చుట్టుముట్టారు. లోపల దాక్కుని కూర్చున్న శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి సీఐ కారు తలుపులు తీయబోగా రజిని అడ్డుకున్నారు. 'ఏంటిది సీఐ గారు' అని ఆగ్రహంతో ఊగిపోతూ పెద్దగా కేకలు వేశారు. కారుకు అడ్డంగా నిలబడి తలుపులు తీయనీయలేదు. రజిని పోలీసులతో చాలాసేపు వాగ్వాదానికి దిగారు. విధులకు ఆటంకం కలిగిస్తే కేసులు పెట్టాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. రజిని కేకలు వేస్తూ అడ్డుకుంటూ ఉండగానే పోలీసులు బలవంతంగా కారు తలుపులు తెరిచి శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు ఇప్పిస్తామని చిలకలూరిపేటకు చెందిన ఎం.రత్నారెడ్డి అనే వ్యక్తి దగ్గర రూ.24లక్షలు వసూలు చేసిన చీటింగ్ కేసు విషయంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. శ్రీకాంత్‌రెడ్డిపై మరికొన్ని కేసులూ ఉన్నట్టు తెలిసింది.

ప్రభుత్వాస్పత్రుల్లో జన ఔషధి కేంద్రాలు

» రోగులకు అతి స్వల్ప ధరలకే మందులు

» త్వరలో 'రెడ్‌క్రాస్' ఆధ్వర్యంలో నిర్వహణ.. ప్రభుత్వ ఆమోదం

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించడానికి జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై ఉన్నతాధికారులతో సమీక్ష అనంతరం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రభుత్వాస్పత్రుల్లో 23 ప్రైవేటు జనరిక్ మందుల షాపులున్నాయి. వీటిని స్వయం సహాయక బృందాలు, ఇతర సంఘాలకు కేటాయించినప్పటికీ, ప్రయివేటు వ్యక్తులు వాటిని చేజిక్కించుకుని భారీ లాభాలతో నడుపుతున్నట్లు తెలుస్తోంది. వీరు జనరిక్ ఔషధాల తయారీ, ధరలు నిర్ణయించే విధానంలో లొసుగులను ఉపయోగించుకుంటూ రోగులను దోపిడీ చేస్తున్నట్లు అనేక విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను పరిష్కరించి, నాణ్యమైన జనరిక్ మందులు సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజనను ప్రవేశపెట్టింది. వీటిని ఇప్పుడు ప్రభుత్వాస్పత్రిల్లో లాభాపేక్ష లేకుండా నిర్వహించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందుకు వచ్చింది.

బహ్రెయిన్‌లో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

బహ్రెయిన్ తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఏడాదిపాటు దేశవిదేశాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలిసారి బహ్రెయిన్‌లో తెలుగు కళాసమితి అధ్యక్షుడు పి.జగదీశ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ నుంచి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ హాజరయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఉగ్రవాద సంస్థలైనా, తీవ్రవాద సంస్థలైనా అంతిమంగా కనుమరుగు కావాల్సిందే! ఉగ్రవాదులు, తీవ్రవాదుల ఆలోచనల్లో హేతుబద్ధత ఉండదు. వారి వాదన తర్కానికి అందదు. ఉగ్రవాదులనే తీసుకుందాం. పవిత్ర యుద్ధం 'జీహాద్' అంటూ భారత్ పైకి తుపాకులు ఎక్కుపెట్టారు. మత ప్రాతిపదికన చేసే యుద్ధం పవిత్రమైనది ఎలా అవుతుంది? హింసను నమ్ముకోమని ఇస్లాం చెప్పలేదే! అమాయకులను పొట్టనపెట్టుకోమని అల్లా చెప్పలేదే? సాటి మానవుడిని ప్రేమించమని, సాయపడమనే ఏ మతమైనా చెబుతుంది. ఖురాన్ కూడా ఇదే చెబుతుంది. మరి ద్వేషానికి తావెక్కడ? పహల్గాంలో జరిగిందేమిటి? ఉగ్రవాదుల చేతిలో చనిపోయిన వారు చేసిన పాపం ఏమిటి? వారు ఏ హాని చేశారు? మతం అడిగి మరీ చంపడమా? ఈ దుశ్చర్యను ఇస్లాం సమర్థిస్తుందా? ఎన్నటికీ కాదు! నిజంగా ఇస్లాంను ఆచరించేవారు ఇతరులకోసం ప్రాణాలను ఇస్తారు కానీ ప్రాణాలను తీయరు.

ఉగ్రభూత పీచమణచగా...

"పొరుగుదేశం నుంచి వచ్చి మన ఇంట్లో మనల్ని కొట్టి వెళితే చర్చలు అంటూ ప్రేమలేఖలు రాయడమేమిటి? మన మంత్రి అమెరికా వెళ్లి మా మీద దాడి జరిగిందని అక్కడ ఏడవడమేమిటి? ఎవరికి ఎలా సమాధానం చెప్పాలో అలాగే చెప్పాలి!"... గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక టీవీ షోలో చేసిన వ్యాఖ్యలు ఇవి! "అంతర్జాతీయ ఒత్తిళ్లను కూడా దృష్టిలో పెట్టుకోవాలిగా!" అని టీవీ వ్యాఖ్యాత అన్నప్పుడు "వంద కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంపై ఒత్తిళ్లు ఏమిటి?" అని కూడా మోదీ బదులిచ్చారు. ఇప్పుడు దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ దేశ భద్రతను తన చేతుల్లోకి తీసుకున్నారు. పహల్గాంలో ఉగ్రమూకలు కర్కశంగా దాడి చేసి 26 మందిని హతమార్చిన తర్వాత రగిలి పోయిన ప్రధాని పాకిస్థాన్‌పై దాడికి త్రివిధ దళాలను సిద్ధం చేసి ప్రతి దాడులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధాన మంత్రి వ్యవహరించిన, వ్యవహరిస్తున్న తీరు ఇంటా బయటా ఆయన ప్రతిష్ఠను అమాంతం పెంచింది. పహల్గాంలో యాత్రికుల మతం తెలుసుకొని మరీ పురుషులను మాత్రమే చంపి మన మహిళల పసుపు కుంకుమలను ఉగ్రవాదులు చెరిపేయడంతో దేశ ప్రజలందరూ ప్రతీకార వాంఛతో రగిలి పోయారు. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాల్సిందేనని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నినదించారు. దీంతో ఇదే అదనుగా భావించిన ప్రధానమంత్రి... పాక్‌పై ప్రారంభించిన ప్రతి దాడులకు 'ఆపరేషన్ సిందూర్' అని వ్యూహాత్మకంగా నామకరణం చేశారు. ఏ మహిళల నుదుటిపై సిందూరం తుడిచి వేయబడిందో అదే సిందూరం పేరిట ఆపరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు మీడియాకు తెలియజేసే బాధ్యతను ఇద్దరు మహిళా సైనికాధికారులకు అప్పగించారు. ప్రధాని మోదీ చతురతకు ఇది నిదర్శనం! అమెరికా ద్వారా పాకిస్థాన్ రాయబారాలు నడిపి కాల్పుల విరమణకు ఒప్పించిందా... లేదా మరేదైనా రూపంలో శరణుకోరిందా అనేది ప్రస్తుతానికి తెలియదు కానీ... శనివారం సాయంత్రం 5 గంటల నుంచి అనూహ్య రీతిలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఇది ఒకరకంగా శుభ పరిణామమే! అయితే... పాకిస్థాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు మత ప్రాతిపదికన మారణహోమం సృష్టించడం ద్వారా మన దేశంలో హిందువులను సంఘటితం చేశారు. ఫలితంగా ప్రధాని మోదీ అత్యంత శక్తిమంతుడిగా అవతరించారు. మాకు మోదీ ఉన్నారన్న ధీమాలో ఇప్పుడు దేశ ప్రజలు ఉన్నారు.

నాడు ఇందిర.. నేడు మోదీ

ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన రాత్రి పాకిస్థాన్ గడ్డపై తిష్ఠవేసిన దాదాపు వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్ట గలగడం మన దేశం సాధించిన విజయం. గతంలో పాకిస్థాన్‌పై మన దేశం రెండు పర్యాయాలు యుద్ధం చేయ వలసి వచ్చింది. ఈ రెండు సందర్భాలలోనూ భారత దేశానిదే పైచేయి అయింది. మన దేశం 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. అప్పుడే పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మనకు 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండుసార్లు పాకిస్థాన్‌తో, ఒకసారి చైనాతో యుద్ధం చేయాల్సి వచ్చింది. 1971 తర్వాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటం, స్వల్ప స్థాయిలో దాడులు చేసుకోవడం మినహా పూర్తి యుద్ధం జరగలేదు. 1971లో జరిగిన యుద్ధం గురించి ఇప్పుడు అరవై ఏళ్ల వయసు ఉన్న వారికి కూడా పూర్తిగా తెలియదు. అప్పుడు దేశ మంతటా బ్లాక్ ఔట్ పాటించారు. సైరన్ మోతలతో ప్రజలు బిక్కుబిక్కు మంటూ బతికారు. అప్పుడు దివంగత ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉండగా ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఉన్నారు. ఇద్దరూ శక్తిమంతమైన నాయకులే! 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి పాటవాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ మనవైపు చెప్పుకో దగిన నష్టం ఏమీ జరగలేదు.

అంతర్జాతీయ సమీకరణాలు...

1971లో పాక్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, చైనా వంటి దేశాలు నిలవగా... మన దేశానికి సమైక్య రష్యా మాత్రమే అండగా ఉండింది. ప్రపంచ దేశాలపై ఎల్లకాలం అమెరికా పెత్తనం చేయడమేమిటి? మనమెందుకు ఆ పని చేయకూడదు? అని చైనా తలపోస్తోంది. అమెరికాను తప్పించి ఆ స్థానంలో తాను పెద్దన్న పాత్రను పోషించాలని చైనా భావించడం వల్ల అమెరికాకూ చైనాకూ పొసగడం లేదు. మరో వైపు భారతదేశం కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దీంతో భారత్ నుంచి ముప్పు తప్పదని భావించిన చైనా మనతో శత్రుత్వం పెంచుకుంటోంది. చైనాకు సామంత దేశంగా ఉండటానికి భారత్ ఎప్పటికీ అంగీకరించదు. ఈ కారణంగా చైనా వ్యూహాత్మకంగా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీ లేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేయవద్దని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసినా... శుక్రవారంనాడే వంద కోట్ల డాలర్ల సహాయం అందించడానికి అంగీకారం తెలిపింది. అంతర్జాతీయంగా ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి. రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా ఉభయ దేశాలూ నష్టపోయాయి. రష్యాకు తిరుగులేని సైనిక శక్తి, ఆయుధ సంపద ఉన్నప్పటికీ... పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అండతో ఉక్రెయిన్ ఎదురొడ్డి నిలబడగలుగుతోంది. రష్యాతో తలపడటానికి అవసరమైన సహాయం కోసం ఉక్రెయిన్ తమ దేశంలోని సహజ వనరులు, ముఖ్యంగా ఖనిజ సంపదపై హక్కులను అమెరికాకు ధారాదత్తం చేయాల్సి వచ్చింది. మరో వైపు రష్యా కూడా పూర్వం ఉన్నట్టుగా ఆర్థికంగా పటిష్ఠంగా లేదు. మొత్తం మీద ఈ యుద్ధం వల్ల బలవంతుడు, బలహీనుడు కూడా నష్టపోయారు–నష్టపోతున్నారు.


ఆర్థిక... వాణిజ్య... యుద్ధం!

యుద్ధాలను భరించే స్థితిలో ప్రపంచ దేశాలు ఇప్పుడు లేవు. ఐదు దశాబ్దాల క్రితం పరిస్థితులు వేరు. అప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా లేవు. 1971 యుద్ధ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మన దేశ ప్రజలపై ప్రభావం చూపలేదు. ఇప్పుడు మన దేశం నుంచి ఎగుమతులు, దిగుమతులు కూడా పెరిగాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండో పర్యాయం బాధ్యతలు చేపట్టిన తర్వాత వివిధ దేశాలపై సుంకాలను పెంచడంతో ప్రపంచ దేశాలు అల్లాడిపోయాయి. ప్రపంచీకరణ ఫలితం ఇది. గతంలో ఉంటే తినేవాళ్లం, లేకుంటే పస్తులు ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి వేరు. అలా అని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పకుండా ఉండలేం. మన దేశంతో యుద్ధం చేసి నెగ్గలేని పాకిస్థాన్ ఉగ్ర మూకలను పెంచి పోషించి మనపైకి ఉసిగొల్పుతోంది. తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలనుకుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి. కశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే కాల్చి చంపిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా మన దేశాన్ని పాకిస్థానే యుద్ధ రంగంలోకి లాగింది. కులమతాలతో సంబంధం లేకుండా దేశ ప్రజల భావోద్వేగాలు పతాక స్థాయికి చేరుకున్నాయి.

దుష్ట కుట్రల పాక్...

ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కూడా బావుకుంటున్నది ఏమీ లేదు. పాముకు పాలు పోసి పెంచితే అది ఏదో ఒకరోజు మనల్నే కాటేస్తుంది. పాకిస్థాన్‌కు కూడా ఈ పరిస్థితి ఎదురవుతోంది. భారత్ చర్యలవల్ల బంగ్లాదేశ్ పేరిట తమ భూభాగాన్ని కోల్పోవలసి రావడంతో పాక్ ప్రజలకు మన దేశంపై కోపం ఉంది. దీన్ని ఆసరాగా తీసుకొని ఉగ్ర సంస్థలు పుట్టుకొచ్చాయి. భారత్‌తో నేరుగా తలపడి నెగ్గే పరిస్థితి లేనందున ఉగ్ర మూకల ద్వారా మన దేశంలో అలజడులు సృష్టించే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోంది. ఈ క్రమంలో పాక్‌లో తిష్ఠ వేసిన ఉగ్రవాదులు మరింత శక్తి మంతులుగా మారారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ద్వారా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా పాక్ మిలటరీకి, ఉగ్రవాద సంస్థలకు మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరు. గతంలో ఎంతో మంది సైన్యాధ్యక్షులు ప్రధానమంత్రులను తొలగించి పాలనా పగ్గాలు చేపట్టడం చూశాం! అదే సమయంలో ఉగ్రవాద సంస్థలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి సైన్యానికి కూడా లేదు. సైన్యాన్ని ఉగ్రవాదులు తమ అదుపులో పెట్టుకోగా, ప్రభుత్వాలను సైన్యం తన అదుపులో పెట్టుకుంటోంది. స్థూలంగా పాక్ పరిస్థితి ఇది. తాము శత్రు దేశంగా పరిగణించే భారత్‌ను ఏదో చేయాలన్న దుగ్ధతో పాకిస్థాన్ తన తల కొరివిని తానే పెట్టుకుంటోంది. ప్రపంచ దేశాలు, ముఖ్యంగా భారత్ కోరుతున్నట్టు ఉగ్రవాదులకు సహాయ సహకారాలను నిలిపివేసే పరిస్థితి పాక్ ప్రభుత్వాలకు ఉందా? అంటే లేదు అనే చెప్పాలి. ఉగ్రవాదులను కట్టడి చేయాలనుకుంటే ఆ ప్రభుత్వాలకు మనుగడ ఉండదు. కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా పాకిస్థాన్ అన్ని విధాలుగా కునారిల్లుతోంది. ఆ దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉంది. బయటి నుంచి ఆర్థిక సాయం అందని పక్షంలో పాక్ కుప్పకూలిపోతుంది. అయినా, ఉగ్రవాదులను ధిక్కరించలేని స్థితి. పాక్‌లో ప్రజా ప్రభుత్వం నిమిత్తమాత్రం. ఆర్థిక సంక్షోభం ఒకవైపు – అంతర్గత పోరు మరోవైపు ఆ దేశాన్ని కుంగదీస్తున్నప్పటికీ ఉగ్రవాదులకు పట్టదు. మతపరమైన ఉన్మాదంతో ఊగిపోతున్నారు. పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం భూ భాగమైన బలూచిస్థాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడాలని కోరుకుంటోంది. ఇందుకోసం బలూచీలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు.

పహల్గాంలో అమాయకులను పొట్టన పెట్టుకున్నవారు 'వెళ్లి మీ మోదీకి చెప్పుకోండి' అని భర్తలను కోల్పోయిన భార్యలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఆపరేషన్ సిందూర్ తర్వాత చనిపోయిన ఉగ్రవాదుల శవాల మధ్య ఏడుస్తున్న నాయకుడి ఫొటో పెట్టి 'మేం మోదీకి చెప్పాం. ఫలితమే ఇది' అన్నట్టుగా మాజీ ఆర్మీ చీఫ్ ఒక పోస్టు పెట్టారు.



ఆమె కంట కన్నీరొలికితే...

మనది పుణ్య భూమి! ఇప్పుడు మన మహిళల పసుపు కుంకుమలను ఉగ్రవాదులు చెరిపేశారు. పురాణాల నుంచి నేటి వరకు స్త్రీల కన్నీటి కారణంగానే యుద్ధాలు జరిగాయి. నాడు ద్రౌపది వల్ల పాండవులు–కౌరవుల మధ్య కురుక్షేత్ర యుద్ధం, సీత కోసం రామ రావణ యుద్ధం జరిగాయి. పుణ్య స్త్రీ కన్నీటికి ఎంతో మహిమ ఉంటుందని నమ్మే దేశం ఇది. ఇప్పుడు పసుపు కుంకుమలు పోగొట్టుకున్న ఆడపడుచుల కోసం 'ఆపరేషన్ సిందూర్' మొదలైంది. పహల్గాంలో ఉగ్రవాదుల చర్య అత్యంత హేయమైనది. అందువల్లే ఈ దారుణాన్ని ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. పాక్‌కు మద్దతు ఇస్తున్న చైనా కూడా ఈ దుశ్చర్యను ఖండించక తప్పలేదు. ప్రపంచ చరిత్రలో ఉగ్రవాదంగానీ, తీవ్రవాదంగానీ సఫలమైన దాఖలాలు లేవు. బుల్లెట్లను, హింసను నమ్ముకున్న వారు వాటికే బలయ్యారు. అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు ఏ గతి పట్టిందో చూశాం! ఐసిస్‌ను ప్రారంభించిన వారికి కూడా అదే గతి పట్టింది. ఈ రెండు సంస్థలూ తమ హింస ద్వారా కొంతకాలం పాటు ప్రపంచానికి కంటి మీద కునుకు లేకుండా చేశాయి. చివరకు కాలగర్భంలో కలిసిపోయాయి. ఈ రెండు సంస్థలూ, వాటి అధిపతులతో పోల్చితే మసూద్ అజర్ లాంటి వాళ్లు ఎంత? హింసను నమ్ముకున్న తీవ్రవాదం పరిస్థితి కూడా ఇదే! శ్రీలంకలో తమిళులు అధికంగా నివసించే జాఫ్నా తదితర ప్రాంతాలను తమిళ ఈలం పేరిట విడగొట్టాలన్న డిమాండ్‌తో ఎల్టీటీఈని ప్రారంభించిన ప్రభాకరన్ చివరకు సైన్యం చేతిలో హతుడయ్యారు. ఆత్మాహుతి దళాల సంస్కృతిని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. ఎల్టీటీఈకి చెందిన ఆత్మాహుతి దళమే మన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని పొట్టనబెట్టుకుంది. ఖలిస్థాన్ ఉద్యమాన్ని ప్రారంభంలో పరోక్షంగా ప్రోత్సహించిన ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చివరికి ఖలిస్థాన్ వాదాన్ని నరనరాన జీర్ణించుకున్న తన సొంత అంగరక్షకుల తుపాకీ నుంచి వెలువడిన తూటాలకే బలయ్యారు. పాకిస్థాన్‌లో కూడా మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో వంటి వారు ఉగ్రవాదుల తుపాకీ గుళ్లకు బలయ్యారు. తీవ్రవాదాన్నే తీసుకుందాం! ఐదు దశాబ్దాల క్రితం అప్పుడు నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తీవ్రవాదాన్ని నమ్ముకుని మావోయిస్టు పార్టీ పురుడు పోసుకుంది. కాలక్రమంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులను హత మార్చారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అనే సిద్ధాంతానికి తావు ఉండటం లేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై యుద్ధం ప్రకటించింది. దీంతో ప్రధాన జనజీవన స్రవంతికి దూరమై అడవులకే పరిమితమైన మావోయిస్టులకు ఊపిరి సలపడం లేదు. తమ ఉనికిని కాపాడుకునేందుకు శాంతి చర్చల ప్రతిపాదనను తెరమీదకు తెస్తున్నారు. ఆరు నెలల పాటు కాల్పుల విరమణకు సైతం సిద్ధం అని ప్రకటించాల్సిన పరిస్థితి. అయినా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మావోయిస్టులపై పోరాటాన్ని ఆపే పరిస్థితి లేదు. ఉగ్రవాద సంస్థలైనా, తీవ్రవాద సంస్థలైనా అంతిమంగా కనుమరుగు కావాల్సిందే! ఉగ్రవాదులు, తీవ్రవాదుల ఆలోచనల్లో హేతుబద్ధత ఉండదు. వారి వాదన తర్కానికి అందదు. ఉగ్రవాదులనే తీసుకుందాం. పవిత్ర యుద్ధం 'జీహాద్' అంటూ భారత్ పైకి తుపాకులు ఎక్కుపెట్టారు. మత ప్రాతిపదికన చేసే యుద్ధం పవిత్రమైనది ఎలా అవుతుంది? హింసను నమ్ముకోమని ఇస్లాం చెప్పలేదే! అమాయకులను పొట్టనపెట్టుకోమని అల్లా చెప్పలేదే? సాటి మానవుడిని ప్రేమించమని, సాయపడమనే ఏ మతమైనా చెబుతుంది. ఖురాన్ కూడా ఇదే చెబుతుంది. మరి ద్వేషానికి తావెక్కడ? పహల్గాంలో జరిగిందేమిటి? ఉగ్రవాదుల చేతిలో చనిపోయినవారు చేసిన పాపం ఏమిటి? వారు ఏ హాని చేశారు? మతం అడిగి మరీ చంపడమా? ఈ దుశ్చర్యను ఇస్లాం సమర్థిస్తుందా? ఎన్నటికీ కాదు! నిజంగా ఇస్లాంను ఆచరించేవారు ఇతరులకోసం ప్రాణాలను ఇస్తారు కానీ ప్రాణాలను తీయరు. ఉగ్రవాదులకు వారి నాయకులు నూరిపోస్తున్నది ఏమిటి? 'పవిత్ర యుద్ధంలో మీరు చనిపోతే స్వర్గానికి వెళతారు. అక్కడ అందగత్తెలు మీ సొంతం. సకల భోగాలూ అనుభవించవచ్చు' అని చెబుతారు. హిందూ మతంలో కూడా స్వర్గంలో రంభ, ఊర్వశి, మేనకలు ఉంటారని చెబుతారు. అలా అని అమాయకులను చంపితే వారు మీకు సొంతం అవుతారని ఎవరూ చెప్పడం లేదే! ఖురాన్‌లో కూడా అమాయకులను చంపితే స్వర్గం ప్రాప్తిస్తుందని చెప్పలేదు. రంజాన్ మాసంలో ముస్లింలు తమ సంపాదనలో పది శాతం పేదలకు దానం చేయాలని ఖురాన్‌లో చెప్పారు. అంటే భూమిపై పుణ్య కార్యాలు చేసినప్పుడే స్వర్గ ప్రాప్తి లభిస్తుందనే కదా చెప్పింది! అన్నెం పున్నెం ఎరుగని వారిని చంపితే స్వర్గం కాదు కదా, భూమిపైనే నరకం ప్రాప్తిస్తుంది. జమ్మూ కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల కంటే స్వర్గం అందంగా ఉంటుందా? భూతల స్వర్గాన్ని కళ్లెదురుగా పెట్టుకొని ఉందో లేదో తెలియని స్వర్గం కోసం పాకులాడటం మూర్ఖత్వం కాదా? జమ్మూ కశ్మీర్‌లో శాంతిభద్రతలు అదుపులోకి రావడం వల్ల మన దేశం నుంచే కాకుండా విదేశాల నుంచీ పర్యాటకులు తరలివస్తున్నారు. కళ్లెదుటే కనువిందు చేస్తున్న కశ్మీరీ అందాలను ఆస్వాదించడానికి వస్తున్న పర్యాటకుల వల్ల స్థానిక ముస్లింలు లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. పహల్గాం సంఘటనతో ఉపాధి కోల్పోయిన వారిలో ముస్లింలే అధికంగా ఉన్నారు కదా? ఉగ్ర మూకలు వారి కుటుంబాలను ఆదుకుంటాయా? ఉగ్రవాదం అనే మతిలేని చర్యలకు పాల్పడుతూ, అమాయకులను పొట్టనపెట్టుకుంటూ అర్థాంతరంగా ప్రాణాలను కోల్పోతున్నది కూడా ఉగ్రవాదులే. జమ్మూ కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లో శాంతి, సామరస్యం వెల్లివిరిస్తే ప్రపంచ నలుమూలల నుంచీ పర్యాటకులు వస్తారు. స్విట్జర్లాండ్‌కు బదులుగా ఈ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. పర్యాటకుల సంఖ్య పెరిగే కొద్దీ స్థానిక ప్రభుత్వాలకు ఆదాయం పెరిగి, ఆ ప్రాంతాన్ని స్వర్గధామంగా అభివృద్ధి చేయవచ్చు. అప్పుడు స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి కదా? అలాంటప్పుడు ఉందో లేదో తెలియని స్వర్గం కోసం హింసను నమ్ముకోవడం ఏమిటి? భారత్–పాక్ ఒక్కటిగా నిలిస్తే ప్రపంచాన్నే శాసించగలవు. శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగవచ్చు. అలా జరిగే అవకాశం ఉన్నందునే బ్రిటిష్ పాలకులు పోతూ పోతూ ఉభయ దేశాలలో మత విద్వేష బీజాలు నాటారు. ఇప్పుడు ఆ విద్వేషాలే కాలనాగులై మాతృ దేశాలకే అపకారం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో మృతి చెందిన ఉగ్రవాదులకు పాక్ సైన్యం అధికారికంగా అంత్యక్రియలు జరిపించి ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబడింది. అంత్యక్రియలకు హాజరు కాని పక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఉగ్రవాదుల నుంచి హుకుం వచ్చి ఉంటుంది. దాయాది దేశాల మధ్య యుద్ధం ఎందుకని ప్రశాంతంగా ఆలోచిస్తే ఏ సమస్యా ఉండదు. పాకిస్థాన్‌ను ఇప్పుడు ఉగ్ర వాదులు పాలిస్తున్నారు. కాబట్టే విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారు. పహల్గాంలో అమాయకులను పొట్టన పెట్టుకున్న వారు 'వెళ్లి మీ మోదీకి చెప్పుకోండి' అని భర్తలను కోల్పోయిన భార్యలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఆపరేషన్ సిందూర్ తర్వాత చనిపోయిన ఉగ్రవాదుల శవాల మధ్య ఏడుస్తున్న నాయకుడి ఫొటో పెట్టి 'మేం మోదీకి చెప్పాం. ఫలితమే ఇది' అన్నట్టుగా మాజీ ఆర్మీ చీఫ్ ఒక పోస్టు పెట్టారు. ప్రధాని మోదీ సాదాసీదా రాజకీయ నాయకుడు కాదు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని రాజకీయంగా బలపడటానికి ఎలా ఉపయోగించుకోవాలో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి, ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా మాట్లాడే దుస్సాహసం ఎవరూ చేయలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు పాక్ పీచమణచడం ద్వారా అంతర్జాతీయంగా కూడా మోదీ కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగే అవకాశం ఉంది. దటీజ్ మోదీ!

రంజాన్ మాసంలో ముస్లింలు తమ సంపాదనలో పది శాతం పేదలకు దానం చేయాలని ఖురాన్‌లో చెప్పారు. అంటే భూమిపై పుణ్యకార్యాలు చేసినప్పుడే స్వర్గ ప్రాప్తి లభిస్తుందనే కదా చెప్పింది! అన్నెం పున్నెం ఎరుగని వారిని చంపితే స్వర్గం కాదు కదా, భూమిపైనే నరకం ప్రాప్తిస్తుంది. జమ్మూ కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల కంటే స్వర్గం అందంగా ఉంటుందా? భూతల స్వర్గాన్ని కళ్లెదురుగా పెట్టుకొని ఉందో లేదో తెలియని స్వర్గం కోసం పాకులాడటం మూర్ఖత్వం కాదా? జమ్మూ కశ్మీర్‌లో శాంతిభద్రతలు అదుపులోకి రావడం వల్ల మన దేశం నుంచే కాకుండా విదేశాల నుంచీ పర్యాటకులు తరలివస్తున్నారు. కళ్లెదుటే కనువిందు చేస్తున్న కశ్మీరీ అందాలను ఆస్వాదించడానికి వస్తున్న పర్యాటకుల వల్ల స్థానిక ముస్లింలు లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. పహల్గాం సంఘటనతో ఉపాధి కోల్పోయిన వారిలో ముస్లింలే అధికంగా ఉన్నారు కదా? ఉగ్ర మూకలు వారి కుటుంబాలను ఆదుకుంటాయా?

చైనా వ్యూహాత్మకంగా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీలేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. అంతర్జాతీయంగా ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అరుణోదయ 50 ఏళ్ల పరిపూర్తి సభ


ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో జంపాల చంద్రశేఖర్ చొరవతో 1974, మే 12న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏర్పడింది. సంప్రదాయిక కళారూపాలలోని వస్తువు సారాన్ని మార్చుకుంటూ ఎప్పటికప్పుడు కొత్త సారంతో తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు జరిగిన పోరాటాల్లో డజన్ల కొద్దీ కళారూపాలను అరుణోదయ అందిపుచ్చుకున్నది. శ్రీకాకుళం, గోదావరి లోయ, కరీంనగర్ వంటి సాయుధ రైతాంగ పోరాటాలను గానం చేసింది. సింగరేణి, బీడీ కార్మికుల వంటి ఎందరో శ్రమ జీవుల సమస్యలపై కళారూపాలు రూపొందించింది. ఆదివాసుల స్వయంపాలనను ఎలుగెత్తి పాడింది. స్త్రీ విముక్తిని చాటింది. మైనార్టీల ఆత్మరక్షణ హక్కులను లేవనెత్తింది. దళితుల–పీడిత కులాల సమస్యలను, వర్గ–కుల పోరాటాల ఆవశ్యకతను గానం చేసింది. ఆపరేషన్ 'కగార్' ఆపి శాంతి చర్చలు జరగాలని పాడుతున్నది. ప్రాంతీయ ప్రజాస్వామ్య హక్కుల్లో తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర అనే తేడా లేకుండా ప్రజల ఆకాంక్షలను ఎలుగెత్తింది.

2024 డిసెంబర్ 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో తన 50 వసంతాల సభను అరుణోదయ నిర్వహించుకుంది. అయితే తన 50 ఏళ్ల చరిత్రను, కృషిని, పరిస్థితిని సృజించుకునే పనితో పాటు 'అరుణోదయం' అనే సావనీర్ ఆవిష్కరణ, అరుణోదయ డాక్యుమెంటరీ, విప్లవ ప్రజాసంస్థల 50 ఏళ్ల ప్రస్థానం పాటను ప్రదర్శించుకుంటూ అరుణోదయ 50 ఏళ్ల పరిపూర్తి స్ఫూర్తి ముగింపు సభ జరగనున్నది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మే 12న జరిగే ఈ సభలో అరుణోదయ నాగన్న, విమలక్క, తమ్మారెడ్డి భరద్వాజ, మీనా కందస్వామి, డా. బుర్ర రమేష్, దివికుమార్, ప్రొ. జయధీర్ తిరుమలరావు, డా. ఎ.కె.ప్రభాకర్, కొల్లాపురం విమల, రాంసత్తయ్య, అంబిక, ఎనిశెట్టి శంకర్, అనిత పాల్గొంటారు. 'ప్రజా సంస్కృతి–సాంస్కృతికోద్యమ నిర్మాణ ఆవశ్యకత'పై పలువురు ప్రసంగిస్తారు.

– అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గాలు

యుద్ధ విరమణ

యుద్ధ విరమణ కూడా ఒక యుద్ధమే
కాకపోతే ఇది మానసికం
క్షతగాత్రుని నెత్తురుతో నేల తడవకుండా
జెండాలు ఎగరవు
సముద్రాన్ని భూమిని ఆకాశాన్ని
ఏకం చేసే శక్తి వీరుని రక్తానికే ఉంది
సైనికుని చేతిలో పైకి కనిపించేది
తుపాకీ ఒక్కటే కావచ్చు
కానీ అతని సాహసంలో మాత్రం
ఆయుధాలు అసంఖ్యాకం
మన అంగుళం భూమి కూడా
శత్రువు నీడతో కలుషితం కారాదు
వాడి కుట్రలు కుతంత్రాలు శాంతికి భంగం కారాదు
తల్లిదండ్రులు భార్యాబిడ్డలు
మన సైనికుని జీవితాశను పెంచుతారు
తామంతా ఒకే భూమి మీద నిల్చుని
ప్రాణాలను పంచుకుంటున్న అనుభూతి
మనశ్శాంతికి బాటలు వేస్తుంది
ఊపిరిలోని దేశభక్తి క్షణాలకు జీవితం పోస్తుంది
బతుకే అనుదిన యుద్ధమైన చోట
నిజమైన యుద్ధ విరమణ
ఆకాశమంత శాంతికాక మరేమిటి?



– అమ్మంగి వేణుగోపాల్

యువతరానికి ఆదర్శం ఓంకార్

మద్దికాయల ఓంకార్ నిస్వార్థ ప్రజా నాయకుడు. ఈ తరానికి తెలియాల్సిన గొప్ప త్యాగధనుడు. నమ్మిన సిద్ధాంతపు గీత దాటని, రాజీ పడని ఆయన తత్వానికి రాజకీయ, వర్గ శత్రువులు కూడా ఎందరో ఉండేవారు. ఆయన సైద్ధాంతిక, రాజకీయ పాఠశాల ఎందరినో తీర్చిదిద్దింది.


1926 మే 12న నేటి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం, ఏపూరు గ్రామంలో మద్దికాయల రామయ్య, అనంతలక్ష్మీ దంపతులకు ఓంకార్ జన్మించారు. నిజాం నవాబు పాలనలో దొరలు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల ఆగడాలతో తెలంగాణ ప్రజలు అవమానాలకు గురవుతూ, వెట్టిచాకిరీ చేస్తూ బానిసలుగా జీవించేవారు. 'వెట్టిచాకిరీని నిర్మూలించాలి, దున్నేవానిదే భూమి' అనే నినాదాలతో ప్రజల ముందుకు వచ్చిన ఆంధ్ర మహాసభలో 15 ఏళ్ల ఓంకార్ వలెంటీర్‌గా చేరి తరువాతి పోరాటంలో తుపాకీ చేతపట్టి నిజాం పాలనకు ఎదురొడ్డి పోరాడారు.



1972 నుంచి 83 వరకు మూడుసార్లు సీపీఎం నుంచి, 1985 నుంచి 1994 వరకు రెండుసార్లు ఎంసీపీఐ(యు) నుంచి మొత్తం ఐదుసార్లు (22 సంవత్సరాలు) నర్సంపేట ప్రజలు ఓంకార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం, ఆదివాసి హక్కుల పట్ల ప్రత్యేక దృష్టి సారించడం, సాగు భూమి, సాగునీరు, ఇళ్ల స్థలాల పంపిణీ, మిగులు భూముల పంపకం, తాగునీరు, నిరుద్యోగ సమస్య, కార్మికుల, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ ప్రజలచే 'అసెంబ్లీ టైగర్'గా మన్ననలందుకున్నారు.

మార్క్సిస్టు సైద్ధాంతిక రాజకీయ నిబద్ధతతో ఉన్న ఓంకార్ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ, ఆ తరువాత సీపీఎంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కులమతాల అసమానతలు లేని నవసమాజం కోసం అహర్నిశలు పోరాడిన అమరజీవి ఓంకార్. ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ 2025 మే 12 నుంచి 2026 మే 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రజాచైతన్య కార్యక్రమాలను చేపడుతోంది. ఓంకార్ గొప్పతనాన్ని నేటి తరానికి తెలియజేసే కార్యక్రమాలకు పూనుకుంది. ఈ కార్యక్రమాల్లో వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నాయకులతో పాటు సామాజిక శక్తులు, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, యువజనులు, ప్రజాతంత్రవాదులను కలుపుకుని ఈ కార్యక్రమాలను నిర్వహించనుంది. ఓంకార్ స్వస్థలమైన సూర్యాపేట జిల్లా ఏపూరులో 2025 మే 12న కాగడతో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. అదే రోజున సమీపంలోని వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లో ఓంకార్ 125 అడుగుల భారీ స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తూ 'ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభ' మొదలుకానుంది.

– వనం సుధాకర్
ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు





దోసపాడు కాల్వ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు చెరువుకు తూముల ద్వారా నీటి తరలింపు



అందాల ఆదాయం!

విలాసవంతమైన భవనాలు. ఖరీదైన వాహనాలు. బ్యాంకుల్లో లక్షలాది రూపాయల నిల్వలు. ఇవన్నీ కాంట్రాక్టులు చేయడం ద్వారా సంపాదించినవి కావు. ఎన్నాళ్ల నుంచో చెమటోడ్చి పోగేసుకున్న ఆస్తులు అంతకన్నా కావు. ఉత్తరాది యువతుల అందాలను ఎరగా వేసి అక్రమార్కులు వెనకేసుకున్న సంపాదన ఇది. ఉత్తరాది నుంచి యువతులను విజయవాడకు తీసుకొచ్చి వారి అందాలతో వ్యాపారం చేసి ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం స్థానికం నుంచి అంతరాష్ట్రాల స్థాయికి వెళ్లింది. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడలో కాస్మోపాలిటన్ సంస్కృతి మొదలైంది. ఇందులో భాగంగా మసాజ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఈ మసాజ్ సెంటర్లలో ముందుగా స్థానికంగా ఉండే యువతులను, మహిళలను ఉపాధి పేరుతో నియమించుకున్నారు. ఐదేళ్ల క్రితం నుంచి నగరంలో ఈ ట్రెండ్ కొత్త పుంతలు తొక్కుతూ వస్తోంది.

నగరానికి ఉత్తరాది యువతుల దిగుమతి

- ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు, దళారీ వ్యవస్థ
- లాడ్జిల్లో 'స్పాట్' కేంద్రాలు.. నెలకు రూ.లక్షల్లో సంపాదన
- ఒక్కో యువతిపై రోజుకు రూ.36 వేల వరకు ఆదాయం
- యువతులకు నెలకు ఇచ్చేది రూ. 50 వేలు



నగరంలోని ఓ లాడ్జీలో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఉత్తరాది అమ్మాయిలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన యువతులను విజయవాడకు తీసుకురావడం వెనుక దళారీ వ్యవస్థ, వాట్సాప్ గ్రూపులు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఢిల్లీ, లక్నో, లఖ్‌నవూ, కోల్‌కతా, భువనేశ్వర్, ముంబై నగరాల నుంచి యువతులను ఇక్కడికి తీసుకువస్తున్నారు. పోలీసులు దాడులు చేస్తున్న కొద్దీ ఈ వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మసాజ్ కేంద్రాలపై పోలీసుల నిఘా పెరగడంతో లాడ్జిలను స్పాట్ కేంద్రాలుగా మార్చిన విషయ తెలిసిందే. ఇంతకు ముందు ఇక్కడ మసాజ్ కేంద్రాల్లో పనిచేసిన యువతుల ద్వారా ఉత్తరాది నుంచి యువతులను తీసుకొస్తున్నారు. ఇందుకోసం 10-20 వాట్సాప్ గ్రూపులు పనిచేస్తున్నాయి. ఇవి కాకుండా మసాజ్ కేంద్రాల్లో మేనేజర్లు, క్యాషియర్లుగా పనిచేసిన వారు దళారులుగా వ్యవహరిస్తున్నారు. యువతులతో కాంట్రాక్ట్ కుదుర్చుకున్న వ్యక్తులు ఒక్కో యువతిపై రోజుకు రూ.60వేల నుంచి రూ.70 వేలు సంపాదిస్తున్నారు. ఒకరోజు సంపాదనను ఆ యువతులకు వేతనంగా ఇస్తున్నారు. ఒక్కో యువతికి నెలకు రూ.50 వేలు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇలా యువతులను తీసుకొచ్చిన దళారులకు రూ.10 వేల వరకు కమీషన్ చెల్లిస్తున్నారు. యువతుల వద్దకు వెళ్లే కస్టమర్ల నుంచి రూ.6 వేల నుంచి రూ.7 వేలు వరకు వసూలు చేస్తున్నారు. రోజుకు ఒక యువతి దగ్గరకు ఆరుగురు విటులను పంపితే రూ.36 వేల ఆదాయం సంపాదిస్తున్నారు. ఈ విధంగా సంపాదించిన డబ్బులతో ఆస్తులను, ఖరీదైన వాహనాలను సమకూర్చుకుంటున్నారు. వివిధ కేసుల్లో నిందితులను పూర్తిస్థాయిలో విచారించిన పోలీసులకు ఈ వ్యవహారాలన్నీ తెలుస్తున్నాయి.

ప్రతి నెల మార్పిడి

ఉత్తరాది రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన యువతులను ఎక్కువ రోజులు ఇక్కడ ఉంచడం లేదు. ప్రతి నెలకు ఒకసారి ఇలా వచ్చిన యువతులను మార్చేస్తున్నారు. 30 రోజులకు మించి వారు ఇక్కడ ఉండడానికి అవకాశం లేకుండా కాంట్రాక్టులు కుదుర్చుకున్నారు. తమ వద్ద కొత్త అందాలు ఉన్నాయని మార్కెటింగ్ చేసుకోవడానికి ఇలా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇలా అమ్మాయిలను తీసుకొచ్చే దళారులు, వాట్సాప్ గ్రూపులపై పోలీసులు నిఘా పెట్టారు.

కాల్వల నీటిని కాజేస్తున్నారు

దోసపాడు కాల్వలో వైసీపీ నాయకుల నీటి దోపిడీ

చెరువులు నింపేందుకు ప్రభుత్వం నీటి విడుదల

- ఆ నీటిని తమ చేపల చెరువులకు మళ్లిస్తున్న ఘనులు
- తూములు, మోటార్ల ద్వారా నీటిచౌర్యం
- పట్టించుకోని అధికారులు, ప్లానింగ్ కమిటీ
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలేటి చంటి నిర్వాకం



కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలేటి చంటి చేపల చెరువుకు మోటార్ల ద్వారా నీటిని తోడుతున్న దృశ్యం

ఇసుక, మట్టి, భూములే కాదు.. నీటిని కూడా దోచేసుకుంటున్నారు వైసీపీ నాయకులు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఏమాత్రం భయం లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. పంచాయతీల్లోని చెరువులను నింపేందుకు ప్రభుత్వం మంచి నీటిని వదిలితే.. ఆ నీటితో తమ చేపల చెరువులను నింపుకొంటున్న వైసీపీ నాయకుల బండారం నందివాడ మండలంలో బయటపడింది. నర్సాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలేటి చంటి.. కాల్వల నుంచి నేరుగా చెరువుల్లోకి తూములను ఏర్పాటు చేసుకుని, మోటార్లను పెట్టుకుని నీటిచౌర్యానికి పాల్పడుతున్నారు.

ఆంధ్రజ్యోతి, గుడివాడ : నందివాడ మండలంలోని పంచాయతీ చెరువులను నింపేందుకు దోసపాడు కాల్వకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20న మంచినీటిని వదిలింది. నర్సాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు పెదవిరివాడ సెంటర్‌లో కుదరవల్లి ఆయకట్టు వద్ద సుమారు 160 ఎకరాల్లో రెండు చేపల చెరువులున్నాయి. ఇటీవల చేపలను పట్టుబడి చేసి చెరువులను ఎండగట్టారు. వీటిలో 80 ఎకరాల చెరువుకు బుడమేరు నుంచి మోటార్ల సహాయంతో నీటిని నింపగా, మరో 80 ఎకరాల చెరువుకు దోసపాడు కాల్వ నుంచి నేరుగా తూములను ఏర్పాటుచేసి నీటిచౌర్యానికి పాల్పడుతున్నారు. కాల్వలో నీరు మిగతా 6లో..


ఇరిగేషన్ అధికారుల డ్రామా

పగలు రాత్రి తేడా లేకుండా అక్రమార్కులు మంచినీటిని దోచేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవట్లేదు. అనుమతులు లేకుండా కాల్వల నుంచి నేరుగా తూములను ఏర్పాటు చేసుకున్నా కనీస చర్యలు తీసుకోవట్లేదు. ఎవరైనా పర్యవేక్షణకు వస్తున్నారని తెలిస్తే ఆ పూటకు చేపల చెరువుల వారితో తూములను కట్టించడం లేదా మోటార్లను నిలుపుదల చేయడం చేస్తున్నారు. ఈ వారంలో నీటి సరఫరా నిలుపుదల చేయనున్న నేపథ్యంలో పంచాయతీ చెరువులు ఏస్థాయి వరకు నిండుతాయో వేచి చూడాలి. కాగా, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కాల్వ ద్వారా నీటి తరలింపును పరిశీలించేందుకు వస్తున్నారనే సమాచారంతో రెండు రోజుల క్రితం ఇరిగేషన్ అధికారులు పాలేటి చంటి చెరువుపై ఉన్న మోటార్లను నిలుపుదల చేయించారు.

కోర్టుకు చేరిన.. ఇసుక పంచాయితీ!

13న కాంట్రాక్టు పొందిన పార్టీలు వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

కృష్ణాజిల్లా ఇసుక టెండర్ల రద్దుపై కోర్టుకు వెళ్లిన కాంట్రాక్టర్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇసుక టెండర్ల వివాదం కోర్టుకు చేరింది. కృష్ణాజిల్లాలో చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలకు పిలిచిన టెండర్లు అత్యంత లోపభూయిష్టంగా జరిగాయని పలువురు కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం ఈ నెల 13వ తేదీన టెండర్లు దక్కించుకున్న సంస్థలు తమ వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. 2025 మార్చి 31 నాటికి జీఎస్టీ స్థానిక హోదా కలిగి ఉండాలన్న నిబంధనను అధికారులు విధించారు. ఈ నిబంధన వల్ల అప్పటికి స్థానికంగా రిజిస్ట్రేషన్ కాని వారు టెండర్లలో పాలు పంచుకోవటానికి అర్హత లేకుండా పోయింది. దీనిపై కాంట్రాక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేసినా కేవలం మూడు రోజుల్లోనే టెండర్లను ఖరారు చేసే పద్ధతిలో కృష్ణాజిల్లా యంత్రాంగం రీ నోటిఫికేషన్ ఇచ్చింది. టెండర్లంటేనే పోటీ పెంచటానికి పిలుస్తుంటారు. అలాంటిది టెండర్లలో పరిమితంగా పాల్గొనేలా నిబంధనలను పొందుపరచటమంటే అది ఉద్దేశ్యపూర్వకంగా చేసిన వ్యవహారమేనని ఆరోపణలు వచ్చాయి. దీంతో మిగిలిన కాంట్రాక్టు సంస్థలు టెండర్ల తీరును తప్పు పట్టాయి. ఇసుక టెండర్ల విధానం సరిగా లేదని న్యాయస్థానాలను ఆశ్రయించాలని నిర్ణయించారు. ఒకరిద్దరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. మరికొందరు క్యూలో ఉన్నారు. కాంట్రాక్టర్ల తొలి పిటిషన్‌పై న్యాయస్థానం కూడా కృష్ణాజిల్లా యంత్రాంగం అనుసరించిన విధానాన్ని తప్పు పట్టింది. టెండర్లను ఉన్నపళానా రద్దు చేయటాన్ని ఆక్షేపించింది. కేవలం మూడు రోజులలో అది కూడా శని, ఆదివారాలు మిగతా 6లో..



నయా క్యాట్ క్రేజ్

- నగరంలో పెరుగుతున్న పిల్లుల పెంపకం 8లో

పాపిస్థాన్!

మతోన్మాదం, ఉగ్రవాదాన్ని తలకెత్తించుకున్న దుర్మార్గపు దేశం

- పాక్‌తో యుద్ధాల్లో మేము తెలుసుకున్నది ఇదే
- నాటి యుద్ధాలు ఇప్పటికీ కళ్ల ముందు మెదులుతున్నాయ్
- ఆ రోజుల్లో ఇంత సాంకేతికత లేకపోయినా పాకిస్థాన్ పీచమణిచాం
- మాజీ సైనికులు మాతంగి పరమానందం, శీలం వెంకటేశ్వరరావు, ఐ.వెంకటేశ్వర్లు

6



ఐ.వెంకటేశ్వర్లు
పరమానందం
శీలం వెంకటేశ్వరరావు

జాతీయ రహదారులు రక్తసిక్తం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి.. పది మందికి గాయాలు

జిల్లాలో జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. విజయవాడ-హనుమాన్ జంక్షన్ రోడ్డులో వీరవల్లి వద్ద, విజయవాడ- మచిలీపట్నం రోడ్డులో తరకటూరు వద్ద శనివారం జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా, మరో పది మంది గాయపడ్డారు. దుర్గమ్మ దర్శనానికి బయలుదేరిన కుటుంబంలో బావ బావమరిది ఇద్దరూ చనిపోయారు. బావమరిదికి పది రోజుల కిందటే వివాహం కావడం, అతని భార్య పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో ఆయా కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. కాగా, మచిలీపట్నంలో జరిగే సమావేశానికి బయలుదేరిన ఆరుగురు ఆశా వర్కర్లలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఆశావర్కర్లు భారీగా బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. ఈ ప్రమాదాలతో హనుమాన్ జంక్షన్, తాడంకి, గోపువానిపాలెంలో విషాద చాయలు అలుముకున్నాయి.



తరకటూరు వద్ద ప్రమాదానికి కారణమైన కారు



వీరవల్లి బైపాస్‌పై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

కొత్త జీవితంలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి
- విషమంగా వధువు పరిస్థితి
- ఇద్దరిని బలికొన్న కారు



ధీరజ్, చీరా నవీన్ (ఫైల్)

విజయవాడ/హనుమాన్‌జంక్షన్ రూరల్/ హనుమాన్‌జంక్షన్ మే 9(ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం పెళ్లిపీటలు ఎక్కారు. ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకుంటున్నారు. దాంపత్య జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. రెండు కుటుంబాల మధ్య పెళ్లినాటి ఆనందోత్సవాలు ఇంకా కొనసాగుతున్నాయి. వధువు మెడలో వరుడు వేసిన మూడు ముళ్లను రోడ్డు ప్రమాదం తెంచేసింది. ఆనందంలో ఉన్న కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో కన్నీళ్లు తెప్పించింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన మూడెడ్ల ధీరజ్(37) హైదరాబాద్‌లో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడికి గత నెల 30న కాకినాడ జిల్లా తునికి చెందిన రమ్యరూపతో వివాహమైంది. ఇటీవలే హనుమాన్‌జంక్షన్‌లో వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించుకున్నారు. తుని వెళ్లి వచ్చిన నూతన వధూవరులు తోబుట్టువులతో కలిసి విజయవాడ దుర్గమ్మ మిగతా 6లో..

సమావేశానికి వెళ్తూ అనంతలోకాలకు..

తరకటూరు వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం

- ఇద్దరు ఆశా వర్కర్లు మృతి.. మరో నలుగురికి గాయాలు
- ఆటోను వెనుక నుంచి ఢీకొన్న కారు
- మృతులు తాడంకి, గోపువానిపాలెం వాసులు



దుర్గ, విజయ లక్ష్మి (ఫైల్)

గూడూరు/పమిడిముక్కల, మే10 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో జరిగే సమావేశానికి బయలుదేరిన ఆశావర్కర్లలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మరో నలుగురు గాయపడిన ఘటన మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై తరకటూరు వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కపిలేశ్వరపురం మండలం గోపువాని పాలెం గ్రామానికి మిగతా 6లో..

బాలుడిని బలిగొన్న బియ్యం డబ్బా

సరదాగా ఆడుకోబోతే... మూతపడి ఊపిరి ఆగింది

కంచికచర్లలో ఘటన.. కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు

సరదాగా ఆడుకుంటూ బియ్యం డబ్బాలో కూర్చొన్న ఏడేళ్ల బాలుడిపై మూత పడటంతో బయటకు రాలేక, ఊపిరాడక మృతి చెందాడు. అప్పటి దాకా తమ కళ్ల ముందే ఆడుకుంటున్న కన్న కొడుకు అసువులు బాయటంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. చూపరులకు కన్నీళ్లు తెప్పిస్తున్న హృదయ విదారక ఘటన కంచికచర్లలో శుక్రవారం జరిగింది.



ప్రాణాలు బలిగొన్న బియ్యం డబ్బా.. వినయ్ కుమార్(ఫైల్)

కంచికచర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల అరుంధతీకాలనీకి చెందిన ఉలవలపూడి పవన్, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు. పవన్ ఒక ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా, సరస్వతి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తోంది. నిరుపేదలు కావటంతో రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమారులిద్దరికీ పెద్ద చదువులు చెప్పించి, ఉన్నతమైన భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో స్థానిక ఇంగ్లీషు మీడియం స్కూలులో చదివిస్తున్నారు. పెద్దకుమారుడు రెండో తరగతి, చిన్న కుమారుడు వినయ్ కుమార్(7)కు ఒకటో తరగతి పూర్తైంది. వేసవి సెలవుల కోసం పెద్ద కుమారుడు బంధువుల ఇంటికి వేరే గ్రామం వెళ్లాడు. రెండు రోజుల్లో జరగనున్న పవన్ తండ్రి సంస్మరణ కార్యక్రమం నిమిత్తం ఇంటిని శుభ్రం చేయాలనుకున్నారు. శుక్రవారం పవన్ కంపెనీకి వెళ్లగా, ఇంట్లో సామన్లు ఇంటిపైన (రూఫ్) పెట్టి సరస్వతి ఇల్లు శుభ్రం చేస్తుంది. ఆడుకునేందుకు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో చిన్న కుమారుడు వినయ్‌కుమార్ ఇంటిపైకి వెళ్లాడు. ఆడుకుంటూ సరదాగా బియ్యం డబ్బాలో కూర్చోగానే మూత పడటంతో పాటుగా గొళ్లెం కూడా ఆటోమేటిక్‌గా పడింది. అభం శుభం తెలియని వినయ్ ఎంత ప్రయత్నించినప్పటికీ గొళ్లెం ఊడలేదు. మూత బిగుసుకుపోవటంతో ఒకవైపు డబ్బాలో గాలి తగలటం లేదు. మరోవైపు స్టెయిన్‌లెస్ స్టీల్ డబ్బా కావటంతో ఎండ తీవ్రతకు బాగా వేడెక్కింది. ఊపిరాడక పోవటంతో కొద్ది నిమిషాల వ్యవధిలోనే వినయ్ విగతజీవిగా మారిపోయాడు. వేడికి చర్మం కూడా ఎర్రగా కమిలిపోయింది. సాయంత్రమైనప్పటికీ చిన్న కుమారుడు ఇంటికి రాకపోవటంతో తల్లి సరస్వతి కంగారు పడుతూ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు, బంధువులకు, స్థానికులకు తెలిపింది. అందరూ చుట్టు పక్కల పరిసరాలతో పాటుగా సమీప గ్రామాల్లో గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. శుక్రవారం రాత్రి మిగతా 6లో..

మిర్చి రైతుల ఆందోళన

- యాజమాన్యాన్ని పిలిపించిన ఎమ్మెల్యే తాతయ్య
- ఉదయం నుంచి సుదీర్ఘ చర్చలు
- రైతులకు హామీగా రూ.1.60 కోట్లకు చెక్‌లు
- పాత సరుకు ధర నిర్ణయంపై మళ్లీ చర్చలు

8లో

దుర్గాఘాట్‌లో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు దుర్గగుడి ఈవో ఆదేశం 8లో



దుర్గాఘాట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఈవో శీనా నాయక్

దుర్గాఘాట్‌లో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు దుర్గగుడి ఈవో శీనా నాయక్ ఆదేశం

ఇంద్రకీలాద్రి, మే 10(ఆంధ్రజ్యోతి): 'నదిలో నీరు ఎండిపోతున్నందున భక్తుల సౌకర్యార్థం దుర్గాఘాట్‌లో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయాలి. ఘాట్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. మరుగుదొడ్లకు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులకు అవసరమైన మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.' అని ఇంజనీరింగ్ అధికారులను దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ ఆదేశించారు. నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం ఇంజనీరింగ్ అధికారులు, ఆలయంలోని వివిధ విభాగాల బాధ్యులతో కలిసి దేవస్థానం పరిధిలోని వివిధ ప్రదేశాలను పరిశీలించారు. పూజా సామగ్రి అమ్మే హాకర్లను క్రమబద్ధీకరించాలని, రేట్లన్నీ ఒకేరీతిలో ఉండేలా చూడాలని లీజుల విభాగం అధికారులకు సూచించారు. కేశఖండనశాలలో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని, భక్తులతో మర్యాదగా మెలగాలని క్షురకులు, సిబ్బందికి సూచించారు. కుమ్మరిపాలెంలో దేవస్థానానికి ఉన్న ఖాళీ స్థలం, అక్కడ భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మునిసిపల్ హెడ్‌వాటర్ వర్క్స్ ఎదురుగా కొండ ప్రాంతాన్ని పరిశీలించి రెండో ఘాట్‌రోడ్డు ప్రతిపాదనలపై ఆరా తీశారు. ఆలయ భద్రతలో కీలకమైన శివాలయం వద్ద ఉన్న మెట్లు, రుద్రహోమం మండప ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఉత్తరం వైపు మెట్ల దారిలో గతంలో ఉన్న సిబ్బంది నివాస సముదాయాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. కొండపైన అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించే మండపంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ శాస్త్రోక్త విధానంలో కార్యక్రమాలను చేయాలని అర్చకులను ఆదేశించారు. కొండపైన మంచి నీటి కూలర్లను పరిశీలించారు. శుభ్రం చేస్తున్న తేదీలను ట్యాంక్‌పై రాయాలన్నారు. ఉచిత ప్రసాదం, భక్తులందరికీ పంపిణీ చేసేలా చూడాలని, యాగశాల, పూజా మండపాలను త్వరగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

రేపు గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి: ప్రతి పౌర్ణమినాడు నిర్వహించే గిరిప్రదక్షణ మాసవారీ ఉత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో శీనా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్‌రోడ్ అమ్మవారిగుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుతుందని ఈవో వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన సూచించారు.

అవినీతి ఫీల్డ్ అసిస్టెంటు మళ్లీ విధుల్లోకి..

- మొదటి తప్పుగా భావించి సస్పెన్షన్ ఎత్తేస్తూ ఉత్తర్వులు
- అధికారుల తీరుపై టీడీపీ నాయకుల విస్మయం

కంచికచర్ల రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అతనో ఫీల్డ్ అసిస్టెంట్(ఎఫ్ఏ) అనేక అవినీతి అక్రమాలు చేయడం.. అవి రుజువు కావడంతో విధుల నుంచి అధికారులు తప్పించారు. అక్రమాల ద్వారా, అవినీతి ద్వారా తాను తిన్న సొమ్ములు తిరిగి చెల్లించాడని మొదటి తప్పుగా భావించి తిరిగి విధుల్లోకి తీసుకుంటూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై టీడీపీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని మోగులూరు ఎఫ్ఏ సక్కుర్తి అంజనేయులు ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్లు వేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెలగా నరసింహారావు ఏప్రిల్ 22న అధికారులకు ఫిర్యాదు చేశా రు. అధికారుల విచారణలో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ అవడంతో ఎఫ్ఏను సస్పెండ్ చేశారు. సస్పెండై నెల కూడా గడవక ముందే మళ్లీ ఎఫ్ఏగా విధుల్లో చేరాడు. ఈనెల 8 తేదీన ఎఫ్ఏను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎఫ్ఏ తిరిగి విధుల్లోకి రావడంపై టీడీపీ నేతలు విస్మయం చెందుతున్నారు. తప్పు చేసిన సిబ్బందిని తప్పించి వారి స్థానంలో కొత్త వారిని పెట్టాలి కానీ, డబ్బు చెల్లించాడని, మొదటి తప్పుగా క్షమించామంటూ మళ్లీ విధుల్లోకి తీసుకోవడమేంటని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు లోతైన దర్యాప్తు చేసి, అవినీతికి పాల్పడిన ఎఫ్ఏను విధుల నుంచి తప్పించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



మధ్యతరగతి ఉద్యోగుల సదస్సులో ప్రసంగిస్తున్న ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఆర్.అజయ్‌కుమార్

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక పిలుపు

గవర్నర్‌పేట, మే 10(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వేదిక పిలుపునిచ్చింది. శనివారం వేదిక ఆధ్వర్యాన ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మధ్యతరగతి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సు లో వేదిక రాష్ట్ర కన్వీనర్ ఆర్.అజయ్‌కుమార్ మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు అందించే లక్ష్యంతో కేంద్రం కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. అవి అమల్లోకి వస్తే ఇప్పుడున్న అనేక హక్కులను కార్మికులు, ఉద్యోగులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు కృషి చేశాయని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపివేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘం(ఏఐబీఈఏ) రాష్ట్ర నాయకుడు వై.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల వల్ల ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, కనీస వేతనాలు, పోరాడే హక్కులను కార్మికులు కోల్పోవాల్సి వస్తుందని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. సదస్సులో బ్యాంకు ఉద్యోగ సంఘ నాయకుడు ఎస్వీ రమణ, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు ఎల్.కృష్ణబాలాజీ, విద్యుత్ సంఘం నాయకుడు ఎల్.రాజు, బ్యాంకు అధికారుల సంఘం నాయకుడు కేపీబీఎల్ నర్సింహం, బీమా ఉద్యోగుల సంఘం నాయకుడు సీహెచ్ కళాధర్ ప్రసంగించారు. సమ్మెను జయప్రదం చేయాలని ముద్రించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

పాపిస్థాన్!

మతోన్మాదం, ఉగ్రవాదాన్ని తలకెత్తించుకున్న దుర్మార్గపు దేశం

- పాక్‌తో యుద్ధాల్లో మేము తెలుసుకున్నది ఇదే
- నాటి యుద్ధాలు ఇప్పటికీ కళ్ల ముందు మెదులుతున్నాయ్
- ఆ రోజుల్లో ఇంత సాంకేతికత లేకపోయినా పాకిస్థాన్ పీచమణిచాం: నగరానికి చెందిన మాజీ సైనికులు

'పాకిస్థాన్.. మతోన్మాదాన్ని తలకెక్కించుకుని, ఉగ్రవాద శక్తులను పెంచి పోషిస్తున్న దేశం. మనకంటే ఒక్కరోజు ముందే స్వాతంత్ర్యం సాధించింది. నాటి నుంచి నేటి వరకు ఏదో ఒక రూపంలో భారత్‌పై తన కుటిల బుద్ధిని వెళ్లగక్కుతూనే ఉంది. ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తూ, వారి సహకారంతో వేలాది అమాయక భారతీయులను పొట్టన పెట్టుకుంది. మతం, స్వాతంత్ర్యం అని భ్రమ కల్పించి కశ్మీర్‌లో స్థానిక యువతను ఉగ్రవాదులుగా తయారుచేస్తోంది. ప్రశాంత వాతావరణంలో నిరంతరం అల్లర్లు సృష్టించి దేవతల భూమి కశ్మీర్‌ను రణభూమిగా మార్చింది. కశ్మీర్‌లో ఉగ్రకార్యకలాపాలకు మద్దతు తెలుపుతూ దేశంలో ఏదో ఓ చోట బాంబు దాడులు, యాత్రికులపై కాల్పులకు తెగబడుతోంది. పహల్గాంలో అమాయకులను చంపించింది.' అని పాకిస్థాన్‌తో జరిగిన నాటి యుద్ధాల్లో పాల్గొన్న నగరానికి చెందిన మాజీ సైనికులు తెలిపారు. ఆనాటి యుద్ధ విశేషాలను పంచుకోవడంతో పాటు పాక్ దుర్బుద్ధిని ఎండగట్టారు. ఉగ్రవాదులకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం పై వారు మండిపడ్డారు. - (ఆంధ్రజ్యోతి-విజయవాడ)

అప్పట్లో సాధారణ తుపాకులు, ల్యాండ్‌మైన్లతోనే యుద్ధం



అప్పట్లో తుపాకులు, ల్యాండ్ మైన్, సాధారణ బాంబులతోనే యుద్ధం చేసేవాళ్లం. 1971 బంగ్లాదేశ్ వేర్పాటు సమయంలో కశ్మీర్ నుంచి వాహనాల్లో ఆయుధాలను తీసుకెళ్లేవాళ్లం. అధిక మొత్తంలో పేలుడు పదార్థాలను తీసుకెళ్లాలంటే పగటిపూటే రవాణా చేసేవాళ్లం. తుపాకులు, తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను కొండ పై ప్రాంతాలకు తీసుకెళ్లాలంటే రాత్రి సమయంలో, తక్కువ వెలుతురులో, ఇద్దరు సిపాయిలు ముందు నడుస్తుంటే వారిననుసరిస్తూ వాహనాల లైట్లను ఆర్పేసి తీసుకెళ్లేవాళ్లం. ఉగ్రవాదులు పేరుతో భారత్‌పైకి పాక్ సైన్యం కవ్వింపులకు దిగడం ఇది మొదటిసారి కాదు. సంయమనం చూపి న ప్రతిసారి దేశాన్ని చిన్నచూపు చూసేది. అప్పట్లో సైన్యం వాగు, చిన్న నదిని దాటాలంటే యుద్ధ ప్రాతిపదికన సైనికులే బ్రిడ్జిని నిర్మించి, తొలగించేవాళ్లం. ఇప్పుడంతా మిషనరీలతో క్షణాల్లో పూర్తయిపోతోంది. ఈసారి పాకిస్థాన్‌తో యుద్ధం అనివార్యమైంది. అయితే భారత సైనికులు ప్రజల జోలికి పోకుండా ఉగ్రవాదులను అంతం చేయాలి. ఇప్పుడున్న సాంకేతికత, అత్యాధునిక ఆయుధాలతో పాకిస్థాన్‌ను ఐదు రోజుల్లో ఓడించే సత్తా భారత సైన్యానికి ఉంది. కచ్చితంగా తొందర్లోనే భారతసైన్యం యుద్ధాన్ని ముగిస్తుంది.

- మాతంగి పరమానందం, ఇంజినీరింగ్ విభాగం డ్రైవర్, మద్రాసు రెజిమెంట్

ఇప్పుడు యుద్ధానికి రమ్మని పిలిచినా సిద్ధమే



ఈ క్షణంలో యుద్ధానికి రమ్మని రక్షణశాఖ ఆహ్వానించినా సిద్ధంగా ఉన్నా. దేశానికి సేవ చేయడానికి ప్రతిక్షణం అందుబాటులో ఉంటా. ఉద్యోగం చేస్తున్నప్పుడు కుటుంబం గురించి ఆలోచించడం, వారికి ఉత్తరాలు రాయడం జరుగుతుంది. కానీ యుద్ధం జరుగుతున్నప్పుడు మాత్రం కుటుంబ సభ్యులు, సొంత ఊరు ఏవీ గుర్తుకురావు. యుద్ధం చేస్తున్నంతసేపు రెండో ఆలోచన ఉండదు. యుద్ధం జరుగుతున్న సమయంలో భయపడి వెనక్కి తిరిగి వచ్చే ఆలోచన ఎవరికైనా ఉంటే వారి వెనుక సిద్ధంగా ఉన్న సైన్యాన్ని చూసి ఆ ఆలోచనను ఉపసంహరించుకోవాల్సిందే. ఎందుకంటే ముందు కదులుతున్న సైన్యానికి వెనుక ఇంకో బ్యాచ్ సిద్ధంగా ఉంటుంది. 1971 బంగ్లా విమోచన యుద్ధంలో మిసైల్ ఆపరేటర్‌గా పనిచేశాను. అధికారులు ఎలాంటి పరిస్థితుల్లో చెప్పినా కేవలం ఐదు నిమిషాల్లోనే లోడింగ్ చేయాలి. చేయకపోతే అధికారులు కఠినంగా వ్యవహరించేవారు. చండీఘర్ నుంచి ఆదంపూర్, అక్కడి నుంచి షంషెడ్‌లో కూడా పనిచేశాను. ఆ యుద్ధ సమయంలో కశ్మీర్‌లోని ఓ ప్రాంతంలో విధుల్లో ఉన్నప్పుడు మా స్థావరానికి, పక్కనే ఉన్న గ్రామానికి మధ్యలో పాక్ ఎయిర్‌ఫోర్స్ బాంబు వేసింది. అదృష్టవశాత్తు గ్రామప్రజలకు, మాలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రస్తుతం భారత ఎయిర్‌ఫోర్స్ వ్యవస్థలో అత్యాధునిక యుద్ధ విమానాలు, మిసైల్స్ అందుబాటులో ఉన్నాయి. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రఫెల్ యుద్ధ విమానాలు ఆధునికమైనవి. మన మిత్రదేశమైన రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్-400 క్షిపణి నిర్వీర్య వ్యవస్థ పాకిస్థాన్ దగ్గర లేదు. పాక్‌ను ఓడించడం పెద్ద విషయమేమీ కాదు. కానీ పాక్ ప్రజల గురించి ఆలోచించి భారత సైన్యం ఆచితూచి పోరాడుతోంది. దీనిని ఆ దేశ సైన్యం అలుసుగా తీసుకుని భారత జనావాసాల్లో కూడా బాంబు దాడులు చేస్తోంది. పహల్గాం దాడి నేపథ్యంలో ఇప్పుడు మన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదే. భారత సైన్యం యుద్ధం చేస్తున్నది అక్కడి ప్రజలపై కాదు. ఉగ్రవాదులపై మాత్రమే.

- శీలం వెంకటేశ్వరరావు, ఎయిర్‌మెన్, పోరంకి

ఇప్పుడున్న టెక్నాలజీతో పాక్‌ను చిత్తు చేయడం సులభమే..



1965, 71లో పాకిస్థాన్‌తో జరిగిన రెండు యుద్ధాల్లో పాల్గొన్నా. 1965లో మా రెజిమెంట్(కోర్ ఆఫ్ సిగ్నల్ రెజిమెంట్) ఢిల్లీలో ఉండేది. డివిజన్ 19లో బ్రిగేడ్- 104లో సిగ్నల్స్ విభాగంలో విధులు నిర్వర్తించా. ఎక్కువగా వాహనాల్లో ఆయుధ సామగ్రిని సైనికులకు చేరవేసేవాడిని. పాక్‌తో భారత్ నేరుగా చేసిన యుద్ధంలో కంటే 1971 బంగ్లా విమోచన సమయంలో జరిగిన యుద్ధంలో ఆయుధాలు సరఫరా చేయడానికి కష్టపడాల్సి వచ్చేది. ఎందుకంటే తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ రెండు వైపులా సైనికులు పోరాడాల్సి వచ్చింది. సాధారణంగా యుద్ధం అంటే దేశానికి ఒక వైపే పోరాడాల్సిన సందర్భాలు ఉంటాయి. కానీ పాకిస్థాన్ నుంచి బంగ్లా విడిపోక ముందు భారత్‌కు రెండువైపులా పాక్ హద్దులు పంచుకుంది. దీంతో సైనికులకు రెండు వైపులా తుపాకులు, ల్యాండ్‌మైన్ లాంటి ఆయుధాలు చేరవేయడానికి వాహనాలు, డ్రైవర్లు సరిపోయేంతగా లేక ఇబ్బంది పడేవాళ్లం. అయితే యుద్ధం అనుకున్నంత ఎక్కువ కాలం సాగలేదు. పదమూడు రోజుల్లోనే ముగిసిపోవడంతో పెద్దకష్టమనించలేదు. ప్రస్తుతం భారత రక్షణ రంగం ప్రపంచదేశాలతో పోటీపడుతోంది. అమ్ముల పొదిలో అత్యాధునిక ఆయుధాలు చేరాయి. నాటి కంటే ఎయిర్‌ఫోర్స్, నేవీ మరింత బలంగా మారాయి. ఆర్మీకి అత్యాధునిక తుపాకీలు, సోల్డర్ మిసైల్స్ మరింత బలాన్నిచ్చాయి. భారత్ సంయమనం పాటించకుండా పాక్‌పై విరుచుకుపడితే రెండు రోజుల్లోనే ఆ దేశాన్ని మన దేశంలో విలీనం చేయొచ్చు. ఉగ్రవాదులను తయారుచేయడం పాక్‌కు కొత్తేమీ కాదు. ఉగ్రవాదులపై చేసిన ఖర్చు దేశాభివృద్ధికి పెడితే ఇప్పటికే అభివృద్ధి అయ్యేది. కానీ మనదేశం మీద అక్కసుతో ఉగ్రవాదులను ఉసిగొల్పుతూ అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటోంది. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడులకు భారత్ సరైన సమాధానం చెబుతోంది. పాక్‌ను చిత్తు చేసి పీవోకేను దేశంలో విలీనం చేసి పాక్‌వైపు ఉన్న దేశ సరిహద్దులను మరింత పటిష్టం చేస్తే మన దేశంలోకి ఉగ్రవాదులు వచ్చే అవకాశమే ఉండదు. - ఐ.వెంకటేశ్వర్లు, సిపాయి, డ్రైవర్



కాల్పుల విరమణతో ఊపిరి పీల్చుకున్నాం

- చాలా డ్రోన్లను ఆర్మీ ధ్వంసం చేసింది
- విజయవాడకుచెందిన నిట్ జలంధర్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం హెడ్ శ్రీనివాస్

విజయవాడ, మే 10(ఆంధ్రజ్యోతి): కాల్పుల విరమణ నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్నామని, మూడురోజులుగా నిద్రలేని రాత్రులు గడిపామని నిట్ జలంధర్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం హెడ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి జలంధర్‌లో సాధారణ జీవనం కొనసాగిందన్నారు. జలంధర్ చుట్టుపక్కల రాత్రిళ్లు బాంబుల శబ్దాలు, విద్యుత్ లేకపోవడంతో మూడు రోజులుగా ఎవరికీ నిద్ర లేదన్నారు. నిట్ జలంధర్ యూనివర్సిటీతో పాటు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో కూడా తెలుగు విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, వారందరినీ మూడురోజులు ముందుగానే స్వస్థలాకు పంపించేశారని ఆయన తెలిపారు. అత్యవసర సమయంలో విమాన ధరలు అధికంగా ఉండడంతో బస్సులు, రైలు మార్గాల ద్వారా వారంతా ఢిల్లీ చేరుకున్నారన్నారు. కొన్ని విమానయాన సంస్థలు ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రూ.60 వేలు వసూలు చేశాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ఇక్కడే ఉండాలని చెప్పడంతో తాము ఉండిపోయామన్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు ఇన్వర్టర్లు వాడొద్దని, సీసీ కెమెరాలు ఆఫ్ చేయాలని సైనికాధికారులు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. శనివారం ఉదయం కూడా జలంధర్ చుట్టుపక్కల బాంబులు పడ్డాయని, అవన్నీ పొలాల్లో పడడంతో ప్రాణ నష్టం జరగలేదన్నారు. జలంధర్‌లో ఉన్న యాంటీడ్రోన్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని శ్రీనివాస్ తెలిపారు.



విజయవాడలో కృష్ణా జలయాత్రను ప్రారంభిస్తున్న జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను

కృష్ణా జలాలను కాపాడుకుందాం

- జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పిలుపు

వన్‌టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలను కాపాడుకుందామని ప్రజలకు జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. జనసేన పార్టీ పర్యావరణ విభాగ ప్రధాన కార్యదర్శి, జల బిరాదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ, అనుమోలు గాంధీ ఆధ్వర్యంలో హంసలదీవి నుంచి మొదలైన కృష్ణా జలయాత్ర శనివారం విజయవాడకు చేరుకుంది. ఇక్కడ కృష్ణ జలయాత్ర కార్యక్రమాన్ని సామినేని ఉదయభాను ప్రారంభించారు. కృష్ణానదిని పారిశ్రామిక కాలుష్యం నుంచి, ఆక్రమణల చెర నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని ఉదయభాను కోరారు. భవిష్యత్ తరాలకు కృష్ణానది నుంచి సురక్షితమైన మంచినీటిని అందించటమే లక్ష్యంగా యాత్ర సాగుతుందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కృష్ణానది సుమారు 1400 కిలో మీటర్ల వరకు ప్రయాణం చేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్, టెక్నాలజీ సీఈవో శరత్, జనసేన నాయకులు అజయ్ ఠాకూర్ వర్మ, ఎస్ఎస్ మూర్తి, కొండవీటి సంతోష్ కృష్ణ, స్టాలిన్, గన్ను శంకర్, అశోక్, తిరుపతి అనూష పాల్గొన్నారు.

సమావేశానికి వెళ్తూ అనంతలోకాలకు..

(5వ పేజీ తరువాయి)

చెందిన తాడేపల్లి విజయలక్ష్మి(45), కపిలేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కు చెందిన ఊటుకూరి దుర్గ(40), శ్రీవాణి, నిర్మల, జ్యోతి, మాగంటి సుజాత మంటాడలో ఆటో ఎక్కి మచిలీపట్నంలో జరిగే సమావేశానికి బయలుదేరారు. తరకటూరు వచ్చే సరికి విజయవాడ వైపు నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గ అక్కడికక్కడే మృతి చెందింది. విజయలక్ష్మి (45) ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయింది. శ్రీవాణి, నిర్మల, జ్యోతి, సుజాత, ఆటో డ్రైవర్ మనోజ్‌లకు గాయాలయ్యాయి. వీరిని బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఆశా వర్కర్లు వందలాదిగా ఆస్పత్రికి తరలివచ్చి గొల్లు మన్నారు.

పలువురు సంతాపం...

కాగా, రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, డీఎంహెచ్‌వో శర్మిష్ఠ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

తాడంకి, గోపువాని పాలెంలో విషాదచాయలు

రోడ్డు ప్రమాదంలో తాడంకి, గోపువానిపాలేనికి చెందిన ఆశావర్కర్లు ఊటుకూరి దుర్గ, తాడేపల్లి విజయలక్ష్మి మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదచాయలు నెలకొన్నాయి. ప్రమాదవార్త తెలియగానే తాడంకి టీడీపీ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, సర్పంచ్ ధనలక్ష్మి, మస్తాన్‌రావు మచిలీపట్నం వెళ్లి మృతులకు నివాళులర్పించారు.

బాలుడిని బలిగొన్న బియ్యం డబ్బా

(5వ పేజీ తరువాయి)

ఏడు గంటల సమయంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంటిమీద కునుకు లేకుండా, అన్న పానీయాలు లేకుండా వినయ్ కోసం వెదుకుతూనే ఉన్నారు. అయితే అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటిపైకి వెళ్లి బియ్యం డబ్బా తెరిచి చూడగా అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు చలనం లేకుండా విగతజీవిగా కనిపించాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే వినయ్ మృతి చెందాడని వైద్యులు చెప్పగానే తల్లిదండ్రులు పవన్, సరస్వతి గుండెలు పగిలేలా రోదిస్తూ కుప్పకూలిపోయారు. శనివారం నందిగామలో పోస్టుమార్టం అనంతరం వినయ్ భౌతికకాయాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఈ ఘటన ప్రతి ఒక్కరిని కంటతడిపెట్టించింది. సాయంత్రం అంత్య క్రియలు నిర్వహించారు.

కాల్వల నీటిని కాజేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

పుష్కలంగా ఉన్న క్రమంలో గ్రావిటీ ద్వారా నేరుగా తూముల నుంచి, కాల్వలో నీరు కొంచెం తగ్గడంతో దాదాపు 10 మోటార్లను పెట్టి పగలు, రాత్రి తేడా లేకుండా చెరువును నింపేసుకుంటున్నారు.

కొడాలి నాని ముఖ్య అనుచరుడి నీటిచౌర్యం

మాజీమంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలేటి చంటికి తుమ్మలపల్లి ఆయకట్టులో 30 ఎకరాల చేపల చెరువు ఉంది. ఇటీవల చేపల పట్టుబడి చేసి చెరువులను ఎండగట్టారు. ఆ చెరువుకు దోసపాడు కాల్వ నుంచి నేరుగా మూడు తూములను ఏర్పాటు చేసుకున్నారు. తూముల ద్వారా కొంతమేర చెరువును నింపి, మిగిలిన భాగాన్ని ఆరు మోటార్ల సాయంతో నింపేసుకున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా నీటిచౌర్యం జరుగుతున్నా కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

నందివాడ డ్రాప్ వరకు ఫుల్

దోసపాడు కాల్వలో నందివాడ డ్రాప్ వరకు నీరు పుష్కలంగా ఉంటుంది. కట్టలు తెగే స్థాయిలో ఇక్కడ నీటి నిల్వలు ఉంటాయి. అయితే, రామాపురం సెంటర్‌కు వచ్చేసరికి కాల్వలో అడుగు లోతు నీరు కూడా కనిపించదు. నీటిచౌర్యం వల్లే ఈ పరిస్థితి వస్తోందని పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాక్షన్ ప్లానింగ్ కమిటీ ఎక్కడ?

నీటిచౌర్యం జరగకుండా, పంచాయతీ చెరువులను సకాలంలో నింపాలనే ఆలోచనతో మండల స్థాయిలో యాక్షన్ ప్లానింగ్ కమిటీని నియమించారు. దీనిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ ఇరిగేషన్, ఫిషరీస్ డీవో, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో కూడిన కమిటీని నియమించారు. మండలంలో ఎక్కడా కూడా కమిటీ పర్యవేక్షణకు వెళ్లిన దాఖలాలు లేవు. ఫిషరీస్ డీవో, ఇరిగేషన్ ఏఈ మాత్రం అప్పుడప్పుడు కనిపిస్తున్నారు.

ఆ చెరువులు నిండేదెప్పుడు?

దోసపాడు కాల్వ ద్వారా మండలంలోని వెంకటరాఘవాపురం, వెన్ననపూడి, పెదవిరివాడ, కుదరవల్లి శివారు సూర్యప్రకాశ్‌పేటకు చెందిన పంచాయతీ చెరువులు నిండటం ప్రశ్నార్థకంగా మారింది. కాల్వ నీటిని చేపల చెరువుల యజమానులు అక్రమంగా తరలించుకుపోయారని, కాల్వలో ప్రవాహం కూడా తగ్గిందని, పంచాయతీ చెరువులు పూర్తిస్థాయిలో నింపే పరిస్థితి లేదని ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

ఇరిగేషన్ అధికారులే అమ్మేసుకుంటున్నారు

నందివాడ వరకు కాల్వలో భారీస్థాయిలో నీరు ఉంది. రామాపురానికి వచ్చేసరికి అడుగు లోతు ఉండట్లేదు. కాల్వలో నీరు పుష్కలంగా వచ్చిన నాడే పంచాయతీ చెరువులను నింపుతా. మోటార్లు పెట్టి నీటిని తోడితే పంచాయతీపై అదనపు భారం పడుతుంది. చేపల చెరువులకు కాల్వ నీటిని ఇరిగేషన్ అధికారులే అమ్మేసుకుంటున్నారు.

- కాకరాల సురేశ్, వెంకటరాఘవాపురం సర్పంచ్, నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు

కొత్త జీవితంలో విషాదం

(5వ పేజీ తరువాయి)

దర్శనానికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వీరవల్లికి చెందిన బీరా నవీన్(36) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి. ధీరజ్‌కు బావ. వారితో పాటు ధీరజ్ తోబుట్టువు అలేఖ్య, నవీన్ భార్య లక్ష్మీ ప్రవల్లిక, ముగ్గురు చిన్నారులు కారులో అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. జాతీయ రహదారిపైకి వచ్చిన గంటలోనే మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చింది. విజయవాడకు చెందిన ఆన్‌లైన్ వీడియోగ్రాఫర్ కోనూరి శ్రీనివాసరావు ఆన్‌లైన్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. హనుమాన్ జంక్షన్‌లో జరిగే కార్యక్రమంలో ఫొటోలు తీయడానికి వెళ్తున్నాడు. తన వెంట సహాయకుడు శ్రీనును తీసుకెళ్తున్నాడు. సరిగ్గా వీరవల్లి జాతీయ రహదారిపైకి వచ్చే సరికి జంక్షన్ వైపు వెళ్లే రహదారిపై ఉండాల్సిన వీరి కారు డివైడర్ దాటి విజయవాడ వైపు వెళ్తున్న ధీరజ్ కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ఛిద్రమయ్యాయి. ధీరజ్ కారులో ఉన్న వాళ్లంతా గాయాలపాలయ్యారు. వారిని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ధీరజ్, నవీన్ మార్గ మధ్యలో ప్రాణాలు కోల్పోయారు. ధీరజ భార్య రమ్యరూప పరిస్థితి విషమంగా ఉంది. నవీన్ సతీమణి ప్రవల్లిక, పిల్లలు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫొటోగ్రాఫర్ శ్రీనివాసరావు, సహాయకుడు శ్రీనుకు గాయాలయ్యాయి. రెండు కారులు వేగంగా ఢీ కొనడంతో ఒక్కసారిగా జాతీయ రహదారిపై భారీ శబ్దం వచ్చింది. కేసును వీరవల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ధీరజ్ తండ్రి మూడెడ్ల వెంకట్రావు చిట్‌ఫండ్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తూ కుమారుడిని చార్టెడ్ అకౌంటెంట్‌గా తీర్చిదిద్దారు. కొడుకుపై ఎన్నో ఆశలు పెంచుకున్న వెంకట్రావు కుమారుడు, అల్లుడు ప్రమాదంలో చనిపోవడంతో గుండెలు పగిలేలా రోదిస్తున్నాడు. రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

కోర్టుకు చేరిన.. ఇసుక పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

చూసుకుని టెండర్ల గడువును ఎలా నిర్ధారిస్తారంటూ నిలదీయటంతో.. జిల్లా యంత్రాంగం నీళ్లు నమలాల్సి వచ్చింది. న్యాయస్థానం స్టేటస్ కో ఇస్తుందన్న భయంతో ప్రభుత్వ న్యాయవాది జిల్లా యంత్రాంగం టెండర్లను ఖరారు చేసిందని, కాంట్రాక్టు సంస్థలతో అగ్రిమెంట్లు కూడా చేసుకోవటం జరిగిందని స్టేటస్ కో ఇవ్వవద్దని కోరారు. స్టేటస్ కో ఇవ్వటం లేదని సమగ్ర విచారణ జరుపుతామని న్యాయమూర్తి అనటంతో కాంట్రాక్టు దక్కించుకున్న వారిలో ఆందోళన మొదలైంది. టెండర్ల విధానం సక్రమంగా లేదని గుర్తించిన న్యాయస్థానం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ నెల 13వ తేదీన కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థలు కోర్టుకు వివరణ ఇవ్వాల్సిందిగా కోరటం జరిగింది. వారి వివరణల ఆధారంగా కోర్టు తదుపరి చర్యలు ఆధారపడి ఉంటాయి.

వాకింగ్ ట్రాక్ నిర్వహణకు రూ. లక్ష విరాళం

బెంజిసర్కిల్, మే 10 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ 9వ వార్డు పరిధి పటమటలంకలోని అవధూత వాకింగ్ ట్రాక్ నిర్వహణకు సీనియర్ సిటిజన్, పటమటలంక వాసి రావిపాటి పరంధామయ్య రూ. లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. శనివారం సాయంత్రం అవధూత వాకింగ్ ట్రాక్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో పరంధామయ్య 75వ జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన రూ. లక్ష చెక్కును 9వార్డు డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతిశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, దేవేంద్ర, కొల్లి సతీష్, ఆళ్ల శ్రీనివాస్, కె. మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులను వదిలితే జరిమానా

● నగర కమిషనర్ ధ్యానచంద్ర

పాయకాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు జరిమానా తప్పదని నగర కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వలన ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు సంభవించడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో పెట్టుకుని రోడ్లపై పశువులు వదిలిన యజమానులకు రూ. 10 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. పశువులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్‌సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద కాటిల్‌షెడ్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. గోవుల ఆరోగ్యం కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్ రెడ్డి పర్యవేక్షణలో గోవులు ఉంటాయని వివరించారు.

స్వర్గపురిలో మళ్లీ ప్రారంభమైన గ్యాస్ దహనం

రాణిగారితోట, మే 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలో ఉన్న ఆధునిక స్వర్గపురి(గ్యాస్)లో దహన కార్యక్రమాలు తిరిగి ప్రారంభం అయినట్లు స్వర్గపురి గ్యాస్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తెలిపారు. గ్యాస్ స్వర్గపురిలో చాంబర్, గ్యాస్ పైపుల మరమ్మతుల నేపథ్యంలో గత రెండు నెలలుగా సేవలు నిలిపి వేసినట్లు తెలిపారు. మరమ్మతుల అనంతరం ఏప్రిల్ 16 నుంచి గ్యాస్ దహనం తిరిగి ప్రారంభం అయిందని నగర ప్రజలు గమనించాలని కోరారు.



కృష్ణలంకలో కొవ్వొత్తుల ప్రదర్శన



టీడీపీ జిల్లా కార్యాలయంలో..

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

కృష్ణలంక, మే 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యం హోటల్ సెంటర్‌లోని చలసాని భవన్ వద్ద వీర జవాన్ మురళీనాయక్ మరణానికి సీపీఐ నివాళి అర్పించింది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, మురళీనాయక్ వీర మరణానికి నివాళి అర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. అనంతరం జరిగిన సభకు సీపీఐ నగర నాయకులు మందలపు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని, ఆ వైపుగా భారతదేశం అడుగులు వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మందలపు శ్రీనివాస్, ఇస్కాప్ రాష్ట్ర అధ్యక్షుడు కాగితాల రాజశేఖర్, లంక జానయ్య, ఈమని దాము, బుట్టి రాయప్ప, తాడి పైడయ్య, తదితరులు పాల్గొన్నారు.



నాయక్ మృతికి నివాళులర్పిస్తున్న వాకర్లు

వాకర్ల నివాళి

భారతీనగర్: సరిహద్దుల్లో జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్ మృతికి నివాళులర్పించారు. వెటర్నరీ కాలనీలోని పార్కులో వాకర్లు శనివారం ఉదయం నాయక్ మృతికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల ప్రముఖులు సుంకర రాజేష్, ఎ.సాంబిరెడ్డి, నాని, రామారావు, వీరమాచినేని రంగప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

వన్‌టౌన్: ఆటోనగర్ టీడీపీ జిల్లా కార్యాలయంలో జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళి నాయక్ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మురళి నాయక్ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● దాడుల నుంచి రక్షించుకోవడానికి మాక్‌డ్రిల్ ● డీఎఫ్‌వో శంకర్

ఆటోనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో ఉద్రిక్తల వేళ నగరంలో దాడులు జరిగితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దాడుల నుంచి రక్షించు కోవ డానికి మాక్‌డ్రిల్ చేపట్టామని డీఎఫ్‌వో శంకర్ అన్నారు. శనివారం స్టెల్లా కళాశాల సమీపంలోని ఎల్ఈపీఎల్‌లో ఆటోనగర్ ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. దాడులు సంభవించినప్పుడు మాల్స్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సిబ్బంది చెప్పిన సూచనలు పాటించడం, గాయపడిన వారిని తరలించడానికి సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై మాక్‌డ్రిల్‌లో చూపించారు. అగ్ని ప్రమాద సమయంలో మంటలను అదుపు చేయడంలో శిక్షణనిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాల సమయంలో స్వీయరక్షణ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆటోనగర్ ఫైర్ సీఐ నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న ఫైర్‌సిబ్బంది

విజయవాడ రైల్వే డివిజన్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

రైల్వేస్టేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ విజయవాడ డివిజన్ విభాగం విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో శనివారం సమ్మర్ క్యాంపును ప్రారంభించింది. శిబిరాన్ని ప్రారంభించిన అదనపు రైల్వే డివిజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) కొండా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యాన్ని, క్రీడా స్ఫూర్తిని, శక్తిని ఇస్తాయన్నారు. స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 50 మంది యువకులు పాల్గొన్నారు. ఈ శిబిరం జూన్ 7వరకు నడుస్తుంది. ఈ శిబిరంలో 16 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న రైల్వే ఉద్యోగుల పిల్లల నుంచి రూ.500, ఇతరుల నుంచి రూ.1000 వసూలు చేస్తారు. ముఖ్య అతిథులుగా అదనపు రైల్వే డివిజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) కొండా శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వాలేశ్వర బి తోకల, గౌరవ అతిథులుగా సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (జనరల్) ఎం.దినేష్ కుమార్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కొండా శ్రీనివాసరావు

సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ లోగో ఆవిష్కరణ



క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్.కె గోయల్, పిన్నశెట్టి రమేష్ తదితరులు

లబ్బీపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం బందరురోడ్డులో ఫార్చ్యూన్ మురళి హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఎస్.కె గోయెల్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని జయించేందుకు సిటిజన్ ఫోర్స్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. సిటిజన్ ఫోర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ పిన్నంశెట్టి రమేష్‌బాబు మాట్లాడుతూ క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం సిటిజన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ పని చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా క్లబ్ లోగోను ఆవిష్కరించారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు ఎస్. సుబ్బారావు, డాక్టర్ జీవీ మోహన్ ప్రసాద్, సినీనటి చంద్రనీ దాస్ పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్

అధ్యక్ష, కార్యదర్శులుగా బాషా, పోతరాజు



సమావేశంలో పాల్గొన్న కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ సభ్యులు

విజయవాడ లీగల్, మే 10 (ఆంధ్రజ్యోతి) :కృష్ణా జిల్లాలోని 14 బార్ అసోసియేషన్‌లకు చెందిన కార్యవర్గ సభ్యులు శనివారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ సభ్యులను ఎన్నుకొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడిగా బెజవాడ బార్ ప్రెసిడెంట్ ఏకే బాషా, కార్యదర్శిగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా దివి పోతరాజు, అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నోటి పరిశుభ్రత పాటించాలి

ప్రముఖ దంతవైద్యుడు రవికృష్ణ

బెంజిసర్కిల్, మే 10 (ఆంధ్రజ్యోతి): నోటి ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని, ప్రతి ఒక్కరు దీనిపై శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ దంతవైద్యుడు రవికృష్ణ సూచించారు. బెంజిసర్కిల్ నాస్తిక్ కేంద్రంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం నోటి ఆరోగ్యం- ఆధునిక చికిత్స అనే అంశంపై డాక్టర్ సమరం అధ్యక్షతన ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ శరీర ఆరోగ్యానికి నోటి ఆరోగ్యం చాలా ముఖ్యమని, దంతాలు, నాలుక, పెదవులు పరిశుభ్రంగా ఉంచుకుంటే నోటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. నోటి పరిశుభ్రత పాటించాలి అని ఆయన తెలిపారు. ఈ సదస్సులో పలువురు అడిగిన ప్రశ్నలకు రవికృష్ణ సమాధానం ఇచ్చారు.

క్యాట్ క్రేజ్







కృష్ణలంక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు పెంపుడు జంతువులుగా కుక్కలను ఎక్కువగా పెంచి పోషించడం చూస్తూ ఉన్నాం. కానీ, పిల్లులను కూడా పెంపుడు జంతువులుగా పెంచేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతూ ఉంది. పిల్లుల్లోనూ దేశవాళి జాతులతో పాటు వివిధ దేశాల జాతులైన పెర్సియన్, కోలాపూర్, సాయ్‌మిసి (థాయిలాండ్) వంటి జాతి పిల్లులను కూడా పిల్లుల పెంపకందార్లు పెంచుతున్నారు. ఇవికాక హిమాలయన్ కాట్, బెంగాల్ కాట్, బాంబరీ కాట్ వంటి పిల్లుల జాతులను కూడా పెంచుతున్నారు. పెంపుడు పిల్లులకు ఏదైనా చిన్న సమస్య వచ్చినా చాలా బాధపడుతూ ఎమోషనల్‌గా ఫీల్ అవుతూ ఉంటారు. అంటే అంత ప్రేమగా చూసుకొంటారు. పిల్లుల జాతిరకాన్ని అనుసరరించి వాటి ఖరీదు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుంది.ఈ పిల్లుల పెంపకంపై పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలకు ఆహారం ఇచ్చేటప్పుడు, నిర్దేశించిన పరిమాణంలో మాత్రమే ఆహారం అందించాలన్నారు. పెంపుడు పిల్లులకు కూడా తప్పనిసరిగా ముఖ్యమైన ప్రమాదకర వ్యాధులు రాకుండా నివారించుటకు, చిన్న పిల్లల సమయంలో ఒకసారి, తర్వాత ప్రతి సంవత్సరం తప్పనిసరిగా టీకాలు వేయించాలి.



డాక్టర్ కామని శ్రీనివాసరావు

మిర్చి రైతుల ఆందోళన

- ఏఎంసీ వద్దకు యాజమాన్యాన్ని పిలిపించిన ఎమ్మెల్యే
- ఉదయం నుంచి సుదీర్ఘ చర్చలు
- రైతులకు హామీగా రూ.1.60 కోట్లకు చెక్‌లు
- పాత సరుకు ధర నిర్ణయంపై మళ్లీ చర్చలు

జగ్గయ్యపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం నుంచి సమాచారం లేకపోవటంతో బాధిత రైతులు ఆగ్రహంతో జగ్గయ్యపేట ఏఎంసీకి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఉదయం 11 గంటలకు భీమవరంతో పాటు పలు గ్రామాల రైతులు, స్టోరేజీలో సరుకు నిల్వ పెట్టుకున్న పలువురు వ్యాపారులు అక్కడకు చేరుకుని అనుకున్న మాట ప్రకారం తమకు నగదు ఇవ్వాలని ఏఎంసీ సెక్రటరి వద్దకు వెళ్లారు. ఆయన లేకపోవటంతో అక్కడే ఉండి ఆందోళన చేయటంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అక్కడకు చేరుకుని యాజమాన్య ప్రతినిధులను పిలిపించారు. యాజమాన్యం తరపున హాజరైన రావూరి శ్రీనివాసరావు, హరి నరసింహారావు, మారెళ్ల సూరారెడ్డితో పాటు రైతు ప్రతినిధులను ఎమ్మెల్యే తాతయ్య పిలిపించి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు కోల్డ్ స్టోరేజీ వద్ద రుణం తీసుకోని రైతులకు టిక్కీకి రూ.2 వేలు చొప్పున ఇస్తామన్న నగదు ఇప్పించాలని డిమాండ్ చేశారు. యాజమాన్య ప్రతినిధులు పాత సరుకు 2023, 2024లో మిర్చి, అపరాలకు అనుకున్న ధర ఎక్కువని, అంత ఇవ్వలేమని, అందుకే మార్కెటింగ్ ఏడీకి ధర నిర్ణయించమని లేఖ ఇచ్చినట్టు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే తాతయ్య, ఆయన సోదరుడు శ్రీరాం చినబాబు ధరలో వ్యత్యాసం ఉంటే మళ్లీ చర్చిద్దామని ముందు అనుకున్న ప్రకారం రైతులకు తొలి విడత డబ్బులివ్వాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ రైతు నేత యానాల గోపీచంద్ ద్వారా యాజమాన్యంలో ముఖ్య భాగస్వామిగా ఉన్న మారెళ్ల పుల్లారెడ్డితో ఫోన్‌లో చర్చించారు. రైతులకు ధర నిర్ణయమైతే ఒకేసారి చెల్లింపులు చేస్తామని, పాత సరుకుకు ధర ఎక్కువగా ఇవ్వాల్సి రావటం అభ్యంతరం తెలిపారు. ధర తేలితే ఈ నెల 25న మొత్తం చెల్లిస్తామని స్పష్టం చేశారు. రైతు ప్రతినిధులు పాతసరుకు ధరపై అభ్యంతరం ఉందని, కొత్త సరుకుకు డబ్బులు చెల్లించటంలో సమస్య ఏటనిని ప్రశ్నించారు. మొత్తం ఒకేసారి చెల్లిస్తామని, ఇచ్చిన మాట తప్పమని యాజమాన్యం తరపున రావూరి శ్రీనివాసరావు చెప్పారు. ఇప్పటికే పలు వాయిదాలు పడినందున రైతుల ఆవేదనను అర్థం చేసుకోవాలని, హామీగా 8000 టిక్కీలకు సంబంధించి 165 మంది రైతులకు చెల్లిస్తామని చెప్పిన రూ.1.60 కోట్లకు చెక్‌లు ఇవ్వాలని శ్రీరాం చినబాబు సూచించారు. ఈ చెక్‌లను స్థానిక ఎమ్మెల్యే వద్ద ష్యూరిటీగా ఉంచాలని, తమకు చెల్లించాక వాటిని వెనక్కి ఇవ్వాలని రైతు ప్రతినిధులు సూచించారు. పాత సరుకుకు 50 శాతం ఇస్తామనటంపై అభ్యంతరం తెలిపారు. రైతుల వద్ద కోల్డ్ స్టోరేజీ అద్దెలు కూడా తీసుకుంటున్నందున, ఇచ్చిన రుణాలకు వడ్డీలు లెక్కిస్తున్నందున 25 శాతం తగ్గిస్తే సమ్మతమని రైతు ప్రతినిధులు చెప్పారు. నగదు సిద్ధం చేసుకుంటే ఒకేసారి చెల్లింపులు చేస్తే 15 శాతం తగ్గించి తీసుకునేలా రైతులను ఒప్పిస్తామని శ్రీరాం చినబాబు యాజమాన్యానికి హామీ ఇచ్చారు. పాత సరకు ధర విషయమై రైతు ప్రతినిధులు, యాజమాన్యం ప్రతినిధులు మంగళవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ విషయాలను రైతులందరి సమక్షంలో ఎమ్మెల్యే తెలిపారు.



చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే తాతయ్య



పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పాల్గొన్న డూండీ రాకేష్

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

బహ్రెయిన్ తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో వేడుకలు

విజయవాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం మరువలేదనిదని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా బహ్రెయిన్ తెలుగు కళా సమితి నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను వీడియో రూపంలో ప్రసారం చేశారు. బహ్రెయిన్‌లోని తెలుగు ప్రజలు అధికంగా పాల్గొన్నారు.

డీఆర్వోకు ధర్నా నోటీసు



ధర్నా నోటీసు ఇస్తున్న ఉపాధ్యాయులు

కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ వంటి విషయాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 12న నిర్వహించనున్న ధర్నా నోటీసును ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్వో నరసింహానికి శనివారం ఉపాధ్యాయులు అందజేశారు. యూటీఎఫ్ నేతలు ఎ.సుందరయ్య, పి.లీల, ఎ.అనంత్‌కుమార్, జె.రామకృష్ణ, ఎస్.చలపతిరావు, శివనాగ ప్రసాద్ పాల్గొన్నారు.

గుడివాడలో కోర్టు భవనాల నిర్మాణానికి కృషి

హైకోర్టు న్యాయమూర్తి వి.ఆర్.కె కృపాసాగర్



జ్యోతి వెలిగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్

గుడివాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గుడివాడలో కోర్టు భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని హైకోర్టు న్యాయమూర్తి వి.ఆర్.కె కృపాసాగర్ అన్నారు. బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన బార్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి వెలిగించి చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, గుడివాడలో 1905లోనే కోర్టులు ఏర్పాటు అయ్యాయన్నారు. అంతటి ఘనచరిత్ర గుడివాడ కోర్టుకు ఉందన్నారు. గుడివాడలో నూతనంగా కోర్టు భవనాలను నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. న్యాయవాదులు కక్షిదారుల పట్ల గౌరవంగా ఉండాలని, వృత్తి పట్ల నిబద్ధతతో ఉండాలన్నారు. అనంతరం గుడివాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి కృపాసాగర్‌ను సత్కరించారు. జిల్లా న్యాయమూర్తి గుట్టల గోపి, 11వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం, హైకోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.ఎస్.పి సురేష్‌కుమార్, గుడివాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల చర్ల శ్రీనివాసులు, బి.క్రాంతి, న్యాయవాదులు సార్థిపల్లి శ్యాంప్రసాద్, షేక్ మహ్మమద్ రఫీ, చెట్టుబాదుల సూర్య, చోరగుడి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఘంటసాల, మే 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గ్రామంలో పూజలందుకుంటున్న శ్రీ రాజ్యలక్ష్మీ, భోగాలక్ష్మీ సమేత శ్రీ కాకుళేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు అగ్నిహోత్రం భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. డిప్యూటీ కమిషనర్, ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం స్వామిని పెండ్లి కుమారుడిని చేయటంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం హనుమంత వాహనంపై స్వామి గ్రామోత్సవం జరిగింది.

నేడు స్వామి కల్యాణ మహోత్సవం

ఆదివారం రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ముందడుగు

- డయల్ యువర్ ఎస్పీ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ విజయవంతంగా నిర్వహించారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం పోలీస్‌శాఖ ప్రథమ బాధ్యతని, దీనిద్వారా ప్రజలకు నేరుగా న్యాయం కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టపరిధిలో పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.ప్రజలు తమ సమస్యలను ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కనూ వినియోగించుకోవాలన్నారు.

రూ. 21 లక్షల విలువైన బైకులు స్వాధీనం



రికవరీ చేసిన బైకులతో ఎస్పీ, డీఎస్పీ

కంకిపాడు: జిల్లా చరిత్రలో అత్యధిక బైకులను రికవరీ చేసిన ఘనత కంకిపాడు పోలీసులకే దక్కుతుందని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ అన్నారు. స్థానిక కంకిపాడు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు, బాపట్ల జిల్లాల పరిధిలో సుమారు 17 పోలీసు స్టేషన్ల పరిధిలో కొంతకాలంగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, కంకిపాడు సీఐ మురళీకృష్ణ పర్యవేక్షణలో కంకిపాడు ఎస్సై సందీప్, సిబ్బందితో ఒక టీమ్ ఏర్పాటు చేశారన్నారు. 5 జిల్లాల పరిధిలో దొంగతనం జరిగిన రూ.21 లక్షల విలువైన బైకులను సాంకేతికతను వినియోగించి సందీప్ టీమ్ స్వాధీనం చేసుకుంటున్నారు. దొంగతనానికి పాల్పడిన మహమ్మద్ రిజ్వాన్, కేశన్ సురేష్, షేక్ ఇబ్రహీం, కోలా కృష్ణారావును అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. బైకుల రికవరీలో కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.



సమంత సందడి

- శుభం చిత్రం ప్రమోషన్‌కు చిత్రబృందంతో విజయవాడ రాక

బెంజిసర్కిల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి, శుభం చిత్ర నిర్మాత సమంత విజయవాడలో సందడి చేశారు. బెంజిసర్కిల్ ట్రెండ్ సెట్ మాల్‌లోని క్యాపిటల్ సినిమాస్‌కు శుభం చిత్ర బృందంతో చిత్రం ప్రమోషన్‌లో భాగంగా శనివారం సాయంత్రం సమంత వచ్చి సందడి చేశారు. శుభం చిత్రం ఆడుతున్న క్యాపిటల్ సినిమాస్‌లోని స్ర్కీన్ వద్ద వచ్చి ప్రేక్షకులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ శుభం చిత్రం విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కోరారు. తన కోసం వచ్చిన అభిమానులకు సమంత కారులో నిలిచి అభివాదం చేస్తూ వెళ్లారు. ఈసందర్భంగా ట్రెండ్‌సెట్ మాల్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సమంత రాక పురస్కరించుకొని ఈమె అభిమానులు ఆమెను చూసేందుకు సుమారు 3గంటల పాటు నిరీక్షించారు. చిత్రం బృందంతోపాటు సురేష్ మూవీస్ కృష్ణాజిల్లా డిస్ట్రిబ్యూటర్ భగవాన్ పాల్గొన్నారు.

నారాయణ ఓ విదేశీ శక్తి

- ఆయన్ను సీపీఐ నుంచి సస్పెండ్ చేయాలి: సోము



తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి) : పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జరుగుతున్న ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ నారాయణ విదేశీ శక్తి అనే అనుమానం కలుగుతోందన్నారు. ఆయన్ను సీపీఐ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. దేశ ప్రజలకు నారాయణ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంపై జరుగుతున్న కుట్రలో నారాయణ భాగస్వామి అయినట్టు ఉన్నాడని, ఆయన యథాలాపంగా మాట్లాడారని తాను అనుకోవడంలేదని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి,కోలా ఆనంద్ పాల్గొన్నారు.

డిప్లొమా విద్యార్థులకు సమ్మర్ ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్

- ఈనెల 17 నుంచి ప్రారంభం

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా విద్యార్థులకు వేసవి ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తెలిపింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నటు సంస్థ ఈడీ రఘు కూరం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే 17 నుంచి జూన్ 16 వరకు రోజుకు రెండు గంటల పాటు మొత్తం 60 గంటల శిక్షణ ఉంటుందని తెలిపారు. సీఎస్ఈ విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్, ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్స్, మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆటోక్యాడ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో సర్టిఫికెట్ పొందాలంటే విద్యార్థులకు 75శాతం హాజరు, 70శాతం మార్కులు ఉండాలని తెలిపారు. విద్యార్థులు రూ.500 ఫీజుతో నైపుణ్యం వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పత్రికా స్వేచ్ఛపై అణచివేత తగదు

- కేంద్రం తీరుపై సీపీఎం నేత బీవీ రాఘువులు ఆగ్రహం



తిరుపతి(ఆటోనగర్) మే 10(ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసే ధోరణిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆరోపించారు. తిరుపతిలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. దేశంలో యుద్ధ వాతావరణం సమయంలో న్యూస్ చానల్స్, రిపోర్టర్లు, మీడియా వేదికలను నియంత్రించాలని చూడడం సరికాదన్నారు. జమ్మూకశ్మీర్‌లోని ముక్తం న్యూస్ రిపోర్టర్ అనురాధతో పాటు ప్రశ్నించే సోషల్ మీడియా వేదికలను బ్లాక్ చేయడం దారుణమన్నారు. పాకిస్థాన్‌పై అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడి పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించే విధంగా ఒత్తిడి ఉండాలని కేంద్రానికి సూచించారు. పీ4 పథకం అమలు ద్వారా సీఎం చంద్రబాబు పేదలను అవమానిస్తున్నారన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరుతో కొన్ని కంపెనీలు కేటాయించే డబ్బును పేద కుటుంబాలకు ఖర్చు చేయడం ద్వారా పేదరికం పోతుందా అని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలతో ప్రభుత్వం కుదుర్చుకున్న దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను గతంలో వద్దని, ఇప్పుడు తిరిగి అమర్చడానికి చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వ ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. పేదలకు ఇంటి స్థలాలు ఎప్పుడు కేటాయిస్తారని ప్రశ్నించారు.

వెల్లువలా 'రేషన్' దరఖాస్తులు

- నాలుగు రోజుల్లోనే 72వేల అభ్యర్థనలు
- కొత్త కార్డులూ,పదిరకాల మార్పుల కోసం వచ్చేవారితో సందడిగా సచివాలయాలు
- 15 నుంచి 'మనమిత్ర' లోనూ అవకాశం
- జూన్‌లో కొత్త కార్డుల జారీకి ముమ్మర కసరత్తు
- మరో ఎన్నికల హామీ అమలుదిశగా చర్యలు



కొత్త రేషన్ కార్డు చూపిస్తున్న మంత్రి మనోహర్ (ఫైల్)

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలకు అర్జీదారుల తాకిడి పెరిగింది. కొత్త కార్డుల జారీ, విభజన, సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పు, మరణించినవారి కార్డుల తొలగింపు, అనర్హుల కార్డుల సరెండర్ తదితర పది రకాల సేవలను ఈనెల 7వ తేదీనుంచి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో సచివాలయాలకు వెల్లువలా దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి. కొత్తగా దరఖాస్తులు చేసుకున్నవారితోపాటు ఇతర సేవలకు సంబంధించిన అభ్యర్థనల పరిశీలన ప్రక్రియను ముందుగా పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయనుంది. రాష్ట్రంలో కొత్తగా పెళ్లయిన జంటలతోపాటు అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికీ కొత్త రేషన్‌కార్డు మంజూరు చేస్తామని ఎన్నికల ముందు కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. దానికి తగినట్టు ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. వైసీపీ హయాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిల ఫొటోలతోపాటు వైసీపీ రంగులు పులిమి ముద్రించి రేషన్‌కార్డులు జారీ చేశారు. వాటి స్థానంలో క్యూఆర్ కోడ్‌తో రీ డిజైన్ చేసిన స్మార్ట్ రైస్ కార్డులను అందజేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తిచేసింది. పైగా రాష్ట్రంలో రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియ కూడా దాదాపు పూర్తయినందున జూన్‌లోనే కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల మీడియా సమావేశంలో ప్రకటించారు. దీంతో రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నవారంతా దరఖాస్తులు చేసుకునేందుకు సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు.

తొలిరోజు నుంచే భారీగా తాకిడి..

కొత్త రేషన్ కార్డులు, ఇతర సేవల కోసం దరఖాస్తులు తొలి రోజు నుంచే పోటెత్తుతున్నాయి. బుధవారం ఈ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అక్కడినుంచి శనివారం వరకు నాలుగు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 72,064 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం 10,651, రైస్ కార్డుల విభజన కోసం 6,248, తమ కార్డుల్లో సభ్యుల చేర్పుల కోసం 51,389, సభ్యుల తొలగింపు కోసం 2,050, తప్పుడు ఆధార్ సీడింగ్‌ను సరి చేయడానికి 1, 548, కార్డులను సరెండర్ చేయడం కోసం 82, ఉన్న కార్డుల్లో చిరునామా మార్పుకోసం 3, రేషన్ షాపుల రెన్యువల్స్ కోసం 93 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 15వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా కూడా దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

వారు మళ్లీ దరఖాస్తు చేయనక్కర్లేదు

అర్హత ఉన్న కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చిపడ్డాయి. వాటిని కనీసం పరిశీలించకుండానే అప్పటి జగన్ సర్కారు మూలనపడేసింది. జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. వాటిలో కొత్త కార్డుల కోసం 30,611, స్ప్లిట్ కార్డుల కోసం 46,918, కార్డుల్లో చేర్పులు కోసం 2,13,007, అడ్రస్ మార్పు కోసం 8,263, తొలగింపు కోసం 36,588, కార్డులను సరెండర్ చేయడానికి 685 కలిపి మొత్తం 3,36,072 దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ దరఖాస్తులు కూడా ప్రస్తుత ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, కాబట్టి గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తులు చేసుకున్నవారు ఇప్పుడు మళ్లీ అభ్యర్థనలు పంపనక్కర్లేదని పౌరసరఫరాలశాఖ వర్గాలు చెబుతున్నాయి.



మండు వేసవిలో మంచు దుప్పటి

ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ శ్రీకాకుళం జిల్లాలో ఉదయం వేళ మంచు కురుస్తోంది. అరసవల్లి నుంచి కళింగపట్నం వెళ్లే దారిలో శనివారం ఉదయం 6.30 వరకు మంచు కురిసింది. అతర్వాత క్రమంగా ఎండ తీవ్రత పెరిగింది.

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి



పోటీల్లో భారత్ తరఫున పాల్గొంటున్న నందినీ గుప్తా, వివిధ దేశాల సుందరీమణులు

తారలు దిగొచ్చిన వేళ!

వైభవంగా మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం

పాల్గొంటున్న 110 దేశాల సుందరీమణులు.. భారత్ తరఫున నందినీ గుప్తా ప్రాతినిధ్యం

హైదరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): దివిలో ఉండే తారలంతా భువికి దిగి వస్తే! అందులోనూ హైదరాబాద్‌కు వస్తే!! శనివారం సాయంత్రం గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్-2025 పోటీల ప్రారంభ కార్యక్రమం సరిగ్గా అలాగే కనిపించింది. 110 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటున్న ఈ పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దాదాపు రెండున్నర గంటలపాటు ఈ కార్యక్రమం జరిగింది. ఈ పోటీలతో.. ఉద్యమగడ్డ తెలంగాణపై ప్రపంచ దేశాలన్నీ సాక్షాత్కరించాయి. ఆయా దేశాల జెండాలతో వారంతా కలిసి ఒకేసారి ర్యాంపుపైకి రాగా.. భారత్ తరఫున మిస్ ఇండియా నందినీ గుప్తా జాతీయ జెండాతో అందరికీ అభివాదం చేశారు. ఆ ఘట్టం ఉద్విగ్నభరితంగా సాగింది. పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. ప్రపంచ దేశాలు పాల్గొనే మిస్ వరల్డ్ పోటీల్లో భారతదేశ జెండా కనబడగానే "భారత్ మాతాకీ జై" అనే నినాదంతో స్టేడియం మార్మోగింది. తెలంగాణ గేయంతో ప్రారంభమైన 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ కార్యక్రమం.. జాతీయగీతం జనగణమనతోపాటు అంతకుముందు మిస్‌వరల్డ్ గీతం ఆలాపనతో ముగిశాయి. మరోవైపు అందాలబామల ప్రదర్శన మధ్యలో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, వాటి ఔన్నత్యం తదితర అంశాలతో కూడిన కొన్ని వీడియో సందేశాలను ప్రదర్శించారు. మిస్ వరల్డ్-2025 పోటీల సందర్భంగా తెలంగాణ సంస్కృతి, పాశ్చాత్య దేశాలకు చెందిన కొన్ని కళలను కూడా ప్రదర్శించారు. 250 మందితో ప్రదర్శించిన పేరిణి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ప్రదర్శించిన గుస్సాడి నృత్యం అలరించింది. కొమ్ము నృత్యం ఆహూతులను ఎంతగానో ఆకర్షించింది. ఇక లంబాడ కళాకారుల డప్పు నృత్యం, ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ప్రదర్శన మధ్యలో కొంతమంది కళాకారులు పిరమిడ్ ఆకారంలోకి వచ్చి పైన నిల్చున్న వ్యక్తి జాతీయజెండాను చేతబూని అద్భుత ప్రదర్శన చేశారు. జాతీయ జెండా కనిపించిన ప్రతిసారీ ప్రేక్షకులంతా 'జై భారత్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు మిస్‌వరల్డ్ పోటీల ప్రారంభ సమావేశంలో లాటిన్ అమెరికా దేశాల పోటీదారులు ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

ఖండాల వారీగా ప్రదర్శన..

మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా ఖండాల వారీగా ప్రదర్శన నిర్వహించారు. కరీబియన్ లాటిన్ అమెరికా దేశాలకు చెందిన పోటీదారులతో ప్రదర్శన మొదలైంది. రెండో విడతలో ఆఫ్రికన్ దేశాలకు చెందిన 22 మంది అందగత్తెలు తమ సంప్రదాయ దుస్తులు, ప్రత్యేక వేషధారణతో ప్రదర్శన ఇచ్చారు. ఆ తరువాత యూరప్, ఆసియా ఖండాల వారీగా ప్రదర్శన ఇవ్వగా.. యూరప్ నుంచి అల్బేనియా ప్రతినిధితో మొదలైంది. యూరప్ నుంచి 32 దేశాలు ప్రాతినిధ్యం వహించాయి. ఆసియా నుంచి 22 దేశాలు ప్రాతినిధ్యం వహించగా.. మిస్ ఇండియా నందినీ గుప్తా ర్యాంపుపైకి రాగానే ప్రేక్షకులంతా కరతాళధ్వనులతో శుభాకాంక్షలు తెలిపారు. పోటీదారుల్లో అందరికంటే చివరిగా ర్యాంపుపైకి వచ్చిన మిస్ వియత్నాం తనదైన డ్యాన్స్‌తో అక్కడున్నవారిని ఆకట్టుకుంది.

పోటీలను ప్రారంభించిన సీఎం రేవంత్..

గచ్చిబౌలిలో మిస్‌వరల్డ్-2025 పోటీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం రేవంత్ ప్రకటించగానే.. పోటీదారులంతా ఒకే వేదికపై నిలబడగా.. మిస్ వరల్డ్ గీతాలాపన చేశారు. కార్యక్రమంలో మిస్‌వరల్డ్ క్రిస్టినా, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లీ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలను ప్రపంచమంతా ఆసక్తిగా తిలకించింది.







"ఏదైనా పండుగ వచ్చినప్పుడు... ఇంటి దగ్గర బిడ్డ లేడని వెలితిగా ఉంటుంది. కానీ అతనిలాంటి వారు సరిహద్దుల్ని రక్షిస్తున్నారు కాబట్టే అందరూ ప్రశాంతంగా పండుగ జరుపుకొంటున్నారని ఆనందంగా అనిపిస్తుంది" అంటున్నారు **ఉప్పరబోయిన పద్మ**. నల్లగొండ జిల్లాకు చెందిన ఆమె కుమారుడు వెంకన్న కొన్నేళ్లుగా బీఎస్ఎఫ్‌లో... దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. 'మదర్స్ డే' సందర్భంగా... 'నవ్య'తో తన అమ్మ మనసును పద్మ పంచుకున్నారు.

దేశం కోసం కాబట్టి కాదనలేదు...

"మాది తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లాలోని తిరుమలరాయినిగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబం. నాకు ముగ్గురు సంతానం. ఒకరు చనిపోయారు. ఇద్దరు మగపిల్లలు మిగిలారు. వారిలో వెంకన్న పెద్దవాడు. చదువు పూర్తయ్యాక ఆర్మీలో చేరుతానని చెప్పాడు. మాకు సైన్యం గురించి అప్పటివరకూ తెలీదు. కళ్లముందే ఉంటాడనుకున్న పెద్దబ్బాయి ఆర్మీలోకి వెళ్తానని అన్నప్పుడు.. మొదట మాకు కొంచెం భయం వేసింది. తను ఏది చేసినా ఆలోచించే చేస్తాడని మాకు తెలుసు. దేశ సేవ చేస్తానంటే కాదనలేకపోయాం... ఆశీర్వదించి పంపించాం.

తనలోనే దాచుకుంటాడు...

వెంకన్న విధుల్లో చేరిన తరువాత... తొమ్మిది నెలలపాటు ఇంటికి రాలేదు. తనతో కలిసి చదువుకొని, ఉద్యోగాలు చేస్తున్న పిల్లలు... పండుగ పూట ఇంటికి వచ్చి, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ ఉంటే బాధగా ఉండేది. మెల్లమెల్లగా మాకు పరిస్థితి అర్థమయింది. నా బిడ్డ, అతనిలాంటివారు దేశ సరిహద్దుల్లో కాపలాగా ఉండబట్టే... అందరూ ప్రశాంతంగా పండుగ జరుపుకొంటున్నారనే ఆనందంతో సర్దుకుపోతున్నాం. తను వచ్చినప్పుడు సరిహద్దుల్లో పరిస్థితి గురించి చెబుతూ ఉంటాడు. మేము ఆందోళన చెందుతామని తెలుసు కాబట్టి.. ఇబ్బందికరమైన విషయాలు చెప్పడు. మేము బాధపడే సంగతులేవీ చెప్పడానికి ఇష్టపడడు. వాటిని, తన కష్టాలను తనలోనే దాచుకుంటాడు. ఇక.. తన విధి నిర్వహణలో భాగంగా ఆయుధం తప్పనిసరి. దేశ భద్రతకు అవసరమైన పనిలో ఉన్నాడు కాబట్టి... తనను ఆయుధంతో చూసినా సంతోషంగానే ఉంటుంది. ఎప్పుడైనా తన గురించి కాస్త కలవరపాటుకు గురైనా... ఆ తరువాత సర్దిచెప్పుకుంటాం.

భయపడకండి...

ప్రస్తుతం భారత్-పాక్ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో... సైనికుల కుటుంబ సభ్యులకు నేను చెప్పేది ఒక్కటే. ఎవరూ భయపడవద్దు. యుద్ధాన్ని ఎవరూ కోరుకోరు. కానీ తప్పదనుకున్నప్పుడు శత్రువులకు తగిన విధంగా బుద్ధి చెప్పవలసిందే. పిల్లలు దేశ సేవలో ఉన్నారని గర్వపడాలి. వారిని ప్రోత్సహించాలి. దేశానికి సేవ చేసే అవకాశం అందరికీ రాదు. వచ్చినప్పుడు వదులుకోకూడదు. యువత ప్రతి ఒక్కరూ దేశ సేవకు అంకితం కావాలి."

\- సోమేశ్వర్

ఐశ్వర్యారాయ్ నాకు స్ఫూర్తి...

అందం, ఆత్మవిశ్వాసం, సామాజిక చైతన్యం.... వీటన్నిటి కలబోత **అనుది గుణశేఖర.** ఐశ్వర్యారాయ్ స్ఫూర్తితో ప్ర పంచ సుందరి కావాలన్న కలను నిజం చేసుకోవడానికి ఈ ఏడాది పోటీలకు ఈ శ్రీలంక సొగసరి సిద్ధమవుతోంది. తన గురించి, తన అభిరుచుల గురించి ఆమె పంచుకున్న విశేషాలు 'నవ్య'కు ప్రత్యేకం...



"మిస్ వరల్డ్ కావాలనేది ఎన్నో ఏళ్లగా కంటున్న కల. నటిగా నాకు ఐశ్వర్యారాయ్ అంటే ఇష్టం. 'ఆమె 'మిస్ వరల్డ్ విజేత కూడా' అని మా అమ్మ చెప్పింది. అప్పటి నుంచి ఆమెకు వీరాభిమానిని అయిపోయాను. నేను కూడా ఆమెలా కావాలనుకున్నాను. ఇప్పుడు ఈ పోటీలో నేను పాల్గొనడానికి స్ఫూర్తి... ఐశ్వర్యారాయ్. 2017లో మానుషి చిల్లర్ 'మిస్ వరల్డ్'గా గెలిచాక... నా కోరిక మరింత బలపడింది. అది నాలో మరింత ప్రేరణ కలిగించింది.

ఎలాంటి ఒత్తిడి లేదు...

నేను పుట్టింది, పెరిగింది శ్రీలంకలోని అనురాధపుర నగరంలో. నాన్న పోలీస్ అధికారి. అమ్మ బ్యూటీషియన్. నాకు ఒక తమ్ముడు, చెల్లి ఉన్నారు. అందాల పోటీల కోసం నాకు 17 ఏళ్ల వయసున్నప్పుడే సన్నద్ధం కావడం మొదలుపెట్టాను. పద్దెనిమిదేళ్లు నిండాక దరఖాస్తు చేద్దామనుకున్నాను. దురదృష్టవశాత్తూ అప్పుడే మా అమ్మమ్మ మరణించింది. ఆ డిప్రెషన్ నుంచి తేరుకోవడానికి రెండేళ్లు పట్టింది. ఆ తరువాత పోటీలకు సిద్ధమవుతున్న వేళ... కొవిడ్ మహమ్మారి ముంచుకురావడంతో మరో రెండేళ్లు ఆలస్యమయింది. చివరకు కిందటి ఏడాది పోటీల్లో పాల్గొని... 'మిస్ వరల్డ్- శ్రీలంక బ్యూటీ పాజెంట్'గా గెలిచాను. ఇప్పుడు హైదరాబాద్‌లో జరుగుతున్న '72వ ప్రపంచ సుందరి' పోటీల్లో శ్రీలంకకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. తొలిసారిగా అంతర్జాతీయ పోటీలో పాల్గొంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. హైదరాబాద్‌ని చూస్తే... శ్రీలంకలోని మరో నగరానికి వచ్చిట్టుంది. క్రీడలు, సినిమాలు, వాణిజ్య రంగాల్లో బలమైన బంధం ఉండటంతో ఇరుదేశాల మధ్య రాకపోకలు సాధారణంగా మారాయి. ఇక్కడ ఉంటే... నా స్వదేశంలో ఉన్నట్టే అనిపిస్తోంది కాబట్టి నామీద ఎలాంటి ఒత్తిడి లేదు. పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నాను.

ముఖ్యమైన మూడు సమస్యలపై...

సామాజిక సేవను నేను బాధ్యతగా భావిస్తాను. గత పదేళ్ల నుంచి అనేక కార్యక్రమాల్లో భాగస్వామిని అయ్యాను. ముఖ్యంగా... శ్రీలంకలో మహిళలు ఎదుర్కొంటున్న మూడు కీలక సమస్యలపై పని చేస్తున్నాను. వాటిలో ప్రధానమైనది పీరియడ్ పావర్టీ. నెలసరి సమయంలో సురక్షితమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల, ప్యాడ్స్ లాంటివి అందుబాటులో లేకపోవడం వల్ల... శ్రీలంక మహిళా జనాభాలో దాదాపు 50 శాతంఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారికోసం 'సహేలి' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాను. దానిద్వారా... నెలసరి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నాను. అలాగే మా దేశ మహిళలను వేధిస్తున్న మరో సమస్య... వైవాహిక అత్యాచారం (మారిటల్ రేప్). అనేకమంది గృహహింసకు గురి కావడానికి ఇది ప్రధాన కారణం. వైవాహిక అత్యాచారం చట్ట వ్యతిరేకమని శ్రీలంక ప్రభుత్వం ప్రకటించిది. కానీ చాలామంది మహిళలకు ఈ విషయంపై అవగాహన లేదు. వారు నిత్యం తమ భర్తల చేతిలో హింసకు గురవుతూనే ఉన్నారు. మా సంస్థ వారిలో చైతన్యం కలిగిస్తోంది. ఇక... శ్రీలంకలోని మూడు జైళ్లలో మహిళా ఖైదీల హక్కులు, భద్రత గురించి కూడా పని చేస్తున్నాను. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పలువురు జైళ్లలోనే ప్రాణాలు వదులుతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు కోసం పోరాడుతున్నాను."

\- ముహమ్మద్ ఆర్.హెచ్.షరీఫ్

సినిమాలు చూసి హిందీ నేర్చుకున్నా...



శ్రీలంకలో భారతీయ రెస్టారెంట్లు అనేకం ఉన్నాయి. వాటిలో తింటూ పెరిగాను కాబట్టి ఇక్కడి ఆహారాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. భారతీయ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. హిందీ సినిమాలు చూస్తూ... ఆ భాష కొంచెం కొంచెం నేర్చుకున్నాను. షారుఖ్ ఖాన్ అంటే ప్రాణం. ఆయన నటించిన 'కభీ ఖుషీ కభీ గమ్', 'కల్ హో నా హో', 'కభి అల్విద నా కెహనా' సినిమాలు బాగా నచ్చాయి. ముఖ్యంగా 'కల్ హో నా హో'ని ఎన్నో సార్లు చూశాను. ఎప్పుడు చూసినా కళ్లంట నీళ్లు వస్తాయి. అంతగా లీనమైపోతాను. తమిళంలో సూర్య, జ్యోతిక, విజయ్ నటనను ఇష్టపడతాను. తెలుగులో 'గీత గోవిందం' సినిమా, అందులో విజయ్ దేవరకొండ, రష్మిక నటన ఎంతగానో నచ్చాయి.

రీ రిలీజ్‌లోనూ అదే జోరు


కొంతకాలంగా తెలుగు నాట సినిమాల రీ రిలీజ్ సందడి కొనసాగుతోంది. మంచి వసూళ్లను రాబడుతుండడంతో నిర్మాతలు వరుసగా పాత చిత్రాలను మళ్లీ విడుదల చేస్తున్నారు. ఇటీవలే చిరంజీవి నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం రీ రిలీజ్ అయింది, 'కొదమసింహం' చిత్రం త్వరలో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'యమదొంగ', మహేశ్‌బాబు 'అతడు', అల్లు అర్జున్ 'దేశముదురు', ప్రభాస్ 'బాహుబలి', పవన్ కల్యాణ్ 'జల్సా'. అలాగే పలువురు అగ్రహీరోలు నటించిన చిత్రాలు త్వరలో మళ్లీ తెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే ఈ ట్రెండ్ టాలీవుడ్‌కు మాత్రమే పరిమితం కాదు. బాలీవుడ్‌లోనూ రీ రిలీజ్ సినిమాలకు ఆదరణ దండిగానే దక్కుతోంది. ఈ మధ్యకాలంలో రీ రిలీజ్ అవుతున్న చిత్రాలు బాక్సాఫీసు దగ్గర మంచి ఫలితాలు చూపిస్తున్నాయి. ఐదారేళ్ల క్రితం విడుదలైన సినిమాలతో మొదలుకొని ముప్పై ఏళ్ల క్రితం విడుదలైన సినిమాలూ ఈ జాబితాలో ఉన్నాయి. ఒరిజినల్ రిలీజ్‌లో బాక్సాఫీసు దగ్గర నిరాశపరిచిన కొన్ని చిత్రాలు రీ రిలీజ్‌లో మాత్రం ఆశ్చర్యపరిచే రీతిలో వసూళ్లను అందుకోవడం విశేషం. ఇప్పటికే పలు పాత చిత్రాలు థియేటర్లలో సందడి చేయగా, మరికొన్ని త్వరలో వెండితెరపై సందడి చేయబోతున్నాయి.



రీ రిలీజ్‌లోనూ పోటీ

దీపికా పదుకొనే, రణ్‌బీర్‌కపూర్ జంటగా నటించిన 'యే జవానీ హై దీవానీ' చిత్రం 11 ఏళ్ల క్రితం విడుదలైంది. అప్పట్లోనే రూ. 300 కోట్లకు పైబడి వసూళ్లు సాధించింది. ఇటీవలే ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేశారు.

> "లైలా మజ్ను' చిత్రానికి ఒరిజినల్ రిలీజ్‌లో మంచి టాక్ వచ్చింది. కానీ 'తుంబాడ్, అంధాధూన్, బధాయి హో' చిత్రాల ముందు నిలవలేకపోయింది. తొలివారం రూ. 3 కోట్ల వసూళ్లను మాత్రమే సాధించింది. సినిమాను వారం తిరక్కుండానే థియటర్లనుంచి తొలగించారు. కానీ రీ రిలీజ్‌లో ఏకంగా రూ. 9 కోట్ల వసూళ్లను సాధించడం నన్ను ఆశ్చర్యపరిచింది. నిర్మాణ సంస్థలు సినిమా మంచి క్వాలిటీతో రావడానికి ఇంకొంచెం ఖర్చు చేయాలి. మంచి సినిమా తీస్తే ఫస్ట్ రన్‌లో పోయినా సెకండ్ రన్‌లో అయినా సొమ్ము చేసుకోవచ్చునని మా సినిమా రుజువు చేసింది.
>
> \- దర్శకుడు సాజిద్ అలీ



అలాగే షాహిద్‌కపూర్, కరీనాకపూర్ జంటగా నటించిన 'జబ్ ఉయ్ మెట్' చిత్రం, షారూఖ్‌ఖాన్, కాజోల్ జంటగా నటించిన 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' చిత్రాలను ఒకే రోజున రీ రిలీజ్ చేయగా అన్ని సినిమాలు మంచి వసూళ్లను సాధించాయి.

600 స్క్రీన్లలో రీ రిలీజ్

2004లో షారూఖ్‌ఖాన్, ప్రీతిజింటా జంటగా వచ్చిన 'వీర్‌జారా' చిత్రం గొప్ప విజయాన్ని అందుకొంది. ఇప్పటివరకూ నాలుగు సార్లు ఈ చిత్రం రీ రిలీజ్ అయింది. గత ఏడాదిలోనే రెండు సార్లు రీ రిలీజ్ చేశారు. తొలుత సెప్టెంబర్ 13న హిందీ బెల్ట్‌లో మళ్లీ విడుదలయింది. నిర్మాణసంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ 20వ వార్షికోత్సవం సందర్భంగా నవంబర్ 12న కేవలం విదేశాల్లోనే 600 స్క్రీన్లలో రీ రిలీజ్ చేశారు. సౌదీ అరేబియా, ఓమన్, ఖతార్ దేశాల్లో తొలిసారి 'వీర్‌జారా' సినిమాను ప్రదర్శించడం విశేషం. ఈ సినిమా కోసం లతామంగేష్కర్, నారాయణ్ ఆలపించిన గీతాన్ని ఒరిజినల్ రిలీజ్ సమయంలో తొలగించగా, రీ రిలీజ్‌లో ఆ పాటను జోడించారు.

ఫ్లాప్ చిత్రాలూ మెరుస్తున్నాయి

హిట్ చిత్రాలే కాదు, ఫ్లాప్ అయిన కొన్ని పాత చిత్రాలు కూడా రీ రిలీజ్‌లో మంచి వసూళ్లను రాబడుతున్నాయి. త్రిప్తి దిమ్రి, అవినాష్ తివారీ జంటగా నటించిన 'లైలా మజ్ను' చిత్రం 2018లో విడుదలైంది. ఈ రొమాంటిక్ డ్రామాకు సాజిద్ అలీ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం అప్పట్లో ఓ మోస్తరుగానే ఆడింది. బాగుందనే ప్రశంసలు పొందినా కమర్షియల్‌గా సక్సెస్‌ను అందుకోలేదు. ఆ తర్వాత ఓటీటీలో మంచి ఆదరణను సొంతం చేసుకుంది. రీ రిలీజ్‌లో మాత్రం బాక్సాఫీసు దగ్గర మంచి విజయాన్ని అందుకుంది. సాజిద్ దర్శకత్వం వహించిన 'జబ్ ఉయ్ మెట్' చిత్రం 2011లో విడుదలైంది. అప్పట్లో రూ. 71 కోట్ల వసూళ్లను అందుకుంది. ఈ ఏడాది మేలో రీ రిలీజ్ చేయగా రూ. 11 కోట్ల వసూళ్లను సాధించింది.

మూడింతల వసూళ్లు

రీ రిలీజుల్లో అత్యంత సక్సెస్ అయిన సినిమాల్లో 'తుంబాడ్' ముందు వరుసలో ఉంది. 2018లో విడుదలైనప్పుడు రూ. 13 కోట్ల వసూళ్లను సాధించింది. గతేడాది సెప్టెంబర్ 13న రీ రిలీజ్ చేయగా ఈ చిత్రం రూ. 31 కోట్ల వసూళ్లను సాధించింది. రీ రిలీజ్‌లోనూ సినిమా పూర్తవగానే ప్రేక్షకులు లేచి నిలబడి కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. ఈ చిత్రానికి రెండో భాగాన్ని మేకర్స్ ప్రకటించారు.

- రణ్‌బీర్ కపూర్ కెరీర్‌లో 'రాక్‌స్టార్' కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. 2011లో విడుదలైన ఈ చిత్రం ఒరిజినల్ రిలీజ్‌లో రూ. 68 కోట్ల వసూళ్లను సాధించింది. గతేడాది 'రాక్‌స్టార్' చిత్రాన్ని రీ రిలీజ్ చేశారు. పెద్ద సినిమాలేవి థియేటర్లలోకి రాకపోవడంతో రాక్‌స్టార్ పంట పడింది. రూ. 10 కోట్ల వసూళ్లను సాధించింది. 'గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్, 'రెహనా హై తేరే దిల్ మే' 'చెక్‌దే ఇండియా' 'హమ్‌ఆప్‌కే హై కౌన్' తదితర చిత్రాలు సైతం రీ రిలీజ్ అయ్యాయి.

ప్రత్యేక సందర్భాల్లో

కరీనాకపూర్ ఖాన్ 25 ఏళ్ల నట జీవితాన్ని పురస్కరించుకొని 'కరీనాకపూర్ ఖాన్ ఫిల్మ్ ఫెస్టివల్' ను నిర్వహించారు. వారం రోజులపాటు హిందీ బెల్ట్‌లోని ప్రధాన నగరాల్లో ఎంపిక చేసిన మల్టీప్లెక్స్ థియేటర్లలో కరీనాకపూర్ నటించిన పలు చిత్రాలను ప్రదర్శించారు. అలాగే నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ తమ 20 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని 'నోస్టాల్జియా ఫిల్మ్ ఫెస్టివల్' పేరుతో జనవరి 19 నుంచి ఫిబ్రవరి 15 వరకూ



పలు చిత్రాలను రీ రిలీజ్ చేసింది.

రీ రిలీజ్ సినిమాలకంటూ ప్రత్యేకంగా ప్రేక్షకులు ఉన్నారు. పాత స్మృతులను గుర్తు చేసుకొనేందుకు రీ రిలీజ్ సినిమాలు చూస్తున్నవారు కొందరైతే, ఒరిజినల్ రిలీజ్ సమయంలో చిన్న పిల్లలుగా ఉన్నవారు పెద్దవాళ్లయ్యాక ఆ సినిమా గురించి తెలుసుకోవడానికి, చూడడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. అలాగే పాత సినిమాలను మాత్రమే మెచ్చేవారు రీ రిలీజ్ సినిమాలకు ఓటేస్తున్నారు. నిర్మాతలకూ రీ రిలీజ్‌లు కొత్త ఆదాయ వనరుగా మారాయి. అలాగే ఈ ట్రెండ్ నష్టాల్లో నడుస్తున్న థియేటర్లకూ కొంత ఆదాయాన్ని సంపాదించిపెడుతోంది.






ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సీ 4 సింటా	తమిళ చిత్రం	మే 12
ది రిజర్వ్	వెబ్‌సిరీస్	మే 15
అమెజాన్ ప్రైమ్		
ఓవర్ కాంపన్సేటింగ్	వెబ్‌సిరీస్	మే 15
భూల్ చుక్ మాఫ్	హిందీ చిత్రం	మే 16
జియో హాట్‌స్టార్		
హై జునూన్	హిందీ సిరీస్	మే 16
ఈటీవి విన్		
అనగనగా	తెలుగు చిత్రం	మే 15
సోనీ లివ్		
మరనమాస్	మలయాళ చిత్రం	మే 15
సన్ నెక్ట్స్		
నెసిప్పాయా	తమిళ చిత్రం	మే 17

ప్రేమికులకు పెళ్లి పరీక్ష



సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'భూల్ చుక్ మాఫ్'. రాజ్‌కుమార్ రావ్, వామికా గబ్బి జంటగా నటించారు. కరణ్ శర్మ దర్శకత్వంలో దినేశ్ విజన్ నిర్మించారు. ఈ నెల 9న థియేటర్లలోకి రావాల్సిన ఈ చిత్రాన్ని భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో... ఈనెల 16న ఓటీటీలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఒక చిన్న పట్టణంలో నివసించే రంజన్ తన ప్రేయసిని పెళ్లాడేందుకు కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తాడు. తీరా పెళ్లి పీటలెక్కే సమయంలో టైమ్ ట్రావెల్ వారి జీవితాలను ఎలాంటి మలుపు తిప్పింది, వారిద్దరూ ఎలాంటి అడ్డంకులను అధిగమించారు అనేది కథ. పెళ్లి నేపథ్యంలో హాస్యభరితంగా రూపొందిన చిత్రం ఇదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.

పర్ఫ్యూమ్‌లు ఎక్కువగా వాడుతున్నారా..?

మనం సాధారణంగా పర్ఫ్యూమ్‌లు లేదా బాడీ స్ప్రేలు వాడుతూ ఉంటాం. ఇవి చుట్టూ సువాసనలు వెదజల్లుతూ తాజా అనుభూతిని కలిగిస్తాయి. వీటి వాడకం మంచిదే అయినప్పటికీ మితిమీరితే మాత్రం ఆరోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు...



- పర్ఫ్యూమ్‌లో... ఈథైల్ ఆల్కహాల్ ప్రధాన ద్రావకంగా ఉంటుంది. దీనితోపాటు చెట్లకు చెందిన భాగాలు, పూల మొగ్గల నుంచి తయారు చేసిన నూనెలు కలిసి ఉంటాయి. వీటిని ఎక్కువగా పీల్చడం వల్ల తుమ్ములు, ముక్కులో మంట, కళ్ల నుంచి నీళ్లు కారడం లాంటి సమస్యలు వస్తాయి.
- కొన్ని రకాల బాడీ స్ప్రేలు, పర్ఫ్యూమ్‌లలో రసాయనాలు ఉంటాయి. ఇవి గాలి ద్వారా శ్వాసనాళాల్లోకి ప్రవేశించి దగ్గు, ఛాతిలో మంటను కలిగిస్తాయి. ఒక్కోసారి శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారుతుంది. ఎప్పుడూ జలుబు సమస్యలు వేధిస్తుంటాయి.
- పర్ఫ్యూమ్‌ను నేరుగా చర్మం మీద చల్లుకున్నప్పుడు దానిలోని కృత్రిమ నూనెల వల్ల చర్మం పొడిబారడం, మంటగా అనిపించడం, దద్దుర్లు, అలెర్జీ లాంటి సమస్యలు ఏర్పడవచ్చు.
- గాఢమైన పరిమళం ఉన్న పర్ఫ్యూమ్‌లను ఎక్కువగా వాడుతుంటే తలనొప్పి, వాంతులు, ముక్కు దిబ్బడ రావచ్చు. కళ్లు తిరగడంతోపాటు కడుపులో వికారంగా అనిపించవచ్చు. కండరాల వణుకు లాంటి నరాల సంబంధిత సమస్యలు ఏర్పడవచ్చు.
- రసాయనభరితమైన పర్ఫ్యూమ్‌లను మితిమీరి వాడితే హార్మోన్ల స్థాయిలో అసమతుల్యత ఏర్పడి పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.
- ఆస్తమా ఉన్నవారు వీటిని వాడితే శ్వాస సమస్యలు, ఆయాసం ఎక్కువ అవుతాయి.
- గర్భిణులు కూడా వైద్యుని సలహా మేరకు మాత్రమే వీటిని వాడాలి. లేదంటే కడుపులోని బిడ్డకు శ్వాసనాళాల సమస్యలు తప్పవు.

భారత-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రస్తుతానికి చల్లారినట్టే కనిపిస్తున్నాయి. అయితే ఇవి పూర్తిగా సమసిపోవాలంటే మరికొంత సమయం పడుతుంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ భయాలు అలానే ఉన్నాయి. అమెరికా సుంకాలను తాత్కాలికంగా వాయిదా వేయటంతో కొన్ని రోజులు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో సాగాయి. అయితే భారత్-పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలతో మరోసారి మార్కెట్లు ఆటుపోట్లలో సాగుతున్నాయి. పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతుండటంతో మదుపరుల్లో ఇంకా ఆందోళనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణకు ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తే మంచిదో తెలుసుకుందాం.

పెట్టుబడుల రక్షణే కీలకం

ఉద్రిక్తతల నేపథ్యంలో ఆచితూచే ధోరణి బెస్ట్



మల్టీ అసెట్ విధానం

గుడ్లన్నీ ఒకే బుట్టలో పెట్టకూడదంటారు. పెట్టుబడులకు ఈ సూత్రం చక్కగా వర్తిస్తుంది. అనిశ్చిత పరిస్థితులు, యుద్ధ సమయాల్లో ఇది మరింతగా వర్తిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మదుపరులు తమ పెట్టుబడులను ఏదో ఒక ఆస్తికే పరిమితం చేయకుండా ఈక్విటీ, బంగారం, రియల్ ఎస్టేట్, స్థిర ఆదాయాన్ని ఇచ్చే మంచి పరపతి రేటింగ్ ఉన్న రుణ పత్రాల వంటి వివిధ ఆస్తులకు (మల్టీ అసెట్) విస్తరించడం మంచిది. అందులో ఒక ఆస్తి నష్టపోయినా.. మిగతా వాటిలో ఏదో ఒకటి ఆదుకుని పెట్టుబడులకు రక్షణగా ఉంటుంది. వీటిని ఒక్కొక్కటి విడిగా కొనలేమనుకుంటే మంచి పనితీరు కనబరుస్తున్న మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే మల్టీ అసెట్ ఫండ్స్‌ను ఎంచుకోవటం మంచిది.

స్మాల్,మిడ్ క్యాప్స్‌కు దూరంగా ఉంటే బెటర్

ఒకవేళ ఈక్విటీకే పరిమితం కావాలనుకుంటే మీ పోర్టుఫోలియో నుంచి స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లను తప్పించటం మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ కంపెనీల షేర్లు ఇటీవలి కాలంలో బాగా దిద్దుబాటుకు లోనయ్యాయి. అయినా వీటి వాల్యుయేషన్స్ ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. వీటికి బదులు దేశీయ వినియోగ ఆధారిత లార్జ్‌క్యాప్ ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లలో మదుపు చేయడం మంచిది. మార్కెట్ ప్రతి పతనంలోనూ మదుపరులు ఈ షేర్లలో పొజిషన్లు తీసుకోవచ్చని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. యుద్ధం వచ్చినా, ఎలాంటి అనిశ్చిత పరిస్థితులున్నా ఈ కంపెనీల వ్యాపార వృద్ధి మెరుగ్గానే ఉంటుంది. ఈ కంపెనీల షేర్లు భారీ లాభాలు ఇవ్వకపోయినా పెట్టుబడులకు మాత్రం రక్షణ ఉంటుంది. ఇదే సమయంలో ఐటీ, బ్యాంకింగ్ రంగంలోని స్టాక్స్ పైనా మదుపరులు కన్నేయవచ్చంటున్నారు.

బులియన్

అంతర్జాతీయంగా, దేశీయంగా ఎలాంటి పరిస్థితులున్నా పెద్దగా రిస్క్ లేకుండా పెట్టుబడుల రక్షణ కోరుకునే మదుపరులు బంగారాన్ని ఆశ్రయించవచ్చు. గత ఏడాది పసిడి మదుపరులకు 30 శాతం వరకు లాభాలు పంచింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు చూసినా 20 శాతం పైనే పెరిగింది. దేశీయ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఒక దశలో రూ.లక్ష దాటింది. ప్రస్తుతం రూ.లక్ష దిగువన ఉన్నా త్వరలోనే మళ్లీ ఆ స్థాయిని మించిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 3,350 డాలర్లకు చేరువలో ఉంది. ఈ ఏడాది చివరి నాటికి 4,000 డాలర్లకు చేరే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. అదే జరిగితే పసిడి ధర మరింత భగ్గుమనే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్దగా రిస్క్ తీసుకోలేని మదుపరులు తమ పెట్టుబడుల రక్షణ కోసం నేరుగా బంగారం, వెండి కొనిపెట్టుకోవచ్చు. లేదంటే డిజిటల్ రూపంలో లభించే సావరిన్ గోల్డ్ బాండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్టర్లు మదుపు చేయడం మంచిది.

స్థిర ఆదాయ పథకాలు

ఏ మాత్రం నష్టభయం (రిస్క్) భరించలేని మదుపరులు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు స్థిరమైన ఆదాయాన్ని అందించే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 'ట్రిపుల్ ఏ' పరపతి రేటింగ్ ఉన్న కంపెనీల రుణ పత్రాలు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో మదుపు చేయడం మంచిది. వీటిపై రాబడులు తక్కువగా ఉన్నా, అసలు, వడ్డీ చెల్లింపులకు ఢోకా ఉండదు. కంపెనీల కంటే.. ప్రభుత్వ రుణ పత్రాలు మేలు. ఇవన్నీ ఎందుకనుకుంటే మ్యూచువల్ ఫండ్స్ అందించే డెట్ ఫండ్స్‌లో మదుపు చేయడం బెటర్.

ఎగుమతి ఆధారిత కంపెనీలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లన్నీ చెప్పుకోదగ్గ స్థాయిలో దిద్దుబాటుకు లోనయ్యాయి. భారత్-బ్రిటన్ మధ్య ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. భారత్-అమెరికా మధ్యన త్వరలోనే ఎఫ్‌టీఏ కుదిరే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు అమెరికా, ఈయూ, జపాన్ వంటి దేశాలు అనుసరిస్తున్న చైనా+1 విధానం మన దేశానికి కలిసి రానుంది. దీంతో ఎగుమతి ఆధారిత టెక్స్‌టైల్, లెదర్, ఇంజనీరింగ్, ఆటోమొబైల్ విడిభాగాలు, ఫార్మా, ఐటీ కంపెనీల షేర్ల ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. కొద్దిపాటి రిస్క్‌కు సిద్ధమైన మదుపరులు ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలోనూ ఈ కంపెనీల షేర్లలో పొజిషన్లు తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు.

తగ్గుతున్న వడ్డీ రేట్లు

యుద్ధ వాతావరణం ఉన్నా మన దేశంలోనూ వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. ఆర్‌బీఐ ఇప్పటికే కీలక రెపో రేటును అర శాతం తగ్గించింది. ఈ ఏడాది చివరికల్లా మరో అర శాతం తగ్గించే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఈఎంఐల చెల్లింపుల భారం తగ్గనుంది. దీనికి తోడు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను రాయితీలతో ప్రజల చేతుల్లోకి రూ.లక్ష కోట్ల అదనపు నిధులు రానున్నాయి. ఇందులో ఎక్కువ భాగం ఖర్చులు, పొదుపు రూపంలో తిరిగి మార్కెట్లోకి రానున్నాయి. ఇవన్నీ మన స్టాక్ మార్కెట్‌కు మేలు చేస్తాయి.

అమ్మకు ప్రేమతో..

నేడు మాతృ దినోత్సవం

మాతృమూర్తికి ఆర్థిక భద్రత కల్పించండిలా



తల్లి రుణం ఏమిచ్చి తీర్చుకోగలం..? నవ మాసాలు మోసి, జన్మనిచ్చి, పెంచి, ప్రయోజకులను చేసిన తల్లికి జీవితాంతం కృతజ్ఞులమై ఉండటం తప్ప, పిల్లల్ని పెద్ద వారిని చేసే క్రమంలో తమ జీవితాలను సైతం త్యాగం చేసిన మాతృమూర్తులందరికీ అభివందనం. ఈ రోజు మాతృ దినోత్సవం. అమ్మకు ప్రత్యేక అనుభూతిని పంచడంతో పాటు తన జీవితానికి ఆర్థిక భద్రత కల్పించే బహుమతి అందించేందుకు సరైన సందర్భమిది. అందుకు మీ ముందున్న అవకాశాలు..

ఫిక్స్‌డ్ డిపాజిట్

మీకు వీలైనంత సొమ్మును మీ మాతృమూర్తి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేయండి. ఆ ఎఫ్‌డీ పత్రాన్ని ఈ ప్రత్యేక రోజున బహుమతిగా అందించండి. తద్వారా తనకు ఆర్థిక భరోసా కల్పించండి. ఒకవేళ మీ అమ్మ గారు 60 ఏళ్ల పైబడిన వారైతే, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్)లో సొమ్ము డిపాజిట్ చేయడం ఉత్తమం. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే సీనియర్ సిటిజన్ పథకాలపై అధిక వడ్డీతో పాటు పన్ను రాయితీ లభిస్తుంది.

ఆరోగ్య బీమా

వయసుతో పాటే అనారోగ్య సమస్యలూ పెరుగుతాయి. ఈ రోజుల్లో కార్పొరేట్ వైద్యం చాలా ఖరీదైపోయింది. కాబట్టి, హెల్త్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా మీ అమ్మగారికి ఆరోగ్య భద్రత కల్పించవచ్చు.

పసిడి

బంగారు ఆభరణం లేదా నాణెం బహుమతిగా ఇవ్వండి. స్వర్ణాభరణం అలంకరణగా పనికొస్తుంది. ఆర్థిక అత్యవసరాల నుంచీ గట్టెక్కిస్తుంది. అంతేకాదు, ధరాఘాత ప్రభావంతో పాటు ఆర్థిక అనిశ్చితి సమయాల్లో బంగారం మన సంపదకు రక్షణ కల్పిస్తుంది.

సిప్

ఏదైనా మ్యూచువల్ ఫండ్‌కు చెందిన క్రమానుగత పెట్టుబడి పథకం (సిప్)లో మీ అమ్మగారి పేరిట మదుపు చేయడం ప్రారంభించండి. వారం లేదా నెలకు నిర్దిష్ట సొమ్మును ఆ సిప్ ఖాతాలో జమ చేయడం ద్వారా తన మలి జీవితానికి అవసరమయ్యే సొమ్మును సమకూర్చవచ్చు. రిటైర్మెంట్ ఫండ్ కూడా మంచి ప్రత్యామ్నాయం. జీవిత బీమా కవరేజీతో పాటు పెట్టుబడికి అవకాశం కల్పించే యూనిట్ లింక్డ్ పాలసీ (యులిప్) మరో మంచి ఆప్షన్.

అత్యవసర నిధి

మీ అమ్మ గారి ఆర్థిక అత్యవసరాలను తీర్చేందుకు వీలుగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయండి. ఆ సొమ్మును ఇంట్లో దాచి పెట్టడం కంటే తన బ్యాంక్ ఖాతాలో జమ చేయడం మేలు.

బిజినెస్ ఫండింగ్

ఒకవేళ మీ అమ్మ గారు ఏదైనా వ్యాపారం ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లయితే, మీ వంతు ఆర్థిక సాయం ద్వారా తనను సంతోషపరచండి.

ఎన్‌పీఎస్

నేషనల్ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)లో మీ తల్లి పేరిట మదుపు చేయడం మరో ప్రత్యామ్నాయం. ప్రభుత్వం ఆఫర్ చేసే ఎన్‌పీఎస్ పథకాలు 12 శాతం వరకు వార్షిక రిటర్నులు అందిస్తాయి. తనకు 60 ఏళ్లు వచ్చేనాటికి ఖాతాలో జమైన సొమ్ములో 60 శాతం విత్‌డ్రా చేసుకుని మిగతా నిధులను ఏటేటా వినియోగించుకోవచ్చు.

టాటా ఈక్విటీ పీఈ ఫండ్ అదుర్స్

మార్కెట్ ఆటుపోట్లలోనూ టాటా ఈక్విటీ పీఈ ఫండ్ మంచి పనితీరు కనబరిచింది. గత మూడేళ్లలో ఈ ఫండ్ మదుపరులకు సగటున 19.2 శాతం రాబడులు అందించింది. గత ఐదేళ్లుగా సిప్ పద్ధతిలో ఈ పథకంలో ప్రతి నెలా సగటున రూ.10,000 చొప్పున మదుపు చేసిన మదుపరుల పెట్టుబడుల విలువ ప్రస్తుతం రూ.9.2 లక్షలకు చేరింది. దీంతో గత ఏడాది మార్చి నాటికి ఈ పథకం నిర్వహణ కింద ఉన్న పెట్టుబడుల (ఏయూఎం) మొత్తం ఈ ఏడాది మార్చి నాటికి రూ.8,400 కోట్లకు చేరింది. పనితీరు బాగుండడంతో గత ఆర్థిక సంవత్సరంలో మదుపరులు ఈ పథకంలో కొత్తగా రూ.884 కోట్లు మదుపు చేశారు. అంతకు ముందు సంవత్సరం నమోదైన రూ.484 కోట్లతో పోలిస్తే ఇది 83 శాతం ఎక్కువ. తాము అనుసరిస్తున్న వాల్యూ ఇన్వెస్టింగ్ విధానమే టాటా ఈక్విటీ పీఈ ఫండ్ రాబడులకు కారణమని టాటా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఫండ్ మేనేజర్ సోనమ్ ఉదాసీ వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	500
వరంగల్	502	గోదావరి	500
చిత్తూరు	573	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	130
కరీంనగర్	125	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	127
విశాఖపట్నం	121	అనంతపురం	127
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,680 ▲	90,450 ▲	1,11,000 ▲
విజయవాడ	99,800 ▲	96,000 ▲	98,800 ▲
విశాఖపట్నం	98,680 ▼	90,450 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,670 ▲	90,450 ▲	99,100 ▲
ప్రొద్దుటూరు	97,000 ▼	89,240 ▼	98,500 ▲
ముంబై	96,416 ▼	88,317 ▼	95,726 ▲

మన ప్రదర్శన.. 'మధురం'

- మధురకు మూడు పతకాలు
- సురేఖ, చికిత బృందానికి రజతం
- ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2


మధుర


జ్యోతి సురేఖ


చికిత

షాంఘై: వరల్డ్ కప్ స్టేజ్-2 పోటీల్లో భారత ఆర్చర్లు అద్భుత ప్రదర్శనతో అహో అనిపించారు. ఈ మెగా టోర్నీలో కాంపౌండ్ విభాగంలో ఏకంగా ఐదు పతకాలు కొల్లగొట్టారు. ఇందులో రెండు స్వర్ణాలు, ఓ రజతం, రెండు కాంస్యాలు సాధించారు. అయితే, ఏమాత్రం అంచనాలు మహారాష్ట్ర అమ్మాయి మధుర ధమన్‌గావోన్కర్ మూడు పతకాలతో హ్యాట్రిక్ కొట్టడం విశేషం. ఇక, తెలుగమ్మాయిలు వెన్నం జ్యోతి సురేఖ, యువ ఆర్చర్ చికిత తానిపర్తి రజత పతకాన్ని ఖాతాలో వేసుకున్నారు. పురుషుల టీమ్ ఈవెంట్ ఫైనల్లో అభిషేక్ వర్మ, ఓజాస్, రిషబ్ యాదవ్‌లతో కూడిన భారత త్రయం 232-228తో మెక్సికో జట్టును ఓడించి పసిడి నెగ్గింది. ఇక, మహిళల వ్యక్తిగత ఈవెంట్ టైటిల్‌పోరులో 24 ఏళ్ల మధుర 139-138తో అమెరికా ఆర్చర్ కార్సన్ రహేపై గెలిచి వరల్డ్‌కప్‌లో తొలిసారి స్వర్ణాన్ని దక్కించుకుంది. ఆ తర్వాత మహిళల టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ, చికిత, మధురలతో కూడిన భారత జట్టు 221-234తో మెక్సికో బృందం చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఆ తర్వాత మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్యం పోరులో మధుర/అభిషేక్ వర్మ ద్వయం 144-142తో మలేసియా జంటను చిత్తుచేసి పతకాన్ని అందుకుంది. ఇక, వ్యక్తిగత ఈవెంట్ కాంస్యం పోరులో అభిషేక్ షూటాఫ్‌లో కొరియా ఆర్చర్ కిమ్ జొంగ్హోను ఓడించి టోర్నీలో రెండో పతకం సాధించాడు.

ఫేవరెట్.. భారత్

శ్రీలంకతో ఫైనల్ నేడు

- మహిళల ముక్కోణపు సిరీస్
- ఉదయం 10 గం. నుంచి



కొలంబో: బ్యాటింగ్ బలంతో సాగుతున్న భారత మహిళల జట్టు.. ముక్కోణపు వన్డే సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఆదివారం జరిగే ఫైనల్లో ఆతిథ్య శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఈ ఏడాది వన్డే వరల్డ్‌కప్ జరగనుండడంతో.. ఇరుజట్లూ ఈ టోర్నీని సన్నాహకంగా భావిస్తున్నాయి. ప్రత్యర్థితో పోల్చుకొంటే భారత్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ముఖ్యంగా బ్యాటర్లు ప్రతీక, స్మృతి మంధాన, దీప్తి, జెమీమా ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మాత్రం శుభారంభాలను భారీస్కోర్లుగా మలచాల్సిన అవసరముంది. బౌలర్లలో స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్ కీలకం కానున్నారు. మరోవైపు శ్రీలంక నిలకడలేమితో ఇబ్బందులు పడుతోంది. ఆఖరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. హర్షిత సమరవిక్రమ, కెప్టెన్ చమరి ఆటపట్టు, నీలాక్షిపై బ్యాటింగ్ భారం ఆధారపడి ఉంది. అయితే, లీగ్ దశలో భారత్‌కు లంక షాకిచ్చింది. ఈ నేపథ్యంలో లంకను ఏమాత్రం తేలిగ్గా తీసుకొన్నా భంగపాటు తప్పదు.

ఆయుష్, ఉన్నతి ఓటమి

న్యూఢిల్లీ: తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా అద్భుత పోరాటానికి తెరపడింది. గతరౌండ్లలో స్టార్ ఆటగాళ్లను చిత్తుచేసి సంచలనం సృష్టించిన ఆయుష్ సెమీఫైనల్లో అదే జోరు చూపలేకపోయాడు. ఆయుష్ 18-21, 17-21తో టాప్‌సీడ్ చో తిన్ చెన్ (తైవాన్) చేతిలో ఓడగా, మహిళల సెమీస్‌లో ఉన్నతి 19-21, 11-21తో టొమక మియజాకి (జపాన్) చేతిలో పరాజయం పాలైంది.

ఇక విరాట్ వంతు!



- టెస్టులకు గుడ్‌బై చెప్పనున్న కోహ్లీ
- బీసీసీఐకి సమాచారం ఇచ్చిన స్టార్ బ్యాటర్?
- నేడో రేపో అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: ఏడాదిలో భారత క్రికెట్‌లో ఎన్ని అనూహ్య పరిణామాలో! నిరుడు జూన్‌లో టీమిండియా టీ20 ప్రపంచ కప్ గెలిచింది. ఆ వెంటనే దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా పొట్టి క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశారు. అలా ఏడాది గడుస్తున్నదో లేదో..తిరిగి వరుస సంచలనాలు చోటు చేసుకుంటున్నాయి. మొన్నటికి మొన్న కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించి దేశ క్రికెట్ వర్గాలను, ఫ్యాన్స్‌ను షాక్‌లోకి నెట్టాడు. ఆ విషయాన్ని ఇంకా జీర్ణించుకోలేకపోతున్న అభిమానులకు మరో విస్మయకర వార్త ఇది! స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా టెస్టులనుంచి వైదొలగనున్నాడనేదే ఆ వార్త. ఈమేరకు విషయాన్ని విరాట్ బీసీసీఐ పెద్దలకు తెలియజేసినట్టు విశ్వసనీయ సమాచారం. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ తలపడనుంది. ఇప్పటికే రోహిత్ తప్పుకోగా, ఇప్పుడు కోహ్లీ కూడా అదే బాటలో పయనిస్తే..ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ (2025-27) ఆరంభ సిరీస్‌లో భారత్ అవకాశాలపై ప్రభావం పడుతుందని బోర్డు పెద్దలు ఆందోళన చెందుతున్నారట. దీంతో రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని వారు కోహ్లీని కోరినట్టు సమాచారం.

అప్పుడే నిర్ణయానికొచ్చేశాడా ?: సుదీర్ఘ ఫార్మాట్‌కు బై చెప్పాలని ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్ ముగిసిన వెంటనే విరాట్ నిర్ణయించేసుకున్నాడట. 'ఐదు టెస్టుల ఆ సిరీస్‌లో కోహ్లీ ఒక సెంచరీ మినహా..పెద్దగా పరుగులు చేయలేదు. పేలవ ప్రదర్శన దరిమిలా వచ్చిన విమర్శలతో టెస్టుల నుంచి విరమించుకోవాలని కోహ్లీ నిర్ణయం తీసుకున్నాడు. అయితే ఇంగ్లండ్‌తో కీలకమైన సిరీస్‌లో భారత్ తలపడాల్సి ఉండడంతో రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలని విరాట్‌ను కోరాం. కానీ బోర్డు అభ్యర్థనపై అతడు స్పందించలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు శనివారం వెల్లడించాడు.

ఎంతోకాలంగా పేలవ ఫామ్: కోహ్లీ చాలాకాలంగా టెస్టుల్లో అంతగా ప్రభావం చూపలేకపోతున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ తొలి టెస్టులో అతడు శతకం సాధించాడు. దాంతో విరాట్ ఫామ్ గాడిలో పడినట్టేనని అంతా భావించారు. అయితే తదుపరి నాలుగు టెస్టులలో విఫలమయ్యాడు. ఫలితంగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను అతడు అత్యంత పేలవంగా 23.75 సగటుతో ముగించాడు. కోహ్లీ వైఫల్యం ఆ ఒక్క సిరీస్‌కే పరిమితం కాలేదు. అంతకుముందు ఐదేళ్లలో 37 టెస్టులు ఆడిన విరాట్ 3 సెంచరీలతో 1990 పరుగులే చేశాడు. కెరీర్‌లో ఇప్పటిదాకా 123 టెస్టులు ఆడిన కోహ్లీ 46.85 సగటుతో 9230 రన్స్ సాధించాడు.

ఐపీఎల్‌లో అదుర్స్: బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో విఫలమైనా..ఈసారి ఐపీఎల్‌లో మాత్రం విరాట్ దుమ్ము రేపుతున్నాడు. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల్లో 500కు పైగా రన్స్ చేయడంతో అతడిలో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. ఈ ఫామ్‌ను కొనసాగిస్తూ ఇంగ్లండ్‌తో రాబోయే టెస్ట్ సిరీస్‌లో రాణిస్తాడని అతడి ఫ్యాన్స్ గంపెడాశతో ఉన్నారు.

సచిన్ మాత్రమే ఆపగలడు!



రిటైర్మెంట్ నిర్ణయంపై పునరాలోచన చేయాలని బోర్డు పెద్దలు అడిగినా విరాట్ స్పందించకపోవడంతో.. ఇక అతడి మనసు మార్చగలిగేది సచిన్ టెండూల్కరేనని భావిస్తున్నారు. కారణం.. సచిన్‌ను కోహ్లీ తన ఆరాధ్య క్రికెటర్‌గా భావిస్తుండడమే. రిటైర్మెంట్ నిర్ణయమనేది ఆ ఆటగాడి వ్యక్తిగతం. దానిని ఎవరూ కాదనలేరు. కానీ ప్రస్తుతం యువ క్రికెటర్లతో నిండి ఉన్న భారత టెస్ట్ జట్టుకు మైదానంలో మార్గనిర్దేశం చేయాలంటే విరాట్ లాంటి అపార అనుభజ్ఞుడి అవసరమనేది వాదన.

ప్లీజ్..వద్దు!



టెస్టులకు కోహ్లీ అప్పుడే గుడ్‌బై చెప్పొద్దని భారత జట్టు మాజీ ఆటగాడు అంబటి రాయుడు అన్నాడు. 'విరాట్ ప్లీజ్.. రిటైర్ కావొద్దు. గతంకంటే ఎక్కువగా భారత జట్టుకు నీ అవసరం ఉంది. అయినా నీలో ఇంకా ఎంతో ఆడే సామర్థ్యముంది' అని ఎక్స్ ద్వారా రాయుడు సూచించాడు.

స్పోర్ట్స్

టెస్ట్ జట్టు సారథిగా గిల్!

వైస్ కెప్టెన్ పంత్?


పంత్ గిల్

న్యూఢిల్లీ: సుదీర్ఘ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో.. భారత టెస్ట్ జట్టు సారథిగా శుభ్‌మన్ గిల్, ఉప నాయకుడిగా రిషబ్ పంత్ ఎంపిక ఖాయమైనట్టు తెలిసింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో కొన్ని టెస్టులకు రోహిత్ స్థానంలో పేసర్ బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించాడు. కానీ తరచూ గాయాలతో బాధపడే బుమ్రా ఇంగ్లండ్‌తో పూర్తిగా ఐదు టెస్టులు ఆడే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో అతడిని సారథిగా ఎంపిక చేసే అవకాశం లేదు. అలాగే కెప్టెన్‌గా చేసిన బుమ్రాను వైస్-కెప్టెన్‌గా నియమించడం సబబు కాదని బోర్డు ఆలోచిస్తోంది. దాంతో గిల్‌ను సారథిగా ఎంపిక చేస్తే..పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించాలని సెలెక్టర్లు, బీసీసీఐ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. కెప్టెన్సీ రేసులో కేఎల్ రాహుల్ పేరు వినిపించినా, ఇప్పటికే 33 ఏళ్ల వయసున్న అతడిని భవిష్యత్ ప్రయోజనాలకు అనుగుణంగా చూడలేమని బోర్డు భావించిందట.

మూడు నగరాల్లోనే మిగిలిన ఐపీఎల్..?

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించడంతో.. ఐపీఎల్ ఆశలు చిగురించాయి. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే.. ఆగిన లీగ్‌ను వీలైనంత వేగంగా పునఃప్రారంభించేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. భద్రతా కారణాల రీత్యా వారంపాటు మెగా లీగ్‌ను వాయిదా వేస్తున్నట్టు బోర్డు శుక్రవారం ప్రకటించింది. దీంతో విదేశీ ప్లేయర్లు స్వదేశాలకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, హఠాత్తుగా ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు తెరపైకి రావడంతో.. ప్లాన్-బితో వెళ్లాలని బీసీసీఐ సమాలోచన చేస్తోంది. ఇదే విషయమై ఆదివారం బోర్డు పెద్దలు చర్చించనున్నారు. ఈ క్రమంలో దక్షిణ భారతదేశంలోని మూడు వేదికలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో మిగిలిన మొత్తం 16 మ్యాచ్‌లు (12 లీగ్, మూడు ప్లేఆఫ్స్‌తో పాటు ఫైనల్) నిర్వహించి లీగ్‌ను పూర్తి చేయాలన్న ఉద్దేశంలో బోర్డు ఉందట. ప్రస్తుతం లీగ్‌లో 57 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. అయితే, 58వ మ్యాచ్ అయిన పంజాబ్-ఢిల్లీ మధ్య పోరు 10.1 ఓవర్ల తర్వాత రద్దయింది. కానీ, ఈ మ్యాచ్‌ను మళ్లీ నిర్వహిస్తారా? లేక చెరో పాయింట్ ఇస్తారా? అనేది బోర్డు నుంచి ఎలాంటి స్పష్టతా లేదు.

విదేశీ క్రికెటర్లను రప్పించడం సవాలే



వారంపాటు వాయిదా అని ప్రకటించిన బీసీసీఐ.. పరిస్థితులు చక్కబడకపోతే వచ్చే ఏడాదే లీగ్‌ను నిర్వహిస్తామని అన్ని ఫ్రాంచైజీలకు అంతర్గతంగా సమాచారం అందించిందట. ఈ నేపథ్యంలో పలు ఫ్రాంచైజీలకు చెందిన విదేశీ క్రికెటర్లు తమ స్వస్థలాల బాట పట్టారు. అయితే, ప్రస్తుతం శాంతి చర్చలు అన్న మాట వినిపిస్తుండడంతో వెంటనే మిగతా ఐపీఎల్ మ్యాచ్‌లను కొనసాగిస్తే వెళ్లిన వారిని తిరిగి రప్పించడం ఫ్రాంచైజీలకు సవాల్‌గా మారే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల మధ్య జూన్ 11 నుంచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఇరుదేశ ఆటగాళ్లు ఐపీఎల్ కోసం తిరిగి రావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐపీఎల్‌ను సస్పెండ్ చేయడంతో.. వివిధ ఫ్రాంచైజీలకు ఆడుతున్న విదేశీ ఆటగాళ్లు శనివారం స్వదేశాలకు తిరుగు ప్రయాణమయ్యారు. దేశవాళీ ఆటగాళ్లు, సహాయ సిబ్బంది కూడా ఇళ్లకు చేరుకొన్నారు.

పాక్ ఆర్మీ ప్రెస్ చీఫ్‌కు 'ఉగ్ర గతం'

» అణు శాస్త్రవేత్తగా పనిచేసిన ఈయన తండ్రికి అల్‌కాయిదా, ఒసామాతో నేరుగా సంబంధాలు

న్యూఢిల్లీ, మే 10 : ఆపరేషన్ సిందూర్ దాడుల సమాచారాన్ని పాక్ కోణం నుంచి మూడురోజులుగా అందిస్తున్న ఆ దేశ ఆర్మీ ప్రెస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధురీకి ఉగ్రవాద చీకటి గతంతో సంబంధం ఉంది. అల్‌కాయిదాతో సంబంధాలు కలిగిఉన్నారని, అణ్వాయుధాల కార్యక్రమానికి సంబంధించిన కీలక అంతర్గత సమాచారం ఉగ్రవాదులకు చేరవేశారనే అభియోగాలు ఈయన తండ్రి, రిటైర్డు అణు శాస్త్రవేత్త సుల్తాన్ బషీరుద్దీన్ మహమ్మద్‌పై ఉన్నాయని భారతీయ అధికార వర్గాలు వెల్లడించాయి. బషీరుద్దీన్‌కు ఒసామాబిన్ లాడెన్‌తో నేరుగా మాట్లాడేంతగా దగ్గరి సంబంధాలు ఉండేవని తెలిపాయి. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో పుట్టిన ఈయన పాకిస్థాన్ అణుశక్తి సంస్థలో పనిచేసి 2001లో పదవీవిరమణ పొందారు. మతాన్ని, సైన్సును కలిపి ఇస్లామిక్ దృక్కోణంలో అనేక పుస్తకాలు రాశారు. ఒసామా బిన్‌ను తాను కలిసినట్టు అంగీకరించడంతో 2001లో సుల్తాన్‌ను అరెస్టు చేశారు. అయితే, అణు రహస్యాలను ఉగ్రవాదులకు చేరవేసేంత సాంకేతిక జ్ఞానం ఆయనకు లేవని నిర్ధారించుకుని వదిలేశారు. ఆయనను అమెరికా బ్లాక్‌లిస్టులో పెట్టింది. స్పెషల్లీ డిజిగ్నేటెడ్ నేషనల్స్ జాబితాలో (ఎస్‌డీఎన్) ఆయన పేరు చేరింది.

పాక్‌పై 'బలూచ్' పిడుగు!

కలాత్‌లో నగరం స్వాధీనం..బలూచ్‌లో 39 చోట్ల దాడులు

న్యూఢిల్లీ, మే 10: పాకిస్థాన్‌కు బలూచిస్థాన్ వేర్పాటు వాదుల నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కలాత్‌లోని ఓ నగరాన్ని స్వాధీనం చేసుకున్నట్టు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) ప్రకటించింది. అంతేకాదు.. బలూచిస్థాన్‌లోని 39 ప్రాంతాల్లో దాడులు చేసినట్టు తెలిపింది. అదేవిధంగా పలు కీలక రహదారులను, ప్రభుత్వ కార్యాలయాలను కూడా తమ స్వాధీనంలోకి తీసుకున్నట్టు బీఎల్‌ఏ వెల్లడించింది. బలూచిస్థాన్‌లో ఖనిజ సంపదన కొల్లగొట్టేందుకు సహకరిస్తున్న సైనికులు, వారి కాన్వాయ్‌లపై కూడా దాడులు చేసినట్టు జీయాండ్ బలూచ్ గ్రూప్ అధికార ప్రతినిధి తెలిపారు. మరోవైపు.. బలూచిస్థాన్ వేర్పాటు వాదుల దాడుల్లో ఇద్దరు పాక్ సైనికులు మృతి చెందారు. క్వెట్టా, ఫైజాబాద్, హజర్గంజి ప్రాంతాల్లోని సైనిక పోస్టులపై గ్రెనేడ్లతో వేర్పాటు వాదులు దాడులకు పాల్పడ్డారు. అయితే.. బీఎల్‌ఏ దాడులు, రహదారుల దిగ్బంధనంపై పాకిస్థాన్ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

నన్‌కానా సాహిబ్ గురుద్వారాపై దాడి ఫేక్

» పలు తప్పుడు సమాచారాలను కొట్టిపారేసిన కేంద్రం

న్యూఢిల్లీ, మే 10: పాకిస్థాన్‌లోని నన్‌కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడి చేసిందన్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం శనివారం కొట్టిపారేసింది. భారత్‌లో మత విద్వేషాలు సృష్టించేందుకు అలాంటి ప్రచారం జరుగుతోందని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ యూనిట్ వెల్లడించింది. 'నన్‌కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడి చేసినట్లు పేర్కొంటూ సోషల్ మీడియాలో ఒక వీడియో షేర్ అవుతోంది. అది పూర్తిగా నకిలీ' అని స్పష్టం చేసింది. నన్‌కానా సాహిబ్ అనేది సిక్కు మత వ్యవస్థాపకులు గురునానక్ జన్మస్థలం. అదేవిధంగా జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ ఎయిర్‌బేస్‌ను పాకిస్థాన్ ధ్వంసం చేసిందని సోషల్ మీడియాతో పాటు పలు వార్తావేదికలపై జరుగుతున్న ప్రచారాన్ని కూడా ప్రభుత్వం ఖండించింది. ఆ సైనిక స్థావరం పూర్తిస్థాయిలో పనిచేస్తోందని వెల్లడించింది. భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థానీ మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ఈ విధమైన దుష్ప్రచారం జరుగుతోందని తెలిపింది. ఇంకా పాకిస్థాన్‌లో ఒక వైమానిక మహిళా పైలట్ పట్టుబడ్డారని, భారత పవర్‌గ్రిడ్ కుప్పకూలిందని, ముంబై-ఢిల్లీ ఎయిర్‌లైన్ మార్గాన్ని తాత్కాలికంగా మేసివేశారన్న ప్రచారాలను కూడా నకిలీగా కేంద్రం కొట్టిపారేసింది.

'ఆకాశమే' హద్దు!

» పాక్ క్షిపణులు, డ్రోన్లు కూల్చి.. పశ్చిమ భారత్ నగరాలకు రక్షణ

» సృష్టికర్త డాక్టర్ రామారావు హర్షం





న్యూఢిల్లీ, మే10: ఆకాశ్ క్షిపణి వ్యవస్థ.. గురువారం రాత్రి పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినపుడు, వాటిని నేలకూల్చి పశ్చిమ భారత్‌లోని నగరాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించింది. ఉపరితలం నుంచి గగన తలంలోని బహుళ లక్ష్యాలను ఏకకాలంలో ఛేదించ గల సత్తా దీని సొంతం. డీఆర్‌డీవో శాస్త్రవేత్త డాక్టర్ ప్రహ్లాద రామారావు సహచర శాస్త్రవేత్తలతో కలసి 15 ఏళ్ల క్రితం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. పాక్ దాడులను ఆకాశ్ సమర్థంగా తిప్పికొడుతున్న దృశ్యాలను టీవీల్లో చూసిన 78 ఏళ్ల ప్రహ్లాద రామారావు హర్షం వ్యక్తం చేశారు. 'నా జీవితంలో అది అత్యంత సంతోషకరమైన రోజు. శత్రువుల వైమానిక లక్ష్యాలను కూల్చివేయడంలో నా బిడ్డ అత్యంత కచ్చితంగా, అద్భుతంగా పనిచేసింది. అంచనాలకు మించి పనిచేస్తూ లక్ష్యాలను ఎదుర్కొంటున్న తీరు చూసి నా కళ్లల్లో ఆనంద బాష్పాలు వచ్చాయి' అని జాతీయ మీడియాతో ప్రహ్లాద రామారావు అన్నారు. ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అత్యంత చిన్న వయసులో పని చేసిన ఘనత ఆయనదే. మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆయన్ను ఎంపిక చేశారు. డ్రోన్లు, క్షిపణులు, హెలికాప్టర్లతో పాటు అమెరికా తయారు చేసిన అత్యంత నైపుణ్యం గల సూపర్‌సోనిక్ ఎఫ్-16 యుద్ధ విమానాలను అడ్డుకునేలా సహచర శాస్త్రవేత్తలతో కలసి ఆకాశ్ క్షిపణి వ్యవస్థను రూపొందించినట్టు ప్రహ్లాద రామారావు తెలిపారు. మొదట్లో దీనిపై భారత మిలటరీ సంకోచించిందని గుర్తు చేసుకున్నారు. తాజాగా పాక్ దాడులను తిప్పికొట్టడంలో భారత ఇంటిగ్రేటెడ్ కౌంటర్-మానవ రహిత ఏరియల్ సిస్టమ్ గ్రిడ్, రష్యాలో తయారు చేసిన ఎస్-400, ఇతర విమాన నిరోధక ఆయుధాలతో కలసి ఆకాశ్ సమర్థంగా పనిచేసింది.

ఇవీ ప్రత్యేకతలు

- ఆకాశ్ సిస్టమ్‌ను హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తయారు చేసింది.
- సమూహంగా లేదా వేర్వేరుగా 20 కిలో మీటర్ల ఎత్తులో ఉన్న బహుళ లక్ష్యాలను ఏకకాలంలో ఛేదించగలదు.
- ప్రతి లాంచర్‌లో మూడు క్షిపణులు ఉంటాయి. ఒక్కో క్షిపణి 20 అడుగుల పొడవు, 710 కిలోల బరువు ఉంటుంది. ప్రతి క్షిపణి 60 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు.
- ఈ సిస్టమ్ పూర్తిగా ఆటోమేటిక్. రియల్ టైమ్, మల్టీ సెన్సార్ డేటాతో శత్రు లక్ష్యాలను గుర్తించి, దాడి చేస్తుంది.
- ఆకాశ్ సిస్టమ్‌ను రూ.6,000 కోట్ల ఒప్పందంతో ఆర్మేనియాకు ఎగుమతి చేశారు.

కీలక లక్ష్యాలు సాధించే వరకూ

యుద్ధం ఆపకూడదు

» పాక్‌కు విలువైన వాటిని దెబ్బతీయాలి

» అప్పుడే ఆ దేశం దారికి వస్తుంది

» పాక్ అణు బెదిరింపులు వట్టివే

» 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో బ్రిగేడియర్ గణేశం



బ్రిగేడియర్ పి.గణేశం. భారత ఆర్మీలో 35 సంవత్సరాలకు పైగా పనిచేశారు. సైన్యం చేపట్టిన అనేక ఆపరేషన్లలో పాల్గొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు తీవ్రంగా జరుగుతున్న సమయంలో అక్కడి ఒక బెటాలియన్‌కు నాయకత్వం వహించారు. తెలంగాణలోని భూంపల్లి గ్రామంలో పుట్టి ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివిన గణేశం ట్యాంకులు, ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ వంటి ఆర్మర్డ్ వెహికిల్స్ సాంకేతికతలో నైపుణ్యం గలవారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసిన టీ-55 యుద్ధ ట్యాంకు ఆధునికీకరణకు చేపట్టిన 'ప్రాజెక్టు గుల్‌మొహర్'లో కీలక పాత్ర నిర్వహించారు. ఆర్మీ కోసం పినాక అనే ఒక మల్టీరోల్ ఆయుధ ప్లాట్‌ఫాం రూపకల్పనలోనూ ముఖ్య భూమిక వహించారు. ఆకాశ్ క్షిపణుల్ని తయారు చేసే భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)లోనూ ఆయన డైరెక్టర్‌గా సేవలు అందించారు. 2005లో రాష్ట్రపతి నుంచి విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు. ప్రస్తుతం భారత్-పాక్ మధ్య జరుగుతున్న పోరాటంపై ఆంధ్రజ్యోతికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలివీ...

భారత్-పాక్‌లు మొన్నటి వరకూ సరిహద్దు దాటకుండా ఎవరి భూభాగం నుంచి వారు దాడులు చేసుకున్నారు. ఇప్పుడు మొదటి సారిగా పాక్ యుద్ధ విమానాలు మన గగనతలంలోకి వచ్చాయి. తాజాగా కాల్పుల విరమణ, ఉల్లంఘనలను ఎలా చూస్తారు?

ఒకవైపు కాల్పుల విరమణ అంటూనే.. పాకిస్థాన్ ఉల్లంఘనలకు పాల్పడుతోంది. నా ఉద్దేశంలో కొన్ని కీలక పరిణామాలు జరిగితే తప్ప యుద్ధం ఆపకూడదు. యుద్ధాన్ని ఆపాలంటే ఇరు దేశాల మధ్య నిర్దిష్టమైన చర్చలు జరగాలి. పాకిస్థాన్ గట్టిగా దెబ్బ తింటే తప్ప భారత్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధపడదు. చర్చల్లో పైచేయి సాధించాలంటే మనం బేరమాడే శక్తిని పెంచుకోవాలి.

అంటే భారత్ ఏం చేయాల్సి ఉంటుంది?

పాకిస్థాన్ విలువైనవిగా భావించే కొన్నింటిని.. భూభాగం లేదా ఇతర అసెట్స్‌ను మనం స్వాధీనం చేసుకోవాలి. అది లాహోర్ కావచ్చు. ఆక్రమిత కశ్మీర్ కావచ్చు. వారి సైనికుల్ని, పైలట్లను పట్టుకోవడం కావచ్చు. అప్పుడే మనకు బేరమాడే శక్తి పెరుగుతుంది. మనం కోరింది చేయడానికి పాక్ అంగీకరిస్తుంది.

ఆ పరిస్థితే వస్తే అణ్వస్త్రాలు ప్రయోగిస్తామని పాక్ బెదిరిస్తోంది కదా?

భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగిస్తే పాకిస్థాన్‌కు కలిగే లాభం ఏమిటి? తాము సర్వనాశనం అయిపోయి ఏదోలా కసి తీర్చుకోవాలనే దుస్థితి ఏర్పడితే తప్ప పాక్ మనపై అణ్వస్త్ర ప్రయోగానికి ఎందుకు సిద్ధపడుతుంది? అలాంటి సందర్భంలో మనం మాత్రం అణ్వస్త్ర ప్రయోగం చేయలేమా? పాక్‌కు ఆ సంగతి తెలియదా? అందువల్ల ఇవన్నీ వట్టి మాటలే తప్ప నిజంగా జరిగే అవకాశం తక్కువ. ఏ దేశస్థులైనా అణ్వస్త్రాల గురించి అతిగా మాట్లాడడం సరికాదు. అయితే ప్రజలను, సైన్యాన్ని ఉత్సాహపరిచే ఉద్దేశంతో కొందరు ఇలాంటి తొడగొట్టే మాటలు మాట్లాడుతుంటారు. స్వీయ స్థైర్యం పెంచుకునే మానసిక యుద్ధంలో ఇవన్నీ భాగం. అంతే!

మీరు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)లో పని చేశారు. బీడీఎల్ తయారు చేసే ఆకాశ్ క్షిపణులు ప్రస్తుత యుద్ధంలో కీలక పాత్ర వహిస్తున్నాయి. మీ స్పందన ఏమిటి?

ఆకాశ్ క్షిపణులు చాలా శక్తిమంతమైనవి. 25 కిలోమీటర్ల రేంజ్ కలిగినవి. మన కీలక స్థావరాలను కాపాడే సత్తా వీటికి ఉంది. ఈ క్షిపణుల్ని మరింత అభివృద్ధి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి



సైన్యానికి హ్యూమనాయిడ్ రోబో అండ

» అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో.. రిస్క్‌ను తగ్గించమే లక్ష్యం

» 2027 నాటికి రోబో సిద్ధం

పుణె, మే 10: భారత సైన్యానికి అండగా ఉండేందుకు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) సరికొత్త ఆవిష్కరణ చేస్తోంది. మిలిటరీ కార్యకలాపాల్లో ముందుండి దళాలకు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో హ్యూమనాయిడ్ (మానవాకృతిలో ఉండే) రోబోను సిద్ధం చేస్తోంది. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో దళాల ప్రత్యక్ష ప్రమేయాన్ని తగ్గించడానికి, మానవ ఆదేశాల మేరకు క్లిష్టమైన పనులు పూర్తి చేయడానికి డీఆర్‌డీవోకు చెందిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఇంజనీర్స్) ఈ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తోంది. నాలుగేళ్ల నుంచి ఈ ప్రాజెక్టు కోసం ఒక బృందం పనిచేస్తోందని సెంటర్ ఫర్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ ఫర్ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ గ్రూప్ డైరెక్టర్ ఎస్ఈ తలోల్ పీటీఐ వార్తా సంస్థకు వెల్లడించారు. చేతులు, కాళ్లు ఉండే రోబో శరీరానికి సంబంధించి కింది, పైన భాగాలకు వేరు వేరు నమూనాలను తయారు చేశామని చెప్పారు. అంతర్గత పరీక్షలన్నీ విజయవంతమయ్యాయని అయన వివరించారు. దట్టమైన అడవుల్లాంటి కఠిన భౌగోళిక పరిస్థితుల్లో కూడా ఆ రోబో సమర్థంగా పనిచేస్తుందని తెలిపారు. ఇటీవల పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ రోబోను ప్రదర్శించామని పేర్కొన్నారు. మూడు కీలక అంశాలతో ఇది పనిచేస్తుందన్నారు. మానవ శరీర కండరాలు కదలికల వలే రోబో కదలికలు ఉండేలా యాక్టువేటర్స్ చూస్తాయని, సమీప ప్రాంతాల్లోని రియల్ టైం డేటాను సెన్సార్లు సేకరిస్తాయని, ఆ డేటాను కంట్రోల్ సిస్టమ్ విశ్లేషించి ఆదేశాలు ఇస్తుందని తలోల్ తెలిపారు. బ్యాలెన్స్‌గా ఉంటూ చెప్పిన పనులు పూర్తిచేయడం, డేటాను వేగంగా విశ్లేషించి క్షేత్రస్థాయిలో రోబోతో పనుల పూర్తి చేసేలా చేయడమే తమ ముందున్న పెద్ద సవాల్ అని డిజైన్ టీమ్‌కు నేతృత్వం వహిస్తున్న కిరణ్ ఆకెళ్ల పేర్కొన్నారు. 2027 కల్లా ఈ ప్రాజెక్టును పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మన దేశం హుందాగా బదులు చెప్పింది



నాని

'మన దేశం హుందాగా బదులు చెప్పింది. లెట్స్ సెల్యూట్ ద ఇండియన్ ఆర్మీ. 'హిట్-3'ని ప్రేక్షకులు బాగా ఆదరించారు. కమర్షియల్ సినిమాలా సెలబ్రేట్ చేసుకోవడం సంతోషంగా ఉంది' అని అన్నారు హీరో నాని. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'హిట్-3' విడుదలై మంచి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో నాని మాట్లాడుతూ' ప్రస్తుతం దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో సెలబ్రేషన్స్ నిర్వహించవచ్చా అనే చర్చ వచ్చింది. శత్రువులు మనకు ఒక సమస్య సృష్టించాలని ప్రయత్నించారు. వాళ్ల కారణంగా ఇండియాలో ఒకచోట సెలబ్రేషన్స్ రద్దయ్యాయనే సంతృప్తిని ఇవ్వకూడదనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం' అని వివరించారు. హీరో అడవి శేష్ మాట్లాడుతూ 'మన దేశం కోసం సైనికులు పోరాడుతుంటే గర్వంగా ఉంది' అని అన్నారు. 'మంచి కంటెంట్‌ని ఆదరిస్తారని ప్రేక్షకులు మరోసారి రుజువు చేశారని' చిత్ర దర్శకుడు శైలేష్ కొలను పేర్కొన్నారు.

ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్



బ్రహ్మాజీ, యశ్వంత్ పెండ్యాల ('కమిటీ కుర్రోళ్లు' ఫేం)ప్రధాన పాత్రలు పోషించే 'కథకళి' చిత్రం షూటింగ్ శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. న్యూ ఏజ్ క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి ప్రసన్నకుమార్ నాని దర్శకుడు. రవికిరణ్ కలిదిండి నిర్మిస్తున్నారు. నిహారిక కొణిదెల క్లాప్ కొట్టి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఆసక్తికరంగా సాగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభిస్తాం' అని చెప్పారు.ఈ సినిమాలో కథే హీరో అనీ, కాన్సెప్ట్ తనకు బాగా నచ్చిందనీ బ్రహ్మాజీ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం పవన్, సినిమాటోగ్రఫీ: జితిన్ మోహన్.

ఆపరేషన్ సిందూర్ టైటిల్

● దర్శకుడి క్షమాపణలు





పహల్గాంలో ఉగ్రవాదుల దాడి తర్వాత 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను భారత్ మట్టుబెడుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే టైటిల్‌తో సినిమాను తెరకెక్కించనున్నట్లు ప్రకటించి దర్శకుడు నెటిజన్ల ఆగ్రహానికి గురయ్యాడు. డైరెక్టర్ ఉత్తమ్ మహేశ్వరీ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భగ్నాని ఫిల్మ్స్ బ్యానర్‌లో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నానంటూ ఓ పోస్టర్‌ని సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే సినిమా అనౌన్స్‌మెంట్‌కు ఇదా సమయం అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యుద్ధం కొనసాగుతోంది..సిగ్గుండాలి' అంటూ ఘాటు కామెంట్స్ పెట్టారు. దీంతో దర్శకుడు క్షమాపణలు చెబుతూ ఇన్‌స్టాలో పోస్టు పెట్టాడు. ఎదుటి వారి మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని పేర్కొన్నారు.

జాతీయ భద్రతా నిధికి విరాళం



జాతీయ భద్రతా నిధి (నేషనల్ సెక్యూరిటీ ఫండ్)కి ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేయనున్నట్టు ప్రముఖ సంగీత దర్శకుడు, రాజ్యసభ సభ్యుడు ఇళయరాజా ప్రకటించారు. ఈ విషయంపై ఆయన శనివారం ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'పహల్గాం ఉగ్రచర్యకు వ్యతిరేకంగా భారత రక్షణశాఖ సైనిక చర్యకు శ్రీకారం చుట్టడంతో మన జవానులు సరిహద్దుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ ప్రజలు, దేశ సరిహద్దులను రక్షించే పనుల్లో నిమగ్నమైవున్నారు. ఈ తరుణంలో రాజ్యసభ సభ్యుడిగా జాతీయ భద్రతా నిధికి ఒక నెల వేతనంతో పాటు నా సంగీత విభావరి ద్వారా వచ్చే నిధులను కూడా విరాళంగా అందజేస్తాను' అని ఇళయరాజా పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మహాభారత నేపథ్యంలో



సంగీత సంచలనం రవి బస్రూర్ దర్శకుడిగా మారి తెరకెక్కిస్తున్న కన్నడ చిత్రం 'వీర చంద్రహాస'. శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. నిర్మాత ఎంవీ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. శుక్రవారం హీరో విష్వక్‌సేన్ 'వీర చంద్రహాస' ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. మహాభారతం నేపథ్యంలో అల్లుకున్న ఓ ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కించాం, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రమిదని రవిబస్రూర్ తెలిపారు.

నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది



వెన్నెల కిశోర్

'ఇప్పుడున్న పరిస్థితుల్లో హాస్యనటుడిగా ప్రేక్షకులను మెప్పించడం సవాల్. రకరకాల వేదికలపై కామెడీ కంటెంట్ విస్తృతంగా అందుబాటులో ఉంది. అంతకు మించిన కంటెంట్ ఇస్తేనే ప్రేక్షకలను థియేటర్‌కు తీసుకురావడం సాధ్యమవుతుంది' అని వెన్నెల కిశోర్ అన్నారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన 'సింగిల్' చిత్రంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా వెన్నెల కిశోర్ మీడియాతో ముచ్చటించారు.

'ఈ చిత్రంలో నా నటనకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనకు ఆనందంగా ఉంది. నటుడిగా నా ప్రతిభ వల్ల ఒక సినిమా మరింతగా ప్రేక్షకులకు చేరువవడం నాకు ఆనందాన్ని ఇచ్చింది. చాలా సార్లు మనకు సాదాసీదా పాత్రలే వస్తుంటాయి. అందులో ఉండే ప్రత్యేకతను అవగాహన చేసుకొని మనదైన ముద్రను చూపేందుకు ప్రయత్నించాలి. గీతగోవిందం, అమీతుమీ పాత్రలు నటుడిగా సంతృప్తిని ఇచ్చాయి. ఇప్పుడు 'సింగిల్' చిత్రంలో అరవింద్ పాత్ర నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది.'





ప్రధాని అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమావేశం

న్యూఢిల్లీ, మే 10: ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం సాయంత్రం ఓ అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. సైనిక చర్యను ఆపేందుకు భారత్, పాక్ ఓ అవగాహనకు వచ్చాయనే ప్రకటన నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహన్, త్రివిధ దళాల అధిపతులు పాల్గొన్నారు.

మా మధ్యవర్తిత్వం వల్లే కాల్పుల విరమణ: ట్రంప్



వాషింగ్టన్, మే 10 : భారత్, పాకిస్థాన్ తక్షణమే కాల్పుల విరమణ అమలుకు అంగీకరించాయని, అమెరికా చేసిన మధ్యవర్తిత్వం వల్లే ఇది సాధ్యమైందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో కూడా ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ సైన్యాలు సైనిక స్థావరాలపై పరస్పర దాడులకు తెగబడుతూ ఇరుదేశాల మధ్య పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిన కొన్ని గంటల్లోనే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. "అమెరికా మధ్యవర్తిత్వంతో రాత్రంతా సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం భారత్, పాకిస్థాన్ తక్షణమే పూర్తి స్థాయి కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ విషయంలో విజ్ఞత, తెలివిగా వ్యవహరించిన ఇరుదేశాలకు శుభాకాంక్షలు" అంటూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు చేశారు. భారత్, పాక్ విదేశాంగ శాఖ మంత్రులు ఎస్ జైశంకర్, ఇషాక్ దర్, పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌తో రుబియో రుబియో మాట్లాడిన తర్వాత ట్రంప్ ప్రకటన వెలువడింది. భారత్, పాక్ ప్రభుత్వాలు తక్షణమే కాల్పుల విరమణ పాటించేందుకు అంగీకరించాయని, వేర్వేరు అంశాలపై ఇరుదేశాలు తటస్థ వేదికలో చర్చలు ప్రారంభించబోతున్నాయి అని రుబియో ఓ ప్రకటన చేశారు. కాగా మధ్యవర్తిత్వం అంశంలో అమెరికా చేసిన ప్రకటనలను పాకిస్థాన్ స్వాగతించగా భారత్ తోసిపుచ్చింది.

ఉగ్రదాడుల్ని ఇక యుద్ధంగానే పరిగణిస్తాం

» పాకిస్థాన్‌కు భారత్ స్పష్టమైన హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 10: ఉగ్రవాదం పట్ల భారతదేశం తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. భవిష్యత్తులో తమ భూభాగంపై ఎటువంటి ఉగ్రదాడి జరిగినా తమపై యుద్ధం ప్రకటించినట్టుగానే భావిస్తామని పాకిస్థాన్‌కు స్పష్టం చేసింది. తమ ప్రతిస్పందన కూడా అంతే తీవ్రంగా ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ మేరకు శనివారం స్పష్టమైన హెచ్చరిక చేసినట్టు ఉన్నతస్థాయి అధికార వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా రెడ్‌లైన్ గీయాలని, పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు మరోమారు భారత్‌ను లక్ష్యంగా చేసుకొంటే పహల్గాం ఘటన తర్వాత స్పందించిన విధంగానే స్పందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. 'భవిష్యత్తులో భారతదేశంలో జరిగే ఏదేని ఉగ్రవాద ఘటనను దేశంపై యుద్ధంగానే భావిస్తాం. ప్రతిస్పందన కూడా ఆ మేరకు ఉంటుంది' అని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరుదేశాల మధ్య శత్రుత్వం చెలరేగినప్పటి నుంచి భద్రతాపరంగా అనేక ఉన్నతస్థాయి సమావేశాలను మోదీ నిర్వహించారు. విస్తృతస్థాయి చర్చల ఫలితమే తాజా నిర్ణయం. చాలాకాలంగా తన భూభాగంపై సైనికులను, పౌరులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న ఉగ్రదాడులకు పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలే కారణమని భారత్ స్పష్టం చేస్తోంది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో రాజీ లేదు: జైశంకర్

న్యూఢిల్లీ, మే 10 : ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై ఆయన ఎక్స్‌లో స్పందించారు. "కాల్పులు, సైనిక చర్యను ఆపే విషయంలో భారత్, పాక్ ఈ రోజు ఓ అవగాహనకు వచ్చాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానికి వ్యతిరేకంగా భారత్ అన్ని వేళలా రాజీలేని వైఖరిని కొనసాగించింది. ఇక మీదట కూడా అదే వైఖరి కొనసాగుతుంది" అని జైశంకర్ పోస్టు చేశారు.

ప్రాదేశిక సమగ్రత రక్షణలో పాక్‌కు మద్దతు: చైనా

ఇస్లామాబాద్, మే 10: తమ వ్యూహాత్మక భాగస్వామి అయిన పాకిస్థాన్‌కు ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునే విషయంలో తమ మద్దతు ఉంటుందని చైనా పునరుద్ఘాటించింది. పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిస్థితుల గురించి వాంగ్‌కు దార్ వివరించారని పాక్ విదేశాంగ శాఖ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్థాన్ తన సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశానికి మద్దతుగా నిలుస్తామని వాంగ్ స్పష్టం చేసినట్లు ఆ ప్రకటన తెలిపింది.

యుద్ధం మా అభిమతం కాదు

» చైనాకు స్పష్టం చేసిన దోభాల్

న్యూఢిల్లీ, మే 10: యుద్ధం తమ అభిమతం కాదని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భారత జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోభాల్ అన్నారు. శనివారం పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడ్డ తర్వాత వాంగ్ యీతో దోభాల్ ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని గురించి ఆయనకు వివరించి, 26 మంది ఆ ఘటనలో మృతిచెందినట్లు వివరించారు. "ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు కాల్పుల విరమణకు భారత్, పాక్ అంగీకరించాయి. అయితే.. ఒప్పందం జరిగిన నాలుగు గంటల్లోనే పాకిస్థాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించింది" అని దోభాల్ వివరించారు. దీనికి వాంగ్ యీ స్పందిస్తూ.. పహల్గాం దాడిని చైనా తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

కాల్పుల విరమణను స్వాగతిస్తున్నాం: గుటేరస్

న్యూయార్క్, మే 10: భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటొనియో గుటేరస్ స్వాగతించారు. ఉద్రిక్తతలు తగ్గి సరైన దిశగా చర్యలు తీసుకోవడానికి ఇది తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు కాల్పుల విరమణ ఒప్పందం దోహదకారి అవుతుందని చెప్పారు. దీనికి సంబంధించి సెక్రటరీ జనరల్ అధికార ప్రతినిధి స్టెఫాన్ దుజారిక్ ప్రకటన విడుదల చేశారు.

ప్రధాని అధ్యక్షతన అఖిలపక్షం పెట్టండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 10 : భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయనే ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించి జరిగిన పరిణామాలను అన్ని పార్టీల నేతకు వివరించాలని కోరింది. అలాగే, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. మరోపక్క, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సైన్యంతో కలిసి ఉన్న ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేసిన కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధ్యక్షుడు పవన్ ఖేరా.. ఇందిర లేని లోటు దేశంలో కనిపిస్తుంది అనే అర్థం వచ్చేలా "ఇండియా మిసెస్ ఇందిరా" అనే శీర్షిక పెట్టారు.

విరమణ.. ఉల్లంఘన!



కాల్పుల విరమణతో శనివారం సాయంత్రం శ్రీనగర్‌లో షాపుల వద్ద సందడి



శనివారం రాత్రి మళ్లీ బ్లాక్‌అవట్ ప్రకటించడంతో చిమ్మచీకటిలో శ్రీనగర్

(మొదటి పేజీ తరువాయి)

పేల్చేస్తుండడంతో ఇరు దేశాల సరిహద్దుల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవిస్తున్నాయి. అక్కడి ప్రజల సంతోషం కొన్ని గంటలపాటు కూడా నిలవలేదు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందన్న ఊరట వారికి దక్కలేదు. నిజానికి, మూడు రోజులపాటు భారత్, పాకిస్థాన్ మధ్య కొనసాగిన ఉద్రిక్తతలకు శనివారం సాయంత్రం తాత్కాలికంగా తెరపడింది. రాత్రంతా చర్చలు జరిపామని, ఇరు దేశాలూ తక్షణ, పూర్తి స్థాయి కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్టు పెట్టారు. ఆ తర్వాత కొద్ది సేపటికే పాకిస్థాన్ విదేశాంగ మంత్రి, ఉప ముఖ్య మంత్రి ఈషాక్ దార్ స్పందించారు. తక్షణమే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించాయని ప్రకటించారు. తన సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడకుండా ఈ ప్రాంతంలో శాంతి, భద్రతలు కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తుందని కూడా తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టుకున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికే అంటే శనివారం సాయంత్రం ఆరు గంటలకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఎప్పట్లాగే విలేకరుల ముందుకు వచ్చారు. "పాకిస్థాన్ దిగి వచ్చింది. ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) మధ్యాహ్నం 3.30 గంటలకు భారత డీజీఎంవోతో చర్చలు జరిపారు. పూర్తిస్థాయిలో కాల్పులతోపాటు భూమ్మీద, ఆకాశంలోనూ, సముద్రంలోనూ సైనిక చర్యలను సాయంత్రం ఐదు గంటల నుంచి నిలిపివేయాలని ఇద్దరూ నిర్ణయించారు" అని ప్రకటించారు. ఈ ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని ఇరు వర్గాలకూ సూచించామని, డీజీఎంవోలు ఇద్దరి మధ్య ఈనెల 12వ తేదీన మళ్లీ చర్చలు జరుగుతాయని తెలిపారు. తొలుత, పాకిస్థాన్ డీజీఎంవో చొరవ చూపారని, మధ్యాహ్నం 3.35 గంటలకు ఆయనే ఫోన్ చేశారని, ఆ తర్వాత చర్చలు జరిగి ఒప్పందం కుదిరిందని వివరించారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ కూడా ప్రకటించారు. "కాల్పులు, సైనిక చర్య నిలిపివేతకు భారత్, పాకిస్థాన్ ఓ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాని నిర్మూలనకు భారత్ ఎప్పటికీ కట్టుబడి ఉంటుంది" అని ప్రకటించారు. అయితే, కాల్పుల నిలిపివేతకు భారత్, పాక్ నేరుగానే కసరత్తు చేశాయని, అమెరికా మధ్యవర్తిత్వం తర్వాతే ప్రకటన వచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ స్వాగతించారు. అన్ని రకాల రవాణాకు తమ గగనతలాన్ని తెరుస్తున్నట్లు ఆ తర్వాత పాకిస్థాన్ కూడా ప్రకటించింది. అన్ని విమానాశ్రయాల్లోనూ సాధారణ కార్యకలాపాలు అందుబాటులోకి వచ్చాయని పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకటించింది.



శనివారం సాయంత్రం స్వర్ణదేవాలయంలో భక్తుల రద్దీ

యథావిధిగానే సింధు జలాల నిలిపివేత

కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ సింధు జలాల నిలిపివేత నిర్ణయం యథావిధిగానే కొనసాగుతుందని భారత విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. వీసా ఆంక్షలను కూడా ఉపసంహరించేది లేదని తేల్చి చెప్పాయి. ఎటువంటి షరతులూ లేకుండానే కాల్పుల విరమణకు అంగీకరించామని చెబుతూనే.. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ అంతం చేసే వరకూ సింధు జల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని వివరించాయి. దీనికితోడు, భారతదేశంలో ఎక్కడైనా ఉగ్రవాద ఘటన జరిగితే.. దానిని తమ దేశంపై యుద్ధ చర్యగానే భావిస్తామని చెబుతూ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించినట్లు ఆ వర్గాలు వివరించాయి. అంతేనా.. మనం విధించే షరతుల ఆధారంగానే కాల్పుల విరమణ ఒప్పందం ఉండాలని ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్, విదేశాంగ మంత్రి జైశంకర్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

4 గంటల్లోనే..

ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి నాలుగు గంటలు కూడా కాకుండానే పాకిస్థాన్ సైన్యం దానిని ఉల్లంఘించింది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పులు జరిపింది. ఆర్ఎస్ పుర సెక్టార్లో జరిపిన కాల్పుల్లో బీఎస్ఎఫ్ ఎస్సై మహ్మద్ ఇంతియాజ్ వీర మరణం పొందారు. సరిహద్దు అవతలి నుంచి వచ్చిన గుళ్ల వర్షానికి మరో ఏడుగురు గాయపడ్డారని బీఎస్ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. జమ్ము కశ్మీర్, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో భారీగా పేలుళ్లు వినిపించాయి. సైరన్లు వినిపించాయి. చిమ్మ చీకట్లు అలముకున్నాయి. ప్రజల్లో ఎప్పట్లాగే భయాందోళనలు నెలకొన్నాయి. బారాముల్లా, బందిపొరా తదితర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. "ఎక్కడా కాల్పుల విరమణ అమలు జరగడం లేదు. శ్రీనగర్ మధ్యలో ఎయిర్ డిఫెన్స్ యూనిట్లు ఇప్పుడే తెరుచుకున్నాయి. ఇంకెక్కడి కాల్పుల ఉల్లంఘన!? శ్రీనగర్ అంతటా భారీ పేలుళ్లు వినిస్తుంటే!?" అని ఎక్స్‌లో జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పోస్టు చేశారు. ఇక, జమ్ము కశ్మీరు వ్యాప్తంగా పెద్దఎత్తున డ్రోన్లు కూడా ఎగిరాయి. భారత బలగాలు వాటిని అడ్డుకుని కూల్చేశాయి. ఇక, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, జైసల్మేర్ తదితర ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యగా లైట్లు ఆర్పేయాలని ప్రజలకు సూచించారు. అలాగే, ఉధంపూర్, బార్మర్, పఠాన్‌కోట్, జైసల్మేర్ తదితర ప్రాంతాల్లోనూ పేలుళ్లు వినిపించాయి. అక్కడ కూడా లైట్లు నిలిపివేయడంతో చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అమృత్‌సర్‌లోని ఖాసా కంటోన్మెంట్ పరిధిలో దూసుకొచ్చిన డ్రోన్లను భారత సైన్యం కూల్చేసిందని, పాకిస్థాన్ యధేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఇండియన్ ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించి పాకిస్థాన్ కాల్పులు జరుపుతోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి.

ఉల్లంఘిస్తే.. ప్రతి చర్య తప్పదు: మిస్రీ

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే గట్టి ప్రతి చర్య తప్పదని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి పాకిస్థాన్‌ను హెచ్చరించారు. ఒప్పందం కుదిరిన తర్వాత కూడా కాల్పులు జరపడం, డ్రోన్లతో దాడి చేయడాన్ని ఖండించారు. ఈ అంశాన్ని 'చాలా చాలా సీరియస్'గా తీసుకుంటామని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ.. ఆ తర్వాత ఉల్లంఘనలపై తీవ్రస్థాయిలో ఆందోళనల తర్వాత శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆయన మరోసారి విలేకరుల ముందుకు వచ్చారు. " కొన్ని గంటలుగా కాల్పుల విరమణ ఉల్లంఘనలు మళ్లీ మళ్లీ జరిగాయి. ఇటువంటి ఉల్లంఘనలకు తగిన, సరైన రీతిలో స్పందించే అధికారాలను భద్రతా బలగాలకు ఇచ్చాం. వీటిని చాలా సీరియస్‌గా తీసుకుంటాం. తగిన చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌ను కోరాం" అని మిస్రి తెలిపారు.

ఉగ్రదాడి నుంచి కాల్పుల విరమణ దాకా

» పహల్గాం దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు

» ఆపరేషన్ సిందూర్‌తో కమ్ముకున్న యుద్ధ మేఘాలు

» దాడులు, ప్రతిదాడులతో దాయాది దేశాల్లో టెన్షన్

» అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణకు ఓకే

న్యూఢిల్లీ, మే 10 : పహల్గాంలో జరిగిన హేయమైన ఉగ్రదాడి భారత్, పాక్ మధ్య యుద్ధ వాతావరణానికి తెరతీసింది. కశ్మీర్‌లో అమాయక పర్యాటకులు 26 మందిని ఉగ్రవాదులు అత్యంత పాశవికంగా కాల్చి చంపడం యావత్ భారతావనిలో ఆగ్రహావేశాలను రేకెత్తించింది. ఉగ్ర మూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు సర్జికల్ స్ట్రైక్స్ తరహాలో గట్టిగా బదులివ్వాలని పౌరుల నుంచి బలమైన అభిప్రాయం వ్యక్తమైంది. ఉగ్ర దాడికి దీటైన జవాబు ఇచ్చేందుకు వ్యూహ రచన చేసిన భారత్.. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీరులోని ఉగ్ర స్థావరాలు, శిక్షణా కేంద్రాలను లక్ష్యం చేసుకుంది. కచ్చితమైన దాడులతో మే 6న అర్ధరాత్రి దాటాక ఉగ్ర మూకలపై విరుచుకుపడింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. దాడులతో రగిలిపోయిన పాకిస్థాన్ భారత్‌పైకి అనేక క్షిపణులు, డ్రోన్లను పంపింది. అయితే, వాటిని మన దేశ రక్షణ వ్యవస్థలు సమర్థంగా కూల్చివేశాయి. చేసేదేం లేక పాకిస్థాన్ సైన్యం సరిహద్దుల్లోని అమాయక భారత పౌరులపై నిత్యం కాల్పులు జరుపుతూ వచ్చింది. ఈ పరిణామాలు ముదురుతూ దాయాదుల మధ్య ఇక యుద్ధం తప్పదేమోననే వాతావరణాన్ని కల్పించాయి. అయితే, అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల్లో ఇరు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయి.

పహల్గాం దాడి నుంచి జరిగిన పరిణామ క్రమం ఇలా..

- **ఏప్రిల్ 22 :** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో లష్కర్-ఈ-తయిబా ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 26 మంది పర్యాటకులను చంపేశారు.
- **ఏప్రిల్ 23 :** ఉగ్ర దాడితో పాక్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్న భారత్.. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. అటారీ-వాఘా సరిహద్దులను మూసివేసింది. ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టింది.
- **ఏప్రిల్ 24 :** పాక్ వీసాలను భారత్ రద్దు చేసింది. ప్రతిగా పాకిస్థాన్ కూడా భారత వీసాలను రద్దు చేసింది. ఇరు దేశాలు ప్రత్యర్థి దేశాల పౌరులు దేశాన్ని వీడి వెళ్లాలని గడువును విధించాయి. పాక్ గగన తలంపై భారత విమానాలను నిషేధించింది. భారత్‌తో అన్ని రకాల వాణిజ్య సంబంధాలను బంద్ చేసింది. భారత్‌పై అణు బాంబులు వేస్తామని పాక్ మంత్రులు హెచ్చరించారు.
- **ఏప్రిల్ 25 :** నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ విచ్చలవిడిగా కాల్పులు జరపడం ప్రారంభించి సరిహద్దుల్లో ఉద్రిక్తతను పెంచింది. సంయమనం పాటించాలని అమెరికా సహా ఇతర దేశాలు పాక్‌కు సూచించాయి.
- **ఏప్రిల్ 30 :** సరిహద్దుల వెంబడి పాక్ వరుసగా ఐదో రోజూ రాత్రి కాల్పులు జరిపింది. మరో 24 నుంచి 36 గంటల్లో భారత్ తమపై మిలిటరీ దాడి చేస్తుందన్న కచ్చితమైన సమాచారం ఉందని పాక్ సమాచార మంత్రి అట్టాఉల్లా తరార్ ప్రకటించారు.
- **మే 1 :** భారత్-పాక్ సంయమనం పాటించాలని ఇరు దేశాల సీనియర్ అధికారులతో మాట్లాడానని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రకటించారు.
- **మే 3 :** 450 కి.మీ సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణిని పాక్ పరీక్షించింది. తమ దేశం మీదుగా పాక్‌కు విమానాలు వెళ్లకుండా భారత్ గగనతలాన్ని మూసివేసింది. పాక్ నౌకలు భారత పోర్టులకు రాకుండా నిషేధించింది.
- **మే 7:** ఉగ్రదాడికి బదులు ఇచ్చేందుకు వ్యూహ రచన చేసిన భారత ఆర్మీ మే 6న అర్ధరాత్రి దాటాక ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. 1.04 గంటలకు పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో పలువురు ఉగ్ర నేతలతో పాటు అనేక మంది ఉగ్రవాదులు చనిపోయారు.
- **మే 8 :** జమ్మూ కశ్మీర్, పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో మే 8న రాత్రి డ్రోన్లు, భారీ శతఘ్నులతో పాకిస్థాన్ దాడులు చేసింది. వాటిని సమర్థంగా తిప్పికొట్టిన భారత్.. బలమైన ప్రతీకార దాడులు చేసింది. సియాల్‌కోట్, ఇస్లామాబాద్‌లో భారత్ డ్రోన్ దాడులు చేసింది. పాక్ ప్రధాని ఇంటి సమీపంలో పేలుడు సంభవించింది.
- **మే 9 :** పాకిస్థాన్ దాడులకు బదులిచ్చే క్రమంలో ఆ దేశ గగన తల రక్షణ వ్యవస్థ హెచ్‌క్యూ-9బీ ను భారత్ ధ్వంసం చేసింది. ఉద్రిక్తతల నేపథ్యంలో టీ-20 మ్యాచ్‌లను వారం పాటు భారత్ రద్దు చేసింది.
- **మే 9 రాత్రి:** ఆయుధాలు, మందుగుండుతో కూడిన అనేక డ్రోన్లతో పాటు ఫతా క్షిపణులతో పశ్చిమ సరిహద్దుల వెంట ఉన్న 26 ప్రాంతాల్లో పాక్ దాడులకు తెగబడింది.
- **మే 9 అర్ధరాత్రి:** పాక్ చర్యకు దీటైన జవాబిచ్చే క్రమంలో ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో భారత ఆర్మీ భారీ దాడులు చేసింది. సియాల్‌కోట్, అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి ఉన్న పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి.
- **మే 10 ఉదయం:** పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ సహా 8 ప్రధాన ఎయిర్‌బేస్‌లను భారత్ ధ్వంసం చేసింది. స్కర్దూ, బొలారీ, సర్గోంధా సహా మరో 8 ప్రాంతాల్లో ఎయిర్‌స్ట్రిప్‌లు నాశనమయ్యాయి.
- **మే 10 మధ్యాహ్నం:** దాడుల విషయంలో సంయమనం పాటించాలని భారత్, పాక్ ప్రధాన మంత్రులు, రక్షణ శాఖ సలహాదారులతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చర్చలు జరిపారు.
- **మే 10 మధ్యాహ్నం 3.35 గంటలు :** పాకిస్థాన్ మిలిటరీ డైరెక్టర్ జనరల్ భారత్ వైపునకు వచ్చి చర్చలు జరిపారు.
- **మే 10 సాయంత్రం 5 గంటలు :** ఇరు దేశాల మధ్య చర్చల అనంతరం భారత్ కాల్పుల విరమణను ప్రకటించింది.

ఐదుగురు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు హతం

'కాందహార్ విమాన' హైజాక్ సూత్రధారి కూడా..

» ఆపరేషన్ సిందూర్‌లో మట్టుబెట్టిన భారత సైన్యం

» అంత్యక్రియల్లో పాల్గొన్న పాక్ అత్యున్నతాధికారులు

» పాక్ సైన్యం, ప్రభుత్వ ఉగ్ర లింకులు బట్టబయలు

న్యూఢిల్లీ, మే 10: ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఐదుగురు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి కూడా ఉన్నాడు. ఈ ఐదుగురూ పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తాయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థల్లో కీలక పాత్ర పోషించారు. వీరికి పాకిస్థాన్ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. వీరి అంత్యక్రియల్లో పాక్ అత్యున్నతస్థాయి మిలిటరీ, సివిల్ అధికారులు పాల్గొనడంతో పాక్ మిలిటరీతోనూ, పాక్ ప్రభుత్వంతోనూ ఉగ్రవాదులకు ఉన్న సంబంధాలు బట్టబయలయ్యాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈనెల 7న పాకిస్థాన్, పీవోకే(పాక్ ఆక్రమిత కశ్మీర్)లలో భారత సైన్యం నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వారిలో ఐదుగురు మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదులు ఉన్నట్టు తాజాగా వెల్లడైంది. వీరిలో ఒక ఉగ్రవాది శవపేటికపై పాకిస్థాన్ జెండాను కప్పి ఉంచిన ఫొటోపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఉగ్రవాద లింకులకు ఇది తిరుగులేని సాక్ష్యంగా నిలుస్తుందని భావిస్తున్నారు.

హతమైన ఉగ్రవాదులు వీరే..

ముదస్సర్ ఖాదియాన్ ఖాస్: ఇతను లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థకు చెందినవాడు. ఇతన్ని ముదస్సర్, అబూ జుందాల్ అని కూడా పిలుస్తుంటారు. ఇతను పాకిస్థాన్‌లోని మురిద్కేలో ఉన్న తాయిబా మర్కజ్ కార్యకలాపాలు నిర్వహించేవాడు. ఇది భారత సరిహద్దుకు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఒకప్పుడు లష్కరే తాయిబా ప్రధానకార్యాలయం. ముంబై ఉగ్రదాడి నిందితులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ కూడా ఇక్కడే ఉగ్రశిక్షణ పొందారు. ముదస్సర్ అంత్యక్రియల్లో పాకిస్థాన్ ఆర్మీ గౌరవ వందనం సమర్పించింది. అత్యున్నతస్థాయి మిలిటరీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. పాక్ ఆర్మీచీఫ్ జనరల్ అసిం మునీర్, పాకిస్థాన్‌లోని పంజాబ్ ముఖ్యమంత్రి మర్యం నవాజ్‌ల తరఫున ఉన్నతాధికారులు ఇతని మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. ఇతని అంత్యక్రియల సందర్భంగా ఒక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రార్థనలకు అంతర్జాతీయ ఉగ్రవాది, జమాత్-అల్-దవాకు చెందిన హఫీజ్ అబ్దుల్ రౌఫ్ నేతృత్వం వహించాడు.

హఫీజ్ ముహమ్మద్ జమీల్: జైషే మహ్మద్(జేఈఎం) ఉగ్రవాద సంస్థకు చెందినవాడు. జేఈఎం వ్యవస్థాపకుడు, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మౌలానా మసూద్ అజర్‌కు ఇతను పెద్ద బావమరిది. బహవల్‌పూర్‌లోని సుభాన్ అల్లా మర్కజ్ ఇతని నిర్వహణలోనే ఉంది. జేఈఎం ఆర్థిక కార్యకలాపాలు, యువతకు ఉగ్రవాదం నూరిపోయడంలోనూ కీలక పాత్ర పోషించాడు.

మొహమ్మద్ యూసుఫ్ అజర్: జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందినవాడు. ఇతన్ని ఉస్తాద్ జీ, మొహమ్మద్ సలీం, ఘోసీ సాహెబ్ అని కూడా పిలుస్తుంటారు. ఇతను కూడా మసూద్ అజర్‌కు బావమరిది. జేఈఎం ఆయుధ శిక్షణ కార్యక్రమాల బాధ్యతలు నిర్వర్తించేవాడు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన అనేక ఉగ్రదాడుల్లో ఇతని ప్రమేయం ఉంది. భారత హోంశాఖ రూపొందించిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో ఇతని పేరు 21వ స్థానంలో ఉంది. ఇతను కాందహార్ విమానం(ఐసీ-814) హైజాక్ సూత్రధారి కూడా. 1999లో కట్మాండు నుంచి ఢిల్లీకి వస్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని గాల్లో ఉండగానే ఉగ్రవాదులు హైజాక్ చేసి కాదహార్‌కు తరలించారు. ప్రయాణికులను చంపేస్తామని బెదిరించి భారత జైళ్లలో ఉన్న మసూద్ అజర్‌తో పాటు ఒమర్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్ అనే ఉగ్రవాదులను విడిపించుకున్నారు.

ఖాలిద్ అలియాస్ అబూ అకషా: లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థకు చెందినవాడు. జమ్మూకశ్మీర్‌లో అనేక ఉగ్రవాద ఆపరేషన్లు నిర్వహించాడు. అఫ్ఘానిస్థాన్ ఆయుధాల స్మగ్లింగ్‌లోనూ ఇతని పాత్ర ఉంది. ఫైసలాబాద్‌లో నిర్వహించిన ఇతని అంత్యక్రియల్లో పాకిస్థాన్ మిలిటరీ సీనియర్ అధికారులతోపాటు ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ పాల్గొన్నారు.

మొహమ్మద్ హస్సన్ ఖాన్: జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందినవాడు. జేఈఎం పీవోకే కమాండర్ ముఫ్తీ అజ్గర్ ఖాన్ కశ్మీరీ కుమారుడు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రకుట్రల్లో కీలకంగా వ్యవహరించేవాడు.





భారత్ చర్యలతో పాక్‌కు పెద్ద దెబ్బ

సింధు జలాల ఒప్పందం రద్దు.. ఎగుమతులు/దిగుమతులపై నిషేధం

ఉగ్రవాద శిబిరాల ధ్వంసం.. పాక్ వాయుసేనకు భారీ దెబ్బ

(సెంట్రల్ డెస్క్)

పహల్గాంలో జేష్-ఎ-మహమ్మద్(జేఈఎం) అనుబంధ సంస్థ ద రెసిస్టెన్స్ ఫోర్స్(టీఆర్ఎఫ్) చేసిన మారణకాండకు దాయాది దేశం పాకిస్థాన్ భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 'ఆపరేషన్ సిందూర్'తో పాక్‌కు చావు తప్పి.. కన్ను లొట్టపోయినంత పనైంది. పహల్గాం దాడి జరిగిన నాటి(ఏప్రిల్ 22) నుంచి.. శనివారం సాయంత్రం కాల్పుల విరమణ ప్రకటన వరకు పాకిస్థాన్‌కు జరిగిన నష్టంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

సింధు జలాలు దూరం

పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండ జరిగిన తర్వాతి రోజే.. పాకిస్థాన్‌పై చర్యలకు భారత్ సిద్ధమైంది. గత నెల 23న సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. భారత్‌లో ఉంటున్న పాక్ పౌరుల వీసాలను తక్షణం రద్దు చేసింది. పాకిస్థాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేసి, ఎగుమతులు/దిగుమతులపై నిషేధం విధించింది. ఈ నిర్ణయాలతో.. పాక్ జీడీపీకి 25% వాటాను అందిస్తున్న సింధ్, పంజాబ్ రాష్ట్ర వ్యవసాయం కుంటుపడిపోనుంది.

'ఆపరేషన్ సిందూర్'తో అతలాకుతలం

ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాటాక.. అంటే.. 7వ తేదీ తెల్లవారుజామున భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించి, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే), పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను తుత్తునియలు చేసింది. ఈ దాడుల్లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 70 మంది మరణించినట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత.. ఆ సంఖ్య 100కు పెరిగినట్లు వివరించింది. ఆ మర్నాడు(8వ తేదీ) భారత్‌లోని వైమానిక స్థావరాలను టార్గెట్‌గా చేసుకుని పాక్ క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. దీన్ని భారత్ అడ్డుకుని, పాకిస్థాన్‌లోని 4 ఎయిర్ డిఫెన్స్ సైట్లను డ్రోన్లతో ధ్వంసం చేసింది. లాహోర్, కరాచీ, రావల్పిండిలోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ధ్వంసమవ్వగా.. రావల్పిండిలో జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ క్రికెట్ మ్యాచులు రద్దయ్యాయి. శుక్రవారం కూడా పాకిస్థాన్‌ను టార్గెట్‌గా చేసుకుని, భారత్ క్షిపణిదాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం ఉదయం కూడా..8 వైమానిక స్థావరాలపై దాడి చేసినట్లు భారత్ ప్రకటించగా.. సాయంత్రానికి ఇరువైపుల నుంచి కాల్పుల విరమణ ప్రకటనలు వచ్చాయి. భారత్ దాడుల కారణంగా.. పాక్ తన విస్తీర్ణంలో 44% ఉన్న బలూచిస్థాన్‌పైనా పట్టు కోల్పోయే పరిస్థితి నెలకొంది. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) గురు, శుక్ర వారాల్లో పాక్ సైన్యాన్ని తరిమికొట్టి, క్వెట్టా సహా పలు నగరాలపై బీఎల్ఏ పట్టు సాధించింది.

పాక్ ఎయిర్‌బేస్‌లపై దాడి

8 కీలక ప్రాంతాల్లో క్షిపణులతో భారత్ దాడి.. సైనిక స్థావరాలు, రాడార్ స్టేషన్లు, ఆయుధాగారాల ధ్వంసం

- ఆయుధ డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాక్ యత్నం.. అడ్డుకున్న భారత్
- లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ, వాయుసేన వింగ్ కమాండర్ వ్యోమిక
- సరిహద్దుల వెంట పాక్ కాల్పులు
- రెండేళ్ల చిన్నారి సహా ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, మే 10: డ్రోన్లు, క్షిపణులతో దాడికి ప్రయత్నించిన పాకిస్థాన్ ఆర్మీ స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఢిల్లీ, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో భారత మిలటరీ స్థావరాలపై దాడికి ప్రయత్నించగా.. భారత వాయుసేన దీటుగా బదులిచ్చింది. పాకిస్థాన్‌లోని రఫీఖీ, మురిద్, చక్లాలా, రహీమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియన్, పర్సుర్, సియాల్‌కోట్‌లో ఉన్న సైనిక స్థావరాలు, రాడార్ స్టేషన్లు, ఆయుధాగారాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లను క్షిపణులతో ధ్వంసం చేసింది. ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ, వైమానిక దళం వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ శనివారం ఉదయం మీడియా సమావేశంలో వెల్లడించారు. భారత్‌లోని పౌర ప్రాంతాలపై పాకిస్థాన్ యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్షిపణులు, లాయిటరింగ్ మ్యునిషన్లతో దాడికి ప్రయత్నించిందని.. భారత్ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఉదంపూర్, పఠాన్‌కోట్, ఆదంపూర్, భుజ్ ప్రాంతాల్లోని వాయుసేన స్థావరాలకు స్వల్పంగా నష్టం జరిగిందని వివరించారు. కానీ ఆదంపూర్‌లో ఎస్-400 రక్షణ వ్యవస్థను, సూరత్‌ఘడ్, సిర్సా వాయుసేన స్థావరాలను, నగ్రోటాలోని బ్రహ్మోస్ స్థావరాన్ని ధ్వంసం చేసినట్టు పాక్ దుష్ప్రచారానికి దిగిందని.. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. ఇక పాక్ సైన్యం జమ్మూకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లోని పౌర ప్రాంతాలపై దాడులు చేసిందని విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రీ తెలిపారు. ఒక ఆస్పత్రి, పాఠశాలపైనా ఈ దాడులు జరిగాయని, ఇది పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ఈ క్రమంలోనే భారత్ దీటుగా బదులిచ్చిందని, పాక్ సైన్యానికి భారీగా నష్టం జరిగిందని వివరించారు.



సరిహద్దులో పాక్ బంకర్లను ధ్వంసం చేశామని పేర్కొంటూ ఎక్స్ ఖాతాలో భారత ఆర్మీ పోస్ట్ చేసిన ఫొటో



పూంచ్ సెక్టార్‌లో పాక్ బలగాల దాడికి ధ్వంసమైన ఇల్లు

ఢిల్లీపై క్షిపణి దాడి.. మధ్యలోనే ధ్వంసం

శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సరిహద్దులకు సమీపంలోని కీలక నగరాలపై భారీ దాడులకు పాకిస్థాన్ ప్రయత్నించింది. జమ్మూ, శ్రీనగర్, అమృత్‌సర్, పఠాన్‌కోట్, ఉధంపూర్, జలంధర్, ఫిరోజ్‌పూర్, హోషియార్‌పూర్, జైసల్మేర్, బర్మార్ పట్టణాలపై స్వల్ప శ్రేణి ఫతా-1 క్షిపణులు, ఆయుధ డ్రోన్లతో దాడులు చేసింది. ఆ పట్టణాల్లో ప్రజలు ఉదయం పేలుళ్ల చప్పుళ్ల మధ్య నిద్రలేచారు. పాక్ క్షిపణులు, డ్రోన్లను ఎస్-400, ఆకాశ్ క్షిపణులతో కూడిన భారత గగనతల రక్షణ వ్యవస్థ చాలా వరకు అడ్డుకుని ధ్వంసం చేసింది. ముఖ్యంగా పాక్ నుంచి ఢిల్లీ వైపు దూసుకువస్తున్న ఫతా-2 బాలిస్టిక్ క్షిపణిని ఎస్-400 వెంటనే గుర్తించి... పంజాబ్‌లోని సిర్సా ప్రాంతంలో గగనతలంలోనే పేల్చివేసింది. దీంతో.. ఢిల్లీలో అత్యవసర సన్నద్ధతను ముమ్మరం చేశారు. ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు షెల్టర్లను సిద్ధం చేశారు. జమ్మూకశ్మీర్ నుంచి రాజస్థాన్ వరకు చాలా ప్రాంతాల్లో పాక్ డ్రోన్లు, క్షిపణులకు సంబంధించిన శకలాలు పడ్డాయి. ప్రఖ్యాత దాల్ సరస్సులో ఓ క్షిపణి కూలిపోయింది.



పాక్ కాల్పుల్లో ఐదుగురు పౌరుల మృతి

ఎల్వోసీ, అంతర్జాతీయ సరిహద్దుల వెంట పాక్ సైన్యం విచ్చలవిడిగా శతఘ్నులు, మోర్టార్లతో కాల్పులు జరిపింది. ఈ దాడుల్లో రాజౌరీ పట్టణ అదనపు జిల్లా అభివృద్ధి కమిషనర్ రాజ్‌కుమార్ థాపా, రెండేళ్ల చిన్నారి ఆయేషా నూర్, మహ్మద్ సాహిబ్ (35), పూంఛ్ సెక్టార్‌లోని కాంగ్రా గల్హుటా గ్రామంలో రషీదా బీ (55), ఆర్ఎస్ పురా సెక్టార్‌లోని బీదిపూర్ గ్రామంలో అశోక్‌కుమార్ అనే వ్యక్తి మృతి చెందినట్టు జమ్మూకశ్మీర్ అధికారులు ప్రకటించారు. ఈ మూడు చోట్ల పదుల సంఖ్యలో పౌరులు గాయపడినట్టు వివరించారు. మరోవైపు పాక్ కాల్పుల్లో ఆర్ఎస్ పురా సెక్టార్‌లో 8 మంది బీఎస్ఎఫ్ జవాన్లు గాయపడినట్టు అధికారులు ప్రకటించారు. అదే సమయంలో పాక్‌లోని లూని ప్రాంతంలో ఉగ్రవాదుల స్థావరాన్ని ధ్వంసం చేశామని తెలిపారు.

ఆ ఆరు స్థావరాలు.. పాక్‌కు కీలకం

పాకిస్థాన్‌కు అత్యంత కీలకమైన, కొన్ని ప్రత్యేక అవసరాల కోసం వినియోగించుకునే మిలటరీ స్థావరాలు, ఎయిర్‌బేస్‌లను ఎంచుకుని మరీ భారత్ శనివారం తెల్లవారుజామున దాడి చేసిందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. దీనితోనే పాక్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలి, వెనక్కి తగ్గేందుకు కారణమైందని పేర్కొన్నాయి. భారత్ దాడి చేసిన పాక్ ముఖ్య స్థావరాలు, వాటి ప్రత్యేకతలేవంటే..

- **రావల్పిండిలోని చక్లాలా ఎయిర్‌బేస్:** పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోని మిలటరీ ఎయిర్‌బేస్ ఇది. యుద్ధ విమానాలు.. ప్రభుత్వాధినేతలు, వీఐపీల రాకపోకలకు దీనిని వినియోగిస్తారు. 1965, 1971 యుద్ధాల వేళ ఈ ఎయిర్‌బేస్ కార్యకలాపాలు పాక్‌కు కీలకంగా నిలిచాయి.
- **మురిద్ ఎయిర్‌బేస్:** పాక్ డ్రోన్ దాడులు, నిఘా కోసం వినియోగించే కీలక ఎయిర్‌బేస్ ఇది. గత రెండు, మూడు రోజులుగా ఇక్కడి నుంచే వందల కొద్దీ ఆయుధ డ్రోన్లను భారత్‌పైకి ప్రయోగించింది.
- **రఫీఖి ఎయిర్‌బేస్:** పాక్ జేఎఫ్-17, మిరేజ్ యుద్ధ విమానాలను, రవాణా హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచే స్థావరం ఇది. అటు జమ్మూకశ్మీర్ నుంచి ఇటు గుజరాత్ వరకు.. వేగంగా చేరుకునేలా మధ్యలో ఉండటం కూడా కీలక అంశం.
- **రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్:** సరిహద్దులకు సమీపంలో, భారత్‌లో ఎక్కువ దూరం దాడులు చేయడానికి వీలుగా ఉన్న పాక్ వైమానిక దళ స్థావరం ఇది.
- **సుక్కుర్ ఎయిర్‌బేస్:** పాక్‌లోని కరాచీ, హైదరాబాద్ నగరాల మధ్య సింధ్ ప్రాంతంలో ఉన్న కీలక స్థావరం ఇది. ఇక్కడ ఎఫ్-16 యుద్ధ విమానాలతో కూడిన ప్రత్యేక దళం సిద్ధంగా ఉంటుంది.
- **చునియన్ ఎయిర్‌బేస్:** లాహోర్‌కు సమీపంలోని ఈ వైమానిక దళ స్థావరం.. పాక్ ప్రధాన ఎయిర్‌బేస్‌లలో ఒకటి. కీలక నిఘా, రక్షణ వ్యవస్థలను ఇక్కడ మోహరిస్తారు.

అప్పు కోసం.. పాక్ తప్పుకొందా?

- ఉన్నపళంగా కాల్పుల విరమణ పాటించాలి
- రుణం ఇచ్చేందుకు దాయాది దేశానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి షరతు?
- ఆపై అమెరికా ఒత్తిళ్ల ప్రభావం
- ఇప్పటికే దివాలా అంచుల్లో ఉన్న పాక్
- ఐఎంఎఫ్ రుణం అందకుంటే అధోగతే!

న్యూఢిల్లీ, మే 10: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరి, ఇక పూర్తిస్థాయి యుద్ధం తప్పదేమోనన్న పరిస్థితుల్లో... కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటూ ఒక్కసారిగా ఇరు దేశాల నుంచి ప్రకటన వెలువడింది. దాడుల విషయంలో పాక్‌కు తగిలిన వరుస ఎదురుదెబ్బలకు తోడు అప్పు కోసం ఆ దేశం తిప్పలు, అమెరికా ఒత్తిళ్లు దీనివెనుక ఉన్నట్టు సమాచారం. ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఇవ్వబోయే సుమారు రూ. 8,500 కోట్ల (బిలియన్ డాలర్ల) రుణమే కీలకం. శుక్రవారమే దీనిపై సమీక్షించిన ఐఎంఎఫ్.. భారత్ వ్యతిరేకత వ్యక్తం చేసినా, పాక్‌కు రుణం మంజూరు చేసేందుకు అంగీకరించింది. కానీ భారత్‌తో యుద్ధం విషయంలో వెనక్కి తగ్గాలని, వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని షరతు పెట్టినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఇండియా టీవీ ఈ మేరకు కథనం ప్రచురించింది. ఐఎంఎఫ్ అమెరికా చెప్పుచేతల్లో ఉంటుంది. ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌తో మాట్లాడిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో.. రుణం కావాలంటే కాల్పుల విరమణ పాటించాలని పాక్‌కు స్పష్టం చేసినట్టు సమాచారం. వారు ఇదే విషయంపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు వివరించి భారత ప్రభుత్వాన్ని ఒప్పించినట్టు తెలుస్తోంది.

అప్పుల కుప్పగా మారి.. దివాలా అంచుల్లో..

పాకిస్థాన్ కొన్నాళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. అప్పులు భారీగా పేరుకుపోయాయి. ఐఎంఎఫ్‌కు ఇప్పటికే రూ.52 వేల కోట్లు (602 కోట్ల డాలర్లు) బాకీ ఉంది. ప్రపంచ బ్యాంకుకు ఏకంగా రూ.4 లక్షల కోట్లకు (48 బిలియన్ డాలర్లు)పైగా చెల్లించాలి. పాక్ మొత్తం అప్పు సుమారు రూ.11 లక్షల కోట్లకు (130 బిలియన్ డాలర్లు)పైనే ఉంటుందని అంచనా. అప్పులపై వడ్డీలు చెల్లించడానికి కూడా దాయాది దేశం దగ్గర డబ్బుల్లేని పరిస్థితి. ఇప్పుడు ఐఎంఎఫ్ రుణం ఇవ్వకుంటే.. పాక్ దివాలా తీయడం ఖాయం. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధం చేయలేక పాక్ చేతులు ఎత్తేసిందని నిపుణులు చెబుతున్నారు.

తడబాటు లేదు.. గడబిడా లేదు!

పట్టు సడలించకుండా భారత్ దూకుడు.. పాక్‌కు ఊపిరి సలపనివ్వని వైనం

- శత్రుభూభాగంలోకి చొరబడి మరీ క్షిపణుల వర్షం
- పాక్ ఆయుధ, రక్షణ వ్యవస్థలు నిర్వీర్యం
- నిర్మాణాత్మకంగా సంపూర్ణ యుద్ధానికి సన్నద్ధం
- ఎట్టకేలకు కాళ్లబేరానికి దిగొచ్చిన శత్రువు

ఇక ధర్మపన్నాలు చెప్పడం ఉండదు.. సరిహద్దులు దాటి వెళ్లకూడదన్న ఆంక్షలూ ఉండవు.. దాడికి ప్రతిదాడి మాత్రమే చేస్తామని గిరిగీసుకుని కూర్చోరు.. శత్రువు భూభాగంలోకి చొరబడి మరీ నాశనం చేయగలమని భారత్ రుజువు చేసింది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసి.. భారీ సంఖ్యలో టెర్రరిస్టులను హతమార్చడంతోనే సంతృప్తి చెందలేదు. ఆత్మరక్షణ కోసం శత్రువుల క్షిపణులు, డ్రోన్లను ధ్వంసం చేస్తూనే.. పాక్‌పై వజ్రాయుధాలతో విరుచుకుపడింది. ఆ దేశ సైన్యానికి ఆయువుపట్టయిన రావల్పిండి హెడ్‌క్వార్టర్స్‌పైనే బాంబులవర్షం కురిపించింది. పాక్ పాలక, విపక్షాలకు రాజకీయంగా కీలకమైన పంజాబ్, సింధ్ రాష్ట్రాలనూ వదల్లేదు. అక్కడి సైనిక, వైమానిక స్థావరాలను కూడా నేలమట్టం చేసింది. 'పాకిస్థాన్ వద్ద 130 అణు వార్‌హెడ్లు ఉన్నాయి. ఘోరీ, ఘజ్నవీ, షహీన్ క్షిపణులు ఉన్నాయి. అవన్నీ ప్రదర్శన కోసం కాదు. భారత్‌పై ప్రయోగించడం కోసమే' అని పాక్ పాలకుల బెదిరింపులను సైతం లెక్కచేయలేదు. అధునాతన టెక్నాలజీతో అభివృద్ధి చేసిన క్షిపణులు, బాంబుల సాయంతో పాక్ భూభాగంలోకి 80 కిలోమీటర్ల వరకు చొరబడి మరీ దాడులు చేసింది. పాక్ సైనిక పాటవం తన శక్తి సామర్థ్యాల ముందు ఎందుకూ కొరగాదని ప్రపంచ దేశాలకు సైతం చాటిచెప్పింది. పాక్‌కు తుర్కియే పంపిన డ్రోన్లు, క్షిపణులు, చైనా ఇచ్చిన జేఎఫ్-17 ఫైటర్ విమానాలనూ కూల్చివేసింది. ఆ దేశానికి అమెరికా విక్రయించిన ఎఫ్-16 యుద్ధవిమానాన్ని సైతం పడగొట్టింది. ప్రధాని మోదీపై అమెరికా ఎంత ఒత్తిడి తెచ్చినా తలొగ్గక తీసుకొచ్చిన సుదర్శన చక్రం 'ఎస్-400'.. తాజా సమరంలో భారత్ పాలిట తిరుగులేని అస్త్రంగా ఆవిర్భవించింది. శత్రువుల ఆయుధ వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే గాక.. భారత సేన, మిలిటరీ స్థావరాలు, పౌర ఆవాసాలకు నిజంగానే చక్రాయుధంలా రక్షణ కల్పించింది.

నిక్కచ్చి వ్యూహంతో..





పాకిస్థాన్‌పై భారత్ తాజాగా సాధించిన విజయం ఏదో ఆషామాషీగా వచ్చింది కాదు. పహల్గాంలో గత నెల 22న అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నది మొదలు.. వారినెలా మట్టుబెట్టాలి.. వారికి కోరలుపెట్టి పంపిన పాకిస్థాన్ మెడలు ఎలా వంచాలన్నదే మన వ్యూహకర్తల ఏకైక లక్ష్యమైంది. ఇందుకోసం త్రివిధ దళాలను పూర్తిగా సన్నద్ధం చేసి.. ముప్పేట దాడితో శత్రువుకు ఊపిరి సలపకుండా చేశారు. ఇరవై రోజులుగా వేదన పడుతున్న ప్రజలకు.. కేవలం వంద గంటల యుద్ధంతో సాధించిన విజయంతో ఎంతో సాంత్వన కల్పించారు. చైనా, తుర్కియే దేశాలిచ్చిన ఆయుధ, రక్షణ వ్యవస్థలను చూసుకుని విర్రవీగిన పాక్‌ను కోలుకోలేని దెబ్బకొట్టారు. ఉగ్రవాద కర్మాగారాలనే గాక.. ఏకంగా వైమానిక, సైనిక స్థావరాలనే ధ్వంసం చేసి కాళ్లబేరానికి తీసుకొచ్చారు. కాల్పుల విరమణకు అంగీకరిస్తూనే.. భవిష్యత్‌లో ఇలాంటి దుందుడుకు చర్యలకు దిగితే యుద్ధచర్యగానే పరిగణించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఐదేళ్లుగా శాంతి పరిఢవిల్లుతున్న జమ్మూకశ్మీరును కల్లోలపరిచే లక్ష్యంతో పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాదులు ఏప్రిల్ 22న.. భూతల స్వర్గంగా భావించే పహల్గాంలో విహారయాత్రకు వచ్చిన పర్యాటకులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. మతం పేరడిగి మరీ.. వారి భార్యాబిడ్డల కళ్లెదుటే చంపేశారు. 26 మందిని హత్యచేసిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనతో యావత్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో ఉగ్రవాదులు సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. దాని తర్వాత పహల్గాం దాడిలోనే ఇంత ప్రాణనష్టం జరిగింది.

ఈ ఉగ్ర చర్యకు పాల్పడింది తామేనని లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ప్రకటించింది. అయితే పాక్ మాత్రం తమ దేశానికి చెందిన ఎవరి ప్రమేయమూ లేదని.. భారత్ సేనలే అమాయక టూరిస్టులను చంపాయని దుష్ప్రచారానికి ఒడిగట్టింది. హంతకులు ఎక్కడున్నా వేటాడి వెలికి తీసుకొస్తామని.. ఊహకైనా అందని రీతిలో శిక్షిస్తామని ప్రధాని మోదీ హెచ్చరించారు. అటు రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ).. ఉగ్ర దాడిలో పాల్గొన్న పాకిస్థానీల పూర్వాపరాలను, ఎక్కడెక్కడ స్కెచ్ వేశారో కూడా కనిపెట్టింది. ఇదే సమయంలో ఉగ్రమూకలకు, పాక్‌కు బుద్ధి చెప్పేందుకు మోదీ ప్రభుత్వం కూడా సన్నాహాలు ప్రారంభించింది. అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి.. ఉగ్రదాడి వివరాలను తెలియజేసింది. ప్రభుత్వం తీసుకునే ఎలాంటి చర్యనైనా సమర్థిస్తామని అన్ని పార్టీలూ ప్రకటించాయి. తొలుత మోదీ సర్కారు సంయమనంతోనే వ్యవహరించింది. సింధు జలాల ఒప్పందం సస్పెన్షన్, దౌత్య ఆంక్షల వంటి చర్యలకే పరిమితమైంది. కానీ పాక్ పాలకుల 'అణు' రంకెలతో సైనిక చర్యకు కూడా సమాయత్తమైంది. త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ప్రకటించింది. సరిహద్దుల వెంబడి గస్తీని పెంచింది. రక్షణ, ఆయుధ వ్యవస్థలను నిర్దేశిత ప్రాంతాల్లో మోహరించింది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరుల్లో ఉగ్రవాద శిబిరాలు ఎక్కడెక్కడున్నాయో నిఘా సంస్థలు నిక్కచ్చిగా గుర్తించాయి కూడా. అటు పాకిస్థాన్ ఈ ఘటనతో తనకు సంబంధం లేదని.. తనను తాను ఉగ్రవాద బాధిత దేశంగా చెప్పుకొనేందుకు విఫల యత్నం చేసింది. పాక్ సహాయ నిరాకరణతో ఓపిక నశించిన భారత్.. 'ఆపరేషన్ సిందూర్'కు శ్రీకారం చుట్టింది.

ఉగ్ర స్థావరాల నేలమట్టం

ఏడో తేదీ (మంగళవారం) అర్ధరాత్రి దాటిన తర్వాత పీవోకే, పాకిస్థాన్‌లోని బహావల్పూర్, మురిడ్కేల్లో లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర స్థావరాలను భారత సైన్యం నేలమట్టం చేసింది. దరిదాపుగా 150 మంది ఉగ్రవాదులు హతమైనట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. మరో 70 మంది గాయపడ్డారు. మృతుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు పది మంది, అతడి సన్నిహితులు మరో నలుగురు ఉండడం గమనార్హం. ఎక్కడా గురి తప్పకుండా.. సైనిక స్థావరాలు, పౌర ఆవాసాలపై ప్రభావం లేకుండా.. కేవలం ఉగ్ర స్థావరాలపైనే సైన్యం దాడులు చేసింది. 14 రోజుల్లో తిరుగులేని ప్రతీకారం చేసింది.

- సెంట్రల్ డెస్క్

సరిహద్దు గ్రామాలపై పాక్ గుళ్ల వర్షం

తీవ్ర స్థాయిలో జరిగిన నష్టంతో విచక్షణ కోల్పోయిన పాక్ సేనలు.. మర్నాడు కశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాలపై ఫిరంగి గుళ్ల వర్షం కురిపించాయి. అంతటితో ఆగకుండా బుధవారం (8వ తేదీ) అర్ధరాత్రి దాటగానే భారత్‌లోని 15 నగరాలను టార్గెట్ చేసి.. సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడికి విఫల యత్నం చేసింది. పెద్దఎత్తున దాడి చేస్తే భారత్ భయపడి కాల్పుల విరమణకు అంగీకరిస్తుందని పాక్ వేసిన అంచనా విఫలమైంది. అప్పటికే సర్వసన్నద్ధంగా ఉన్న భారత సైన్యం.. ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ సాయంతో డ్రోన్లను, క్షిపణులను తుత్తునియలు చేసింది. అంతేకాదు.. పాక్‌కు గుణపాఠం నేర్పేందుకు లాహోర్, సియాల్‌కోట్ సహా పాకిస్థాన్‌కు చెందిన తొమ్మిది ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై భీకర దాడులు చేసింది. శనివారం మరింత భీకర దాడికి భారత్ సన్నద్ధమైందన్న సమాచారంతో కాళ్ల కింద భూకంపం వచ్చినట్లయింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సమన్వయం చేయడంతో పాక్ అత్యున్నత సైన్యాధికారి ఒకరు.. భారత మిలిటరీ ఉన్నతాధికారులతో రహస్య చర్చలు జరిపారు. కాల్పుల విరమణకు ప్రాధేయపడ్డారు.



రాజ్‌భవన్‌లో జరిగిన ఇంటర్‌ఫెయిత్ సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, పాల్గొన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

దేశమే ముందు!

(మొదటి పేజీ తరువాయి)

కావాలి." అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన 'ఇంటర్ ఫెయిత్(సర్వమత) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదమని, దేశ అనిశ్చితికి.. ఆర్థిక ఇబ్బందులకు ఉగ్రవాదం, తీవ్రవాదం కారణమవుతున్నాయని పేర్కొన్నారు. "పహల్గాం ఉగ్రదాడి కేవలం పర్యాటకులపై జరిగింది కాదు. దేశ శాంతిసుస్థిరతలపై జరిగిన దాడి. కులమతాలకు అతీతంగా ఇలాంటి చర్యలను ఖండించాలి. దేశం కోసం పోరాడి మురళీనాయక్ వీరమరణం పొందటం బాధాకరం. మతవిద్వేషాలు లేని రాష్ట్రం మన ఏపీ. అందుకే ఇక్కడ అన్ని మతాల ప్రతినిధులతో కలసి సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. ఉగ్రవాదంపై పోరులో త్రివిధ దళాలకు మద్దతుగా ఉందాం. ఎట్టకేలకు రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రకటన ఈ సమావేశం జరిగే సమయంలో రావడం శుభపరిణామం. కాల్పులు విరమిద్దామని పాకిస్థాన్ కోరడంతో భారత్ అంగీకరించింది. కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి అండగా ఉంటుంది." అని చంద్రబాబు అన్నారు.

ఐక్యత చాటుదాం: పవన్ కల్యాణ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశానికి కష్టమొస్తే అందరం ఐక్యంగా ఉంటామని చాటేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. "కష్టకాలంలో అందరూ ఐక్యంగా ఉండటమే మన బలం. ఏదైనా సమస్య వస్తే దేశంలో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా ముందుకొస్తారు. అదే ఈ దేశ గొప్పతనం. ఎదుటివారు దాడి చేస్తే వాటిని ఎదుర్కోనేందుకు యుద్ధం తప్పదు. మన సైన్యానికి మనమంతా అండగా ఉండాలి." అని తెలిపారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. "ఏ మహిళలను ముష్కరులు కన్నీళ్లు పెట్టించారో అదే మహిళాశక్తిని ప్రపంచానికి చాటేందుకు ఇద్దరు మహిళా అధికారులను ముందుపెట్టి పాకిస్థాన్‌పై పోరు నడిపించడం గర్వించదగ్గ విషయం." అని అన్నారు.

త్యాగాలు చిరస్మరణీయం: గవర్నర్

అన్ని మతాలవారు కేంద్ర ప్రభుత్వానికి, సైన్యానికి సంపూర్ణ మద్దతు ప్రకటించడం చాలా సంతోషకర పరిణామమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ స్వాగతోపన్యాసం చేశారు. డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా.. భద్రతాదళాల సన్నద్ధతను వివరించారు. పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీ నాయక్‌కు మౌనం పాటించి నివాళులర్పించారు.

జాతీయ రక్షణ నిధికి అయ్యన్న విరాళం

» నెల జీతం రూ.2.17లక్షలు అందజేసిన స్పీకర్

నర్సీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రక్షణ నిధికి తన నెల వేతనం రూ.2.17లక్షలను విరాళంగా(ఆన్‌లైన్‌లో) అందజేసినట్టు ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్ల సంక్షేమానికి తన వంతు సాయంగా అందజేసినట్లు చెప్పారు.ఉగ్రవాద నిర్మూలనకు దేశ సాయుధ దళాలు చేస్తున్న పోరాటం ప్రతి భారతీయుడిలోనూ స్ఫూర్తిని రగిలిస్తోందని ఆయన పేర్కొన్నారు.



ఓ జవాన్ తల్లి కాళ్లను కడుగుతున్న సీఐ తబ్రేజ్

వీర జవాన్ల మాతృమూర్తులకు పోలీసుల పాదసేవ

» కాళ్లు కడిగి సెల్యూట్ చేసిన కోడుమూరు సీఐ, ఎస్ఐ

కోడుమూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న సైనికుల తల్లిదండ్రులను కర్నూలు జిల్లా కోడుమూరు పోలీసులు ఘనంగా సన్మానించారు. కోడుమూరుకు చెందిన జవాన్లు సునీల్‌బాబు, వినోద్ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా సరిహద్దుల్లో పోరాటం చేస్తున్నారు. మరో జవాన్ సునీల్ తన సెలవులు రద్దు చేసుకుని యుద్ధ క్షేత్రానికి బయలుదేరి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ తబ్రేజ్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆ జవాన్ల తల్లిదండ్రులకు శాలువా కప్పి, సెల్యూట్ చేశారు. సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఎర్రిస్వామి ఆ ముగ్గురు జవాన్ల మాతృమూర్తులు ఆదిలక్ష్మి, నాగమణి, లక్ష్మీదేవి పాదాలను కడిగి పాదసేవ చేశారు.

తిరుమలలో 'ఆపరేషన్ గరుడ'

» యాత్రికుల వసతి సముదాయంలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్



భక్తులు బస చేసే హాల్‌లో మాక్‌డ్రిల్‌లో భాగంగా ఉగ్రవాదిని టార్గెట్ చేస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

తిరుమల, మే 10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సామాన్యులు బస చేసే యాత్రికుల వసతి సముదాయం-3(పీఏసీ)లో ఆక్టోపస్ బలగాలు శనివారం 'ఆపరేషన్ గరుడ' పేరుతో మాక్‌డ్రిల్‌ను నిర్వహించాయి. అనుకోకుండా ఉగ్రవాదులు భక్తులను బంధిస్తే వారిని ఎలా రక్షించాలి, ఉగ్రవాదులను ఎలా అంతమొందించాలనే అంశాలపై అవగాహనకు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ముందుగా ఉగ్రవాదుల వేషధారణలో నలుగురు 'పాకిస్థాన్ జిందాబాద్, జీహాద్' అం టూ ఆయుధాలతో భవనంలోకి ప్రవేశించారు. వెంటనే విజిలెన్స్ సిబ్బంది ఆక్టోపస్ బేస్‌క్యాంప్‌కు సమాచారమిచ్చారు. వారు ఆయుధాలతో ఘటనాప్రాంతానికి చేరుకున్నారు. ముందుగా భవనం బ్లూప్రింట్‌ను పరిశీలించి బృందాలుగా విడిపోయారు. భవనం వెనుకభాగం నుంచి 2 బృందాలు, ముందు నుంచి మరో బృందం భవనంలోకి ప్రవేశించాయి. క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ ముందుకు సాగిన క్రమంలో 3 హాళ్లలో నక్కి ఉన్న ఉగ్రవాదులను అంతం చేశారు. సుమారు గంటన్నరపాటు ఈ డ్రిల్‌ను నిర్వహించారు.

కశ్మీర్ నుంచి ఢిల్లీకి ఏపీ విద్యార్థులు

» ఏపీ భవన్‌కు చేరుకున్న 41 మంది

న్యూఢిల్లీ, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో కశ్మీర్‌లో చదువుతున్న ఏపీ విద్యార్థులు తిరిగి వచ్చేస్తున్నారు. 41 మంది విద్యార్థులు శనివారం ఢిల్లీలోని ఏపీ భవన్‌కు చేరుకున్నారు. వీరిలో ఐదుగురు ఏపీలోని తమ స్వస్థలాలకు పయనమయ్యారు. కశ్మీర్ నుంచి ఢిల్లీ చేరుకున్న విద్యార్థులకు ఏపీ భవన్ వసతి, భోజన, రవాణా సదుపాయాలను కల్పిస్తోంది. పాక్ సరిహద్దు రాష్ట్రాల్లోని తెలుగు వారికి సాయం చేసేందుకు ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయం కోసం 011-23387089, 9871999430, 9871999053 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని అధికారులు సూచించారు.

అగ్నివీరా.. అమర్ రహే



అగ్నివీర్‌లో శిక్షణ పూర్తయిన తర్వాత మురళీనాయక్‌కు బ్యాడ్జి తగిలిస్తున్న తండ్రి శ్రీరామనాయక్(ఫైల్)

స్వగ్రామానికి మురళీనాయక్ పార్థివదేహం

» తల్లిదండ్రులకు అప్పగించిన సైనికాధికారులు
» బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి కళ్లి తండాకు
» మంత్రి సవిత, మహారాష్ట్ర మంత్రి నివాళి
» దారి పొడవునా భారీగా తరలివచ్చిన జనం
» సరిహద్దులో ఎంపీలు, ఎమ్మెల్యేల నివాళి
» నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
» హాజరుకానున్న కిషన్ రెడ్డి, పవన్, లోకేశ్



శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సర్కిల్‌లో మురళీనాయక్ పార్థివదేహం ఊరేగింపులో పాల్గొన్న జనం

పుట్టపర్తి/బెంగళూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ సైనికులతో పోరాడుతూ జమ్ముకశ్మీర్‌లో అమరుడైన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి శనివారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కళ్లి తండాకు తీసుకొచ్చారు. సైనికాధికారులు మురళీనాయక్ పార్థివదేహాన్ని ఆయన తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయికి అప్పగించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న మురళీనాయక్ గురువారం అర్ధరాత్రి రాజౌరి సెక్టార్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడైన సంగతి తెలిసిందే. ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో ఆయన పార్థివదేహాన్ని బెంగళూరు ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి సవిత, మహారాష్ట్ర నుంచి మంత్రి ఉదయ్ సామంత్ విమానాశ్రయంలో మురళీ నాయక్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. కర్ణాటక తరఫున దేవనహళ్లి తహసీల్దారు హాజరయ్యారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి రాష్ట్ర సరిహద్దు దాకా జీరో ట్రాఫిక్ మార్గం ఏర్పాటు చేసి పార్థివదేహాన్ని ఆర్మీ వాహన కాన్వాయ్‌లో తరలించారు. కాన్వాయ్ వెంట మంత్రి సవిత వచ్చారు.

దారి పొడవునా ఘన నివాళి

మధ్యాహ్నం రెండు గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ రాత్రి 9.30 గంటల వరకూ కొనసాగింది. దారి పొడవునా జనం పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. జాతీయ జెండాలు చేతబూని వాహనాలపై పూలు చల్లారు. యువకులు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీలు నిర్వహించారు. కర్ణాటకలో చిక్కబళ్లాపుర, బాగేపల్లి తదితర ప్రాంతాల్లో జై జవాన్, మురళీనాయక్ అమర్ రహే అంటూ ప్రజలు నినదించారు. బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి సహా వందలాది మంది తరలి వచ్చి నివాళులు అర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా సరిహద్దులో కొడికొండ చెక్‌పోస్టు వద్ద హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, పరిటాల సునీత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వేలాది మంది జనం కన్నీటి నివాళులు అర్పించారు.

మహారాష్ట్రలో మురళి విగ్రహం

మురళీనాయక్ విగ్రహాన్ని మహారాష్ట్రలో ఏర్పాటు చేయడానికి శివసేన పార్టీ తరఫున ప్రభుత్వంతో మాట్లాడుతామని ఆ రాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ తెలిపారు. కళ్లి తండాలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయిని పరామర్శించి ధైర్యం చెప్పారు. వీడియో కాల్‌తో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేతో మాట్లాడించారు. జవాన్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని, మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. మురళీనాయక్ మహారాష్ట్రలో జన్మించినందున తమ రాష్ట్రంలో విగ్రహం పెట్టడానికి ప్రయత్నిస్తామని ఉదయ్ సామంత్ అన్నారు.

నేడు అంత్యక్రియలు

మురళీనాయక్ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం కళ్లితండాలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, ఆర్డీఓ సువర్ణ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పెద్ద ఎత్తున జనం రానున్న నేపథ్యంలో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరజవాన్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్ తదితరులు హాజరవుతారు.



కళ్లితండాకు మురళీనాయక్ పార్థివదేహాన్ని తీసుకువస్తున్న పోలీసులు, ఆర్మీ అధికారులు



మురళీనాయక్ పార్థివదేహం వద్ద విలపిస్తున్న బంధువులు



కళ్లితండాలో ఇంటివద్ద మురళీ నాయక్ తల్లిదండ్రుల నిర్వేదం

'అవినీతి విజిలెన్స్'పై ఆర్టీసీ వేటు

కడప జోన్‌లో వీ అండ్ ఎస్‌వో రెహమాన్ సస్పెండ్

» సహకరించిన 9 మంది సిబ్బందిపైనా చర్యలు
» విజయవాడలో 'సరదా బుల్లోడు' వీఆర్‌కు
» వత్తాసు పలికిన ఏడీపైనా విచారణ, చర్యలకు రంగం సిద్ధం

అమరావతి, కడప మారుతీనగర్, మే 10(ఆంధ్రజ్యోతి): టాప్ గేర్‌లో అవినీతికి పాల్పడుతోన్న విజిలెన్స్ అధికారులు, సిబ్బందిపై ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. కింది స్థాయి సిబ్బందిని వేధించి, పీడిస్తోన్న అధికారిని సస్పెండ్ చేసింది. ఈ అవినీతిలో భాగస్వాములై వసూళ్లకు పాల్పడిన విజిలెన్స్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను సైతం ఇంటికి పంపించింది. చిన్న ఉద్యోగి నుంచి వితంతువు వరకూ ఎవ్వరినీ వదలకుండా నగదు కవర్లు, నోట్ల కట్టలు తీసుకుంటున్న విజిలెన్స్ అధికారుల్ని భరించలేక కింది స్థాయి సిబ్బంది ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన విజిలెన్స్ మహిళా అధికారి కడప, బెజవాడలో అంతా సవ్యంగా ఉందంటూ నివేదిక ఇచ్చారు. దీంతో బాధితుల ఆవేదనను 'కంచె.. మేస్తోంది' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించింది. స్పందించిన యాజమాన్యం నెల్లూరుకు చెందిన మరో అధికారితో పకడ్బందీ విచారణ జరిపించడంతో కడప జోన్ విజిలెన్స్ అధికారుల అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతి నెలా మామూళ్లు, సెలవు పెడితే డబ్బులు, ఆలస్యమైతే చర్యలు.. రద్దు చేసేందుకు లంచం, ఆఖరికి వితంతువును బ్లాక్ మెయిల్ చేసి రూ.5 లక్షలు గుంజిన వైనం ఆధారాలతో సహా నిరూపితమైంది. ఫోన్లో డబ్బులు అడిగిన వాయిస్ రికార్డుల నుంచి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిన స్క్రీన్ షాట్లు ఆధారాలుగా జతచేసి యాజమాన్యానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా కడప జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ముజిబుర్ రెహమాన్‌ను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సస్పెండ్ చేశారు. ఆయనకు సహకరించి అవినీతి అక్రమాల్లో భాగస్వాములైన హెడ్ కానిస్టేబుళ్లు కేవీ రెడ్డి(పులివెందుల), జీవీ గిరి రమణ (గుత్తి), ఆర్.శంకరయ్య(రాజంపేట), కానిస్టేబుళ్లు ఎన్‌పీఎల్ఎన్‌వీ ప్రసాద్(కడప), యూఎన్ఎస్ రెడ్డి (కదిరి), ఎ.మనోహర్(నంద్యాల), కేఆర్‌సీ రెడ్డి(నంద్యాల), ఆర్ఎంఎస్ నాయక్(కడప బస్టాండ్), పి.శ్రావణ్‌కుమార్(ఆర్టీసీ కడప జోనల్ వర్క్‌షాప్)లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వీరి అవినీతిలో భాగస్వామి అయిన వైద్యురాలు అపర్ణపైనా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఇదిలాఉండగా విజయవాడ జోన్‌లో ఇదేతరహా వ్యవహారాలు చేస్తోన్న ఎస్‌జేఏ దేవదాసన్ బాధితులు తమగోడు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకొచ్చారు. మద్యం బాటిళ్లకు సైతం ఆయన వేధిస్తున్న తీరు ఆధారాలతో సహా లభించడంతో 'సరదా బుల్లోడు' శీర్షికన వార్త ప్రచురితమైంది. విచారణకు ఆదేశించిన యాజమాన్యం పలు ఆధారాలు లభించడంతో దేవదాసన్‌ను పోస్టు నుంచి తప్పించి ఆర్టీసీ హౌస్‌లో వెయిటింగ్‌లోకి పంపింది. ఏపీఎస్ఆర్టీసీ చరిత్రలో విజిలెన్స్ అధికారులపై ఇంత భారీస్థాయిలో ఎన్నడూ చర్యలకు ఉపక్రమించని యాజమాన్యం తాజాగా తీసుకున్న నిర్ణయం పెద్ద చర్చనీయాంశమైంది.

విజిలెన్స్‌పై ఫిర్యాదుల వెల్లువ..

మనిషికి కళ్లు, చెవులు ఎంత ముఖ్యమో.. ఒక సంస్థకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతే ముఖ్యం. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా జరిగే సంస్థల్లో ఆ విభాగం మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రతి నెలా రూ.500కోట్ల ఆదాయం ఆర్జించే ఏపీఎస్ఆర్టీసీలో అదేమీ కనిపించడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఐజీ ర్యాంకు ఐపీఎస్ అధికారి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అధిపతిగా ఉండేవారు. జోన్లవారీగా డీఎస్పీ ర్యాంకు అధికారులు విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్లుగా ఉండేవారు. అప్పట్లో ప్రతి చిన్న లోపం గుర్తించి నివేదికలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపితే తక్షణమే చర్యలుండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఒక అడిషనల్ ఎస్పీ నేతృత్వంలో విజిలెన్స్ విభాగం నిద్రపోతోంది.

ఏడీకి రూ.3.50 లక్షలు..

ఏపీఎస్ఆర్టీసీ విజిలెన్స్‌లో ఏడీగా పనిచేస్తున్న మహిళా అధికారిపైనా అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి. కడప జోన్‌లో వచ్చిన ఫిర్యాదులపై విచారణకు వెళ్లిన ఆమె అవినీతి అధికారులకు క్లీన్ చిట్ ఇచ్చి చిక్కుల్లో పడ్డారు. పక్కా ఆధారాలు సమర్పించినా ఎందుకు చర్యలు తీసుకోలేదనే చర్చ ఆర్టీసీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దీంతో యాజమాన్యం విచారణకు ఆదేశించింది. ఒక ఉద్యోగి తొలగింపు వ్యవహారంలో ఆమె రూ.3.5 లక్షలు తీసుకున్నట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. జిల్లాల్లోని అధికారుల నుంచి మామూళ్లు తీసుకున్నారనే ఆరోపణలపైనా విచారణాధికారులు ఆధారాలు సేకరించి నివేదికతోపాటు యాజమాన్యానికి ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెపై నేడో, రేపో చర్యలు తప్పవనే ప్రచారం ఆర్టీసీ వర్గాల్లో వినిపిస్తోంది.

లిక్కర్ బాస్‌ల కోసం 'సిట్' వేట

3 రాష్ట్రాల్లో ముమ్మర గాలింపు

» అజ్ఞాతంలోనే ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో బాస్‌ల కోసం సిట్ అధికారులు వేట కొనసాగిస్తున్నారు. ఈ కేసులో అత్యంత కీలకమైన ముగ్గురి కోసం సిట్ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మాజీ సీఎం జగన్‌కు బంటుగా వ్యవహరించిన కృష్ణమోహన్‌రెడ్డి, అప్పటి కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ ఆర్థిక లావాదేవీలు చక్కబెట్టే ఆడిటర్ బాలాజీ గోవిందప్ప కోసం ప్రత్యేక బృందాలు మూడు రాష్ట్రాల్లో వెతుకుతున్నాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో ఎక్కడ దాక్కున్నారనే విషయంపై సమాచారం సేకరిస్తున్నారు. రూ.3వేల కోట్లకు పైగా జరిగిన ఈ మద్యం కుంభకోణంలో ఈ ముగ్గురినీ ఆదివారం విచారణకు రమ్మని సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయం నోటీసులు అందజేశారు. ఈ కుంభకోణంలో కింగ్ పిన్‌గా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డితో కలిసి అన్ని స్థాయిల్లోనూ వీరు చర్చలుజరిపారు. దీనికి సంబంధించి పక్కా ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి(ఏ-31), జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి(ఏ-32), ఆడిటర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33)ను నిందితుల జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన ముగ్గురూ మొదట హైకోర్టును ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. అయితే, వారికి అయా కోర్టుల్లో ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో సిట్ అధికారులు ఎప్పుడైనా అరెస్టు చేయొచ్చనే అనుమానంతో మరోసారి హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నెల 13న హైకోర్టులో పిటిషన్‌పై విచారణ ఉన్నందున 11న సిట్ ముందుకు వస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురి కోసం గాలిస్తున్న సిట్ అధికారులు శనివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. వనస్థలిపురంలోని నారాయణరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడకు వెళ్లారు. అదేవిధంగా బంజారా హిల్స్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీధర్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు చేశారు. పంజాగుట్టలోని ధనుంజయ్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఇంట్లో ఉన్నారా? అని ఆరా తీశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, కడప, బెంగళూరులోనూ లిక్కర్ బాస్‌ల గురించి ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఈ ముగ్గురు నోరు విప్పితే అంతిమ లబ్ధిదారు విషయం వెలుగులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ పెద్దలు ఆ ముగ్గురినీ అజ్ఞాతంలోకి పంపినట్లు సిట్ వర్గాలు అనుమానిస్తున్నాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.